రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెహెల్కా మాజీ సంపాదకుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

ఆశిష్‌మిశ్రా బెయిల్ షరతుల సడలింపునకు 'సుప్రీం' నో

విరాళాల స్వీకారణలో డిఎంకె టాప్ 07



సంపుటి 09, సంచిక: 248 | శుక్రవారం | 07-08-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


మునుగోడులో..



ఏడూళ్ల బయ్యారంలో...



# బద్లావ్ జరూరీ హై

## మోదీ సర్కార్ ప్రజాకంటక పాలనను ఎండగడుతూ సిపిఐ పాదయాత్రలు షురూ

**రాష్ట్రవ్యాప్తంగా వీధుల్లో కదంతొక్కిన కమ్యూనిస్టులు**

**అడుగడుగునా ఆదరించిన ప్రజలు**

కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కార్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు 'బద్లావ్ జరూరీ హై' పేరుతో గురువారం పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. ఈ యాత్రలు ఈనెల 14వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. రాష్ట్రంలో తొలి రోజు యాత్రలను నల్లగొండ జిల్లా మునుగోడులో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హనుమకొండలో, రాష్ట్ర మరో సహాయ కార్యదర్శి ఇటి నరసింహ హైదరాబాద్‌లో, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి కరీంనగర్‌లో, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ మంచిర్యాలలో, బాగం హేమంతరావు ఖమ్మంలో, ఎం బాలనర్సింహ నాగర్‌కర్నూల్‌లో, వీఎస్ బోస్ ఇసిఐఎల్‌లో, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మునుగోడులో పార్టీ శ్రేణులతో కదంతొక్కారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన పాదయాత్రల్లో మదనపల్లిలో సిపిఐ సీనియర్ నాయకులు కె.నారాయణ, విజయవాడలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య నాయకత్వం వహించారు. దేశంలో పెరుగుతున్న ధరలను తక్షణమే అరికట్టాలని, ప్రతీ యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టభద్రత కల్పించాలని, కార్మికుల హక్కులు పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని సిపిఐ శ్రేణులు నినదించారు.

## దేశంలో దొంగల రాజ్యం

- మార్పు అత్యవసరం
- కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు తిప్పి కొడదాం
- యువత పోరాటంతో దిగొచ్చిన మోదీ సర్కార్
- ప్రజా ప్రయోజనాల కోసం కడదాకా పోరాడేది కమ్యూనిస్టులే : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/హనుమకొండ/హైదరాబాద్

బిజెపి రూపంలో దేశంలో దొంగల రాజ్యం సాగుతోందని, వారి నుంచి భారత్‌ను కాపాడుకొని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు మార్పు కావాలని, మార్పు అనివార్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్పు కోసమే పోరాటం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కేంద్రంలో నానాటికీ పెరిగిపోతున్న బిజెపి ప్రజావ్యతిరేక పాలనను నిరశిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ప్రజాచైతన్య యాత్ర గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో కూనంనేని సిపిఐ జెండాను ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ గ్రామంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఎఐటియుసి జెండాను, బయ్యారం క్రాస్ రోడ్‌లోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. సెంటర్‌లోని కొమరం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. తొలిరోజు బయ్యారం క్రాస్‌రోడ్ మీదుగా రామానుజవరం, మణుగూరు, అశ్వాపురం, మొండికుంట వరకు ప్రజాచైతన్యయాత్ర సాగింది. యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. డప్పు వాయిద్యాలు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, మోదీ అనుకూల కార్పోరేట్ శక్తుల రూపంలో దేశంలో దొంగల రాజ్యం సాగుతోందన్నారు. దేశ ప్రజల సంపదను కారుచౌకగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ దొంగలు, ప్రజాధనాన్ని కారుచౌకగా దోచుకునే బడా చోరులు, పరిశ్రమల్లో కార్పోరేట్ ఆస్పత్రుల్లో సిఎంఆర్‌ఎఫ్ నిధుల మాయలో, విద్య వైద్యం ప్రైవేటు వంటి దొంగల రాజ్యం దేశంలో నిసిగ్గుగా సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దొంగలందరినీ పెంచి పోషిస్తున్న మోదీ భరతం త్వరలోనే పడతామని చెప్పారు. నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా వాటిని అదుపు చేయలేకపోతున్నారని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన


తరువాయి 8లో


## మత విద్వేష రాజకీయాలతో ప్రజాసమస్యలు పక్కదారి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం /మునుగోడు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టేందుకు సిపిఐ దేశవ్యాప్తంగా ప్రచార జీపు యాత్రలు నిర్వహిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రచార జీపు యాత్రను జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, మత విద్వేషాలను రెచ్చగొడుతూ తన వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారని మండిపడ్డారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం దేశ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీల అమలులో జాప్యం చేస్తోందని పేర్కొన్న వారు, నల్లగొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన ఎస్‌ఎల్‌బిసి,డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ ప్రాజెక్టులు పూర్తయితేనే జిల్లాలో సాగు,


తరువాయి 8లో





హైదరాబాద్‌లో..



కరీంనగర్‌లో...



హనుమకొండలో..

## కొత్త లామినేటెడ్ రేషన్ కార్డులు పంద్రాగస్టు నుంచి పంపిణీ

సంగారెడ్డిలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల మందికి అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ నుంచి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్త లామినేటెడ్ రేషన్ కార్డులను అందించనుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురువారం అధికారిక మెమో జారీ


తరువాయి 8లో


## వచ్చే నెలలో 'క్యా బోల్తీ పబ్లిక్'

ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించిన సిజెపి

దేశంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రజల అభిప్రాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామని వెల్లడి



**ఛత్రపతి సంభాజీనగర్ :** 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మరో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ప్రజలతో మమేకమవ్వడానికి, వారి సమస్యలను తెలుసుకోవడానికి 'క్యా బోల్తీ పబ్లిక్' (ప్రజలేమంటారు?) అనే ప్రచార కార్యక్రమాన్ని వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం ప్రకటించారు. మహారాష్ట్రలోని తన స్వస్థలమైన ఛత్రపతి సంభాజీనగర్‌లో పార్టీ కోర్ కమిటీ సమావేశం బుధ, గురువారాల్లో జరిగింది. సమావేశాలు ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో


తరువాయి 8లో


## హోర్ముజ్ జలసంధి తెరుచుకునే అవకాశం!



**దుబాయ్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్న హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు మెరుగుపడ్డాయి. ముడి చమురు రవాణాకు అత్యంత కీలకంగా మారిన ఈ జలసంధిని అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనిని తిరిగి తెరవడంతోపాటు, ఇతరత్రా అంశాలపై చర్చలు జరుగుతున్నాయని, ఏ క్షణమైనా ఒప్పందం కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇది వరకే ప్రకటించగా, ఇరాన్ కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. 'పిటిఐ' కథనం ప్రకారం, హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఇరాన్, ఒమాన్‌దేశాలు ఒక ముఖ్యమైన ద్వైపాక్షిక ఒప్పంద ముసాయిదాను చివరి దశకు చేర్చాయి. ఈ ఒప్పందం ద్వారా ముఖ్యంగా నౌకాయాన మార్గాలు, నిర్వహణ పద్ధతులను స్పష్టంగా నిర్వచించడం ద్వారా ఈ ప్రాంతంలో సముద్ర మార్గంలో స్థిరత్వాన్ని,


తరువాయి 8లో

# సోషల్ మీడియాపై నియంత్రణకు కేంద్రం ఎత్తులు?

నీట్ పేపర్ లీకేజీ ఉద్యమంలో వాస్తవాలను ప్రజలకు చేర్చడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించింది. ప్రధానంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా తమ నిరసనలను సృజనాత్మకంగా, జూలై 20న పోలీసుల దమనకాండ దృశ్యాలను కళ్ళకు కట్టినట్లుగా ప్రపంచం ముందుంచింది. అలాంటి సోషల్ మీడియాను పరోక్షంగా నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డదోవన పన్నాగాలు పన్నుతున్నట్లు తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. జంతర్ మంతర్ పరిణామాల తదనంతరం ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన వీడియో సందేశాన్ని ఆయన ఫేస్ బుక్ ఖాతాలో కొంత సేపు నిలిపివేశారు. దీనిపై ప్రభుత్వ వర్గాలు సోషల్ మీడియా యజమాని అయిన 'మెటా' సంస్థను ప్రశ్నించటంతో సాంకేతిక కారణాలతో పొరపాటు జరిగిందని ఐదు గంటల తరువాత ఆ వీడియోను పునరుద్ధరించారు. అయితే, అప్పటికే ఆ వీడియో ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రజలకైతే చేరింది. కానీ, ప్రభుత్వ పెద్దలు అంతటితో ఆగలేదు. జంతర్ మంతర్ ఉద్యమం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళడంలో సోషల్ మీడియానే ప్రధాన భూమిక పోషించిన విషయం వారి మదిలో మెరమెర అం టూనే ఉంది. అందుకే ప్రధాని వీడియోను ఆపేశారనే సాకుతో ఎలాగైనా సోషల్ మీడియా యాజమాన్యాలను లొంగదీసుకోవాలనే తలంపుకొచ్చినట్లు అర్థమవుతోంది. ప్రధాని ప్రసంగ వీడియో నిలిపివేత నేపథ్యంలో మెటా, గూగుల్, యూట్యూబ్, స్నాప్ తదితర సోషల్ మీడియా వేదికల నిర్వాకులకు బిజెపి ఎంపి నిశికాంత్ దూబే నేతృత్వంలోని కమ్యూనికేషన్స్, ఐటి పార్లమెంటరీ స్థాయీ సంఘం సోమవారం నాడు సమన్లు జారీ చేసింది. ఇదే స్థాయీ సంఘ సభ్యుడైన కాంగ్రెస్ ఎంపి షఫి పరంబిల్ సాంకేతికతను నియంత్రించాలే తప్ప ప్రజాస్వామ్యాన్ని కాదని తన వాదనను స్ప ష్టంగా వినిపించారు. రాజకీయ ఒత్తిళ్ళకు అనుగుణంగా లేదా చట్టబద్ధమైన అసమ్మతిని నేరపూరితం చేయటం ద్వారా విషయాన్ని(కంటెట్‌ను) నియంత్రించవద్దని నొక్కి చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం పంతం వీడలేదు. మూడు రోజుల లోగా 'మెటా' ఛీఫ్ మార్క్ జ్యాకర్‌బెర్గ్ క్షమాపణ చెప్పాలని, లేదంటే థర్ట్ పార్టీ కంటెంట్ విషయంలో మెటాకు కల్పించిన చట్టపరమైన రక్షణలు తొలగిస్తామని స్థాయీ సంఘం చైర్మన్ నిశికాంత్ దూబే హెచ్చరికలు జారీ చేశారు. ఇదంతా జరుగుతుండగానే గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ జోయెల్ కప్లన్ నేతృత్వంలోని 'మెటా' ప్రతినిధి బృందం మంగళ, బుధవారాలలో ప్రభుత్వ అధికారులు, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వివరణిచ్చుకుంది. మెటా తరుపున క్షమాపణను తెలియజేసింది. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో జంతర్‌మంతర్ నిరసనలకు ఇన్‌స్టాగ్రామ్ పెద్ద ఎత్తున ప్రాధాన్యత నివ్వడంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని కట్టడి చేయడమే దీని ఉద్దేశ్యమని వేరే చెప్పనక్కర్లేదు. సమావేశం జరిగిన మరుసటి రోజే తమ ఖాతా నుంచి ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్ ను ఇన్‌స్టాగ్రామ్ తమ ఖాతా నుంచి తొలగించినట్లు పలువురు నెటిజెన్‌లు స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఇందుకు ఊతమిస్తోంది. అలాగే జంతర్‌మంతర్ నిరసన, లాఠీఛార్జ్‌ల వీడియోలు కూడా చాలా వరకు ఇప్పుడు సోషల్ మీడియాలో మాయమయ్యాయి.

'మెటా'నే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో లోతుగా పరిశీలిస్తే అర్థమవుతోంది. జెన్ జీ తరం ఎక్కువగా వినియోగించే 'ఇన్‌స్టాగ్రామ్', వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర యాప్‌లకు యజమాని 'మెటా'నే కావడం విశేషం. భారతదేశంలో వాట్సాప్‌ను సుమారు 57 కోట్లు, ఇన్‌స్టాగ్రామ్‌ను 48 కోట్లు, ఫేస్‌బుక్‌ను 40 కోట్లకుపైగా వినియోగిస్తున్నారు. ప్రపంచంలోనే భారతదేశంలో అత్యధిక సోషల్ మీడియా వినియోగదారులు కలిగిన 'మెటా'ను అందుకే ఎంచుకున్నారు. సోషల్ మీడియా సంస్థలను లొంగదీసుకొని, పరోక్ష పద్ధతిలో అసమ్మతి, నిరసనలను ప్రజలకు చేరకుండా పాలకులు పరోక్షంగా గొంతునొక్కే ప్రయత్నం కనపడుతున్నది. అయితే, హైదరాబాద్‌లో మెటా సంస్థపై నమోదైన కేసును కేంద్ర ప్రభుత్వం ఆసరా తీసుకోవడం గమనార్హం. ఆ కేసును నమోదు చేసిన పోలీసు అధికారి బదిలీ అవడం, దానిపై కాంగ్రెస్, బిజెపిల మధ్య మాటల యుద్ధం సాగుతుండడం వేరే విషయం. నిజానికి సోషల్ మీడియాపైనే యువత ఆధారపడడానికి అసలు కారణం ప్రధాన స్రవంతి మీడియా వైఫల్యాన్ని జంతర్‌మంతర్ ఉద్యమం ఎత్తిచూపుతున్నది. నీట్ లీకేజీకి వ్యతిరేకంగా దాదాపు నెల రోజులు పార్లమెంటు సమీపంలో నిరసన, నిరశనలు చేపట్టినా ప్రభుత్వం అహంకారపూరిత మొండి పట్టుదలకు పోయింది. పరాకాష్ఠగా జూలై 20న 'సంసద్ చలో'కు దేశమంతటి నుంచి తరలివచ్చిన వచ్చిన యువతీయువకులపై కేంద్రం ఆధీనంలోని ఢిల్లీ పోలీసులు, బలగాలు పైశాచికంగా విరుచుకుపడిన తీరు దేశ స్మృతిపథం నుంచి ఇంకా చెరిగిపోలేదు. అణిచివేస్తే తోకముడుస్తారనుకున్న యువత అంతే పట్టుదలతో కేంద్రంపై శాంతియుత ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో దిగొచ్చి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో జాతీయ మీడియా వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైంది. యువత ఆందోళనను చూపకుండా, నెల రోజులూ కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రవచనాలనే వల్లిస్తూ, జంతర్‌మంతర్ వైపు కన్నెత్తి చూడలేదు. యువతపై పోలీసుల అమానుష దాడి జరిగిన దృశ్యాలు కూడా చూపక, ఉల్టా పోలీసులపైనే వారు దాడి చేశారంటూ ప్రసారాలు చేయడం యువత ఆగ్రహాన్ని మరింత పెంచింది. ప్రధాన స్రవంతి మీడియా విస్మరించినప్పటికీ, జంతర్‌మంతర్ నిరసన, నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను మార్షలంతో అక్రమ తరలింపు, అన్నిటికి మించి జూలై 20న యువత, ప్రత్యేకించి యువతులపై పోలీసులు, కేంద్ర బలగాల దాష్టీకాన్ని దేశ ప్రజలకు చేర్చడంలో జెన్ జీ యువత సఫలీకృతమైంది. ఇందుకు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్ చాట్‌లు ఆసరా అయ్యాయి. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వ తీరు మారలేదు. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను మరుసటి రోజే పార్లమెంటు ప్రాంగణంలో తలపాగా పెట్టి, దండలు వేసి మరీ బిజెపి ఎంపిలు స్వాగతం పలికారు. యువతపై కేసుల పరంపరను కొనసాగించారు. చీకటి గదిలో పెట్టి కొడితే పిల్లైనా తిరగబడుతోందనేది లోకోక్తి. ఇప్పటికే 'సంసద్ చలో'లో బాష్పవాయువులు, లాఠీల దెబ్బలతో తమ భయం పోయిందని యువత గర్వంగా చెప్పకుంటోంది. అయినప్పటికీ, గుణపాఠం నేర్వని పాలకులు అసమ్మతి వినిపించేందుకు ఉన్న కొద్ది అవకాశాలను సైతం కాలరాసే కుతంత్రాలు సాగించటం నిరంకుశత్వానికి పరాకాష్ఠ. ప్రజాస్వామ్యానికి భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రతిపక్షం, అసమ్మతి, నిరసనలు ప్రాణవాయువు వంటివి. వాటిని తొక్కిపెట్టిన భయంకరమైన నియంతలు కాలగర్భంలో కలిసిపోయినట్లు చరిత్ర చెబుతోంది.

## సభకు రమ్మంటున్నారని హోం మంత్రికి చెప్పండి



**హోం మంత్రి (అమిత్ షా)ని సభకు రావాలని ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే కోరుతున్నారు. ఆయన అభ్యర్థనను పరిశీలించవలసిందిగా నేను మిమ్మల్ని(కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును) కోరుతున్నాను. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ప్రతిపక్షం అభిప్రాయాలను లేదా భావనలను మీరు హోం మంత్రికి తెలియజేయవచ్చు. ఖర్గే ఏమీ శాసించడం లేదు. కేవలం ఆయన అభ్యర్థనను, ప్రతిపక్ష భావనలను మాత్రమే వ్యక్తం చేశారు. కాబట్టి, ఆ భావనలను మీరు హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని నా విన్నపం.**

గురువారం సభలో రాజ్యసభ చైర్మన్
సి.పి.రాధాకృష్ణన్

# 'క్విట్ ఇండియా' నినాద రూపకర్త: యూసఫ్ మెహర్ అలీ

చరిత్రలో కొన్ని పదాలు కాలపరీక్షకు తట్టుకుని శాశ్వతంగా నిలిచిపోతాయి. అవి కేవలం అక్షరాల సమాహారంగా మిగిలిపోవు; ఒక కాలపు ఆవేదనకు స్వరమవుతాయి, ఒక జాతి ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలిపే పిలుపుగా మారతాయి. 'క్విట్ ఇండియా!' కేవలం రెండు పదాలు. కానీ ఆ రెండు పదాలే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాలు చేశాయి. బానిసత్వపు సంకెళ్లను తెంచుకోవాలన్న భారతీయుల అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచాయి. దేశమంతా ఆ నినాదం మారుమోగినప్పుడు ప్రతి గ్రామం ఉద్యమ కేంద్రంగా, ప్రతి వీధి స్వాతంత్ర్య పోరాట వేదికగా రూపాంతరం చెందింది. స్వేచ్ఛ ఇక వాయిదా వేయలేని లక్ష్యమని భారతీయ సమాజం స్పష్టంగా గ్రహించింది. ఈ చారిత్రక నినాదం వినగానే మనకు ముందుగా గుర్తుకొచ్చేది మహాత్మా గాంధీ. అయితే ఆ పదాలను తొలిసారిగా మలిచిన వ్యక్తి యూసఫ్ మెహర్ అలీ. భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను ప్రభావితం చేసిన అత్యంత శక్తివంతమైన నినాదాలకు రూపకర్త అయిన ఈ నాయకుడు, తన సేవలకు చరిత్రలో తగిన గుర్తింపును పొందకపోవడం విచారకరం. 1903 సెప్టెంబర్ 23న బొంబాయిలోని ఒక సంపన్న, విద్యావంతమైన కుటుంబంలో జన్మించిన యూసఫ్ మెహర్ అలీ న్యాయశాస్త్రంలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. విజయవంతమైన న్యాయవాదిగా సౌకర్యవంతమైన జీవితం గడిపే అవకాశం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అభివృద్ధికంటే దేశ విముక్తినే తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. న్యాయస్థానాల్లో వాదనలు వినిపించడం కంటే ప్రజల హక్కుల కోసం వీధుల్లో పోరాడడమే తన ధర్మమని భావించారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న వలసవాద వ్యతిరేక ఉద్యమాలు, కార్మిక పోరాటాలు ఆయన ఆలోచనలను ప్రభావితం చేశాయి. ఆయన దృష్టిలో సామ్యవాదం అంటే కేవలం ఆర్థిక సిద్ధాంతం కాదు; ప్రతి మనిషి గౌరవంగా జీవించే సమాజాన్ని నిర్మించే విలువల వ్యవస్థ. అప్పుల బంధనాల నుంచి రైతు విముక్తి పొందాలని, కార్మికుడికి న్యాయమైన వేతనం లభించాలని, కులమతాల గోడలు సమాజాన్ని విభజించకూడదని ఆయన విశ్వసించారు. ఈ ఆలోచనలే విద్యార్థులు, కార్మికులు, యువతను ఒకే ఉద్యమ వేదికపైకి తీసుకువచ్చే నాయకుడిగా ఆయనను నిలబెట్టాయి.



ప్రజలను సంఘటితం చేయాలంటే సరళమైన, పదునైన భాష అవసరమని మెహర్ అలీ తొలినాళ్లలోనే గ్రహించారు. గంటలకొద్దీ సాగే ప్రసంగాల కంటే, ఒక చిన్న నినాదమే లక్షలాది మందిని ఒక్క క్షణంలో ఏకం చేయగలదని ఆయన నమ్మారు.

1928లో భారతీయుల ప్రమేయం లేకుండా బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ కమిషన్‌ను నియమించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. ఆ సమయంలో బొంబాయి వీధుల్లో ఆయన వినిపించిన 'సైమన్ గో బ్యాక్' నినాదం క్షణాల్లో దేశమంతా వ్యాపించింది. విద్యార్థుల నుంచి కార్మికుల వరకు, సభల నుంచి గోడ రాతల వరకు అదే నిరసనకు ప్రతీకగా మారింది. 1942 నాటికి రెండో ప్రపంచ యుద్ధం, బ్రిటిష్ పాలకుల నిర్లక్ష్యం, స్వాతంత్ర్య ఆకాంక్ష దేశాన్ని కీలక మలుపు వద్దకు తీసుకొచ్చాయి. అలాంటి సమయంలో మెహర్ అలీ మలిచిన 'క్విట్ ఇండియా' నినాదం బ్రిటిష్ పాలనకు నేరుగా విసిరిన సవాలుగా నిలిచింది. ఆ పదబంధంలోని స్పష్టతను, ఉద్యమశక్తిని మహాత్మా గాంధీ వెంటనే గుర్తించి స్వీకరించారు. 1942 ఆగస్టు 8న గాంధీజీ ఇచ్చిన 'చావో రేవో' (డూ ఆర్ డై ) పిలుపుతో కలసి 'క్విట్ ఇండియా' భారత స్వాతంత్ర్య పోరాటానికి తుది సమర ఘంటికగా మారింది.

ప్రజలను ఉద్యమబాట పట్టించగల అసాధారణ నాయకుడిగా భావించిన బ్రిటిష్ పాలకులు ఆయనను పలుమార్లు జైలుకు పంపారు. అయితే జైలు గోడలు ఆయన ఆలోచనలను నిర్బంధించలేకపోయాయి. స్వాతంత్ర్యం అనంతరం నిర్మించాల్సిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై ఆయన అక్కడే లోతుగా ఆలోచించారు. తరువాత ముంబయి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మెహర్ అలీ ఉద్యమ స్ఫూర్తినే పరిపాలనలోనూ ప్రతిబింబించారు. నగర అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదని, సాధారణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలేనని నమ్మారు. ప్రజా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. నిరంతర ఉద్యమాలు, జైలు జీవితం ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది కాలానికే, కేవలం 47 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. జీవితం చిన్నదైనా, ఆయన ఆలోచనలు, నినాదాలు భారత చరిత్రలో శాశ్వత ముద్ర వేశాయి. విచిత్రమేమిటంటే, 'క్విట్ ఇండియా', 'సైమన్ గో బ్యాక్' వంటి నినాదాలు ప్రతి భారతీయుడికి సుపరిచితమైనప్పటికీ, వాటి రూపకర్త యూసఫ్ మెహర్ అలీ పేరు మాత్రం అంతగా ప్రజల్లో ప్రాచుర్యం పొందలేదు. అధికారాన్ని ఆశించని, కీర్తి కోసం పరుగులు తీయని ఆయన తనకోసం స్మారకాలు నిర్మించుకోలేదు; ఒక జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పదాలను మాత్రం సృష్టించి వెళ్లారు. అందుకే నేడు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని స్మరించుకోవడం అంటే కేవలం ఒక చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకోవడం కాదు; స్వేచ్ఛను ఒక సమర నినాదంగా మలిచిన ఆ మేధావిని, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ అసమాన త్యాగధనుడిని గౌరవించుకోవడమే.

**– ఎండి. ఉస్మాన్ ఖాన్**

# ఉత్తర తెలంగాణలో ప్రయాణికుల రైళ్ల పట్ల నిర్లక్ష్యం

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్ ఎంతో విస్తీర్ణం కలిగి ఉన్నప్పటికీ, ఉత్తర తెలంగాణ ప్రజల రైల్వే అవసరాల పట్ల సంవత్సరాలుగా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది. ప్రజలు కొత్త రైళ్లు, రైళ్ల పొడిగింపులు, అదనపు బోగీలు, మెరుగైన సౌకర్యాలు కోరితే ప్రతిసారి వినిపించే సమాధానాలు మూడు మాత్రమే – 'రైల్వే లైన్ రద్దీగా ఉంది', 'బొగ్గు రవాణాకు ప్రాధాన్యం', 'సింగిల్ లైన్'. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన చోట, ఇవే కారణాలను పదే పదే చెప్పడం ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేయడమే. దక్షిణ మధ్య రైల్వే లోని హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల వారి ప్రాధాన్యత ప్రయాణికులు కాగా, సికింద్రాబాద్‌లో వారి ప్రాధాన్యత రవాణా మాత్రమే. ప్రత్యేకించి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో సిర్పూర్ కాగజ్‌నగర్, భద్రాచలం రోడ్ మణుగూరు నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్ లేదా లింగంపల్లి మార్గంలో కొత్త రైళ్లు నడపాలన్నా, రైళ్లను పొడిగించాలన్నా ఇదే సమాధానం వస్తోంది. సికింద్రాబాద్–కాజీపేట జంక్షన్ రైల్వే లైన్ రద్దీగా ఉంది, కాజీపేట జంక్షన్ –భద్రాచలం రోడ్ మార్గం బొగ్గు రవాణాకు కీలకమైనదని, కాజీపేట జంక్షన్ –సిర్పూర్ మార్గం బొగ్గు రవాణా, సిమెంట్, ఆటో మొబైల్స్, వ్యవసాయ సరుకు రవాణాకు కీలకమైనదని. డోర్నకల్ జంక్షన్–భద్రాచలం రోడ్ వరకు సింగిల్ లైన్ బొగ్గు రవాణా కీలకం అని చెబుతూ ప్రజల అవసరాలను పక్కన పెడుతున్నారు. అయితే ఇదే సమయంలో బీబీనగర్–గుంటూరు మార్గంలో కూడా సింగిల్ లైన్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ నలభైకి పైగా ప్రయాణికుల రైళ్లు, బొగ్గు, సిమెంట్,ఆహార ధాన్యాలు (ఎఫ్‌సిఐ),ఇనుము – ఉక్కు, ఎరువులు, సాధారణ పారిశ్రామిక వస్తువుల రవాణా ఉన్నా, విజయవంతంగా నడుస్తున్నాయి. అక్కడ సాధ్యమైతే, ఇక్కడ ఎందుకు సాధ్యం కాదనే ప్రశ్నకు సమాధానం లేదు. రైల్ నిలయం లేదా డిఆర్‌ఎం కార్యాలయానికి అధికారులను కలిసి వినతి పత్రం అందించేందుకు వెళితే, వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. గ్రీవెన్స్ సమయాల్లో వెళ్లినా అధికారులను కలిసే అవకాశం దాదాపు ఉండదు. 'అధికారి బిజీగా ఉన్నారు... డిస్పాచ్ సెక్షన్‌లో ఇవ్వండి' అనే సమాధానమే వస్తుంది. డిస్పాచ్ విభాగంలో వినతి పత్రం సమర్పించినా, నెలలు గడిచినా ఎలాంటి స్పందన ఉండదు. కనీసం చర్యల పురోగతి తెలియజేయరు. ప్రజల సమస్యలు వినడానికి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో లేకపోతే, ఆ వ్యవస్థ ఉద్దేశం ఏమిటి? ప్రజలు, ప్రయాణీకుల సంఘాలు, సాధారణ ప్రయాణీకులు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలు వివరించే అవకాశం కల్పించాలి. కేవలం 'డిస్పాచ్‌లో ఇవ్వండి' అనే సమాధానంతో ప్రజల గొంతును అణచివేయకూడదు.ఆర్‌టిఐ లేదా పిజి పోర్టల్‌లో మనం ఏదైనా అడిగితే, 'Noted', 'Will be examined' వంటి మాటలు ఇప్పుడు అక్షరాలా 'శాశ్వతంగా పెండింగ్' లేదా 'చెత్తబుట్టలో వేసినట్టే' అనే అర్థం ఇస్తున్నాయి. ప్రజల సమస్యలను నిజంగా పరిష్కరించలేకపోతే ఆర్‌టిఐలు, పిజి పోర్టళ్లు (Public Grievance Portal) ఫిర్యాదులు పెట్టడం వల్ల ప్రయోజనం ఏమిటి? కోవిడ్ కాలంలో నిలిపివేసిన అనేక రైళ్లు ఇతర డివిజన్లలో తిరిగి ప్రారంభమయ్యాయి. కానీ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన పలు రైళ్లు ఇప్పటికీ పునరుద్ధరించబడలేదు. ఉదాహరణకి కోవిడ్ ముందు మణుగూరు నుండి ప్రతిరోజూ నాలుగు నుండి ఐదు రైళ్లు నడిచేవి, దీంతో ప్రజలకు మంచి రైల్వే అనుసంధానం ఉండేది. అయితే, కోవిడ్ తర్వాత ప్రస్తుత స్థితి పూర్తిగా భిన్నమైనది, ఇప్పుడు వారి ప్రాధాన్యత కేవలం బొగ్గు రవాణా మాత్రమే, 30కి పైగా రవాణా రేకులు నడుస్తున్నాయి, కనీసం కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్ల గురించి అడిగితే, సమాధానం సింగిల్ లైన్, మా ప్రాధాన్యత బొగ్గు రవాణా అనే వస్తుంది. కోవిడ్‌కు ముందు నడిచిన రైళ్లు ఇప్పుడు ఎందుకు పునరుద్ధరించడం లేదు? అనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. భద్రాచలం రోడ్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తిరుపతి, విశాఖపట్నం, బాసరా, ఢిల్లీ, షిర్డీ, చెన్నై, బెంగళూరు, వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలు, నగరాలకు ప్రత్యక్ష రైలు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా, ఇప్పటికీ ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదు. అప్పట్లో ప్రయాణికుల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చిన రైల్వే అధికారులు, ప్రస్తుతం బొగ్గు సరుకు రవాణాకు (Coal Freight) మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన రైలు సేవలను నిర్లక్ష్యం చేస్తున్నారు. సరుకు రవాణాతో పాటు ప్రయాణికుల సౌకర్యానికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని వినమ్రంగా కోరుతున్నాము. సికింద్రాబాద్–సిర్పూర్, సికింద్రాబాద్–భద్రాచలం రోడ్డు మార్గంలో నడిచే రైళ్లకు అవసరమైన అదనపు బోగీలు కూడా కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాలకు ఇప్పటికే ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో రైళ్లు నడుస్తున్నాయి. కొత్త ఎల్‌హెచ్‌బి కోచ్‌లను కూడా కేటాయిస్తున్నారు. కానీ మేము అడిగితే మాత్రం ఒకటే సమాధానం— ఎల్‌హెచ్‌బి కోచ్‌లు అందుబాటులో లేవు. ఇతర ప్రాంతాలకు ఉన్న కోచ్‌లు మా ప్రాంతానికి ఎందుకు లేవు? ఇది కోచ్‌ల కొరతా, లేక మా ప్రాంతం పట్ల నిర్లక్ష్యమా? ప్రజలకు స్పష్టమైన సమాధానం కావాలి.. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ, ప్రయాణికులకు అవసరమైన రైళ్లు, బోగీలు, నిర్వహణ సదుపాయాలు కల్పించకపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. భద్రాచలం రోడ్‌లో ఇప్పటికే 14 కోచ్‌ల నిర్వహణకు అనువైన పిట్‌లైన్ సౌకర్యం ఉన్నప్పటికీ దానిని సమర్థంగా వినియోగించడం లేదు. ప్రస్తుతం 24 కోచ్‌ల నిర్వహణకు తగిన పిట్‌లైన్ విస్తరణ అవసరం ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కూడా పిట్‌లైన్ ఏర్పాటు కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా విజ్ఞప్తులు చేస్తున్నా ఇప్పటికీ ఫలితం లేదు. ప్రతి కొత్త రైళ్ల ప్రతిపాదనను 'ప్రైమరీ నిర్వహణ సౌకర్యం లేదు' అనే కారణంతో తిరస్కరించడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. వారు పిట్‌లైన్‌లు నిర్మించరు కొత్త రైళ్లను ఇవ్వరు. మాకు పిట్‌లైన్‌లు నిర్మాణం పూర్తయితే వారు కొత్త రైళ్లు వస్తాయి



### కాజీపేట రైల్వే డివిజన్

ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు.కాజీపేట ఉత్తర, దక్షిణ ప్రాంతలు కలిపే ప్రధాన కూడలి. గ్రాండ్ ట్రంక్‌లోని ప్రధాన కూడలి. కాజీపేటలో ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పడితే తెలంగాణ ఉత్తర, తూర్పు జిల్లాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుంది. కొత్త రైళ్ల ప్రవేశం, రైళ్ల పొడిగింపులు, అదనపు బోగీల కేటాయింపు, పిట్‌లైన్‌లు, కోచ్ నిర్వహణ కేంద్రాలు, సరుకు రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలు వేగవంతమవుతాయి. అంతేకాకుండా వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు ఏర్పడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతాయి. ప్రజలకు అవసరమైన నిర్ణయాలు స్థానిక స్థాయిలోనే తీసుకునే పరిపాలనా సామర్థ్యం పెరుగుతుంది. రైల్వే డివిజన్ అనేది కేవలం ఒక పరిపాలనా కార్యాలయం మాత్రమే కాదు; అది ఒక ప్రాంత అభివృద్ధికి పునాది. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల న్యాయమైన రైల్వే అవసరాలను తక్షణమే తీర్చాల్సిన బాధ్యత భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వేపై ఉంది. ఇకపై 'మార్గ సామర్థ్యం సరిపోదు', 'బొగ్గు రవాణా', 'ఒకే మార్గం' అనే సాకులు కాకుండా, ప్రజలకు అవసరమైన రైల్వే సేవలు అందించే దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

**నూకల మణిచంద్ర యాదవ్**

# కంపెనీల లాభాలే కాదు – కార్మికుల జీవితం కూడా ముఖ్యమే

ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే అక్కడి కార్మికులను ఎలా చూస్తున్నారో గమనిస్తే సరిపోతుంది. ఆర్థికవృద్ధి, సాంకేతిక ప్రగతి, ప్రపంచ స్థాయి కంపెనీలు అన్నీ ముఖ్యమే. కానీ వాటి వెనుక నిలబడి చెమటోడ్చే మనిషి ఆరోగ్యం, అతని కుటుంబ జీవితం, అతని మానసిక ప్రశాంతత, అతని గౌరవం కంటే ఏ లాభమూ పెద్దది కాదు. ఈ మౌలిక సత్యాన్ని గుర్తుచేసే సంఘటన ఇటీవల ఫ్రాన్స్‌లో చోటుచేసుకుంది. ఫ్రాన్స్‌లో ఇన్ఫోసిస్ సంస్థ ఉద్యోగుల పనివేళలను నమోదు చేసే విధానం అక్కడి కార్మిక చట్టాలకు అనుగుణంగా లేదని నిర్ధారించిన కార్మిక శాఖ, సంస్థపై రూ.175,000 జరిమానా విధించింది. ఈ చర్య వెనుక ఉద్దేశం కేవలం ఒక కంపెనీని శిక్షించడం కాదు. కార్మిక చట్టాలు అనేవి కాగితాలపై రాసిన నిబంధనలు మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి జీవితాన్ని రక్షించే భద్రతా కవచమని ప్రపంచానికి తెలియజేయడమే. ఫ్రాన్స్‌లో వారానికి చట్టబద్ధమైన సాధారణ పనివేళలు 35 గంటలు. అదనంగా పనిచేస్తే అదనపు వేతనం, విశ్రాంతి సమయం, సెలవులు, ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై కఠినమైన నిబంధనలు ఉన్నాయి. యజమానులు ప్రతి ఉద్యోగి ఎంతసేపు పనిచేశాడో ఖచ్చితంగా నమోదు చేయాలి. ఎందుకంటే పనిగంటలు దాచిపెడితే, అదనపు శ్రమను దోచుకోవడం చాలా సులభమవుతుంది. అందుకే అక్కడ చట్టం ఉద్యోగి తరఫున నిలుస్తుంది.

ఈ సంఘటన మరోసారి ఒక పెద్ద చర్చను ముందుకు తెచ్చింది. కొంతకా లం క్రితం వారానికి 70 గంటలు పనిచేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఎన్.ఆర్. నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఎక్కువ పనిచేయడం వ్యక్తిగత ఎంపిక కావచ్చు. కానీ దానిని సమాజమంతటికీ ఆదర్శంగా చూపించడం, లేదా సంస్థాగత సంస్కృతిగా మార్చడం చాలా జాగ్రత్తగా చూడాల్సిన అంశం. ఎందుకంటే ప్రతి ఉద్యోగి పరిస్థితి ఒకేలా ఉండదు. ఆరోగ్యం, కుటుంబ బాధ్యతలు, మానసిక సామర్థ్యం, వయస్సు, జీవన పరిస్థితులు అన్నీ వేర్వేరుగా ఉంటాయి. భారతదేశంలో కూడా కార్మికులను రక్షించే చట్టాలు ఉన్నాయి. కొత్తగా అమలులోకి వస్తున్న లేబర్ కోడ్స్‌తో పాటు, రాష్ట్రాల దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టాలు, ఫ్యాక్టరీల చట్టాలు ఉద్యోగుల పనిగంటలు, విశ్రాంతి, వారాంతపు సెలవులు, అదనపు పనికి అదనపు వేతనం వంటి అంశాలను నిర్దేశిస్తాయి. సాధారణంగా రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటలకు మించి పనిచేయిస్తే అదనపు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. వారానికి మొత్తం పనిగంటలకు కూడా పరిమితులు ఉంటాయి. అయితే చట్టాలు ఉండటం ఒక విషయం అయితే, వాటిని సమర్థంగా అమలు చేయడం మరో విషయం. అసంఘటిత రంగంలో, కొన్ని ప్రైవేట్ రంగ సంస్థ ల్లో ఉద్యోగులు తమ హక్కులను వినియోగించుకోవడం ఇప్పటికీ సులభం కాదు. అమెరికాలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుంది. అక్కడ ఫెడరల్ చట్టాల ప్రకారం సాధారణంగా వారానికి 40 గంటలకు మించి పనిచేస్తే అనేక వర్గాల ఉద్యోగులకు అదనపు వేతనం చెల్లించాలి. అయితే ఉద్యోగి వర్గాన్ని బ ట్టి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఐరోపాలోని అనేక దేశాల్లో మా త్రం పనిగంటలపై మరింత కఠినమైన రక్షణ ఉంది. యూరోపియన్ యూనియన్ నిబంధనల ప్రకారం సాధారణంగా వారానికి సగటున 48 గంటలకు మించి పనిచేయించరాదు. రోజువారీ విశ్రాంతి, వారాంతపు విశ్రాంతి, చెల్లిం పు సెలవులు వంటి హక్కులకు కూడా చట్టపరమైన రక్షణ కల్పించబడింది. అంటే ఉత్పాదకతతో పాటు మానవ జీవిత నాణ్యతకు కూడా సమాన ప్రాధా న్యం ఇవ్వాలనే దృక్పథం అక్కడ కనిపిస్తుంది.



పనిగంటలు పెరగడం అంటే కేవలం ఎక్కువ పని చేయడం మాత్రమే కాదు. అది క్రమంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయాన్ని తగ్గిస్తుంది. పిల్లల పెరుగుదలను చూసే అవకాశాన్ని దూరం చేస్తుంది. స్నేహాలు, సామాజిక సంబంధాలు, వ్యక్తిగత అభిరుచులు అన్నీ క్రమంగా కనుమరుగవుతాయి. విశ్రాంతి తగ్గడంతో గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం, ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచవ్యాప్తంగా అనేక వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. అలసిపోయిన ఉద్యోగి చివరకు సంస్థకూ ఎక్కువ ప్రయోజనం చేకూర్చడు.ఇంకోవైపు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, రోబోటిక్స్ వేగంగా విస్తరిస్తున్నా యి. ఒకవైపు మిగిలిన ఉద్యోగులను ఎక్కువ గంటలు పనిచేయమని కోరడం, మరోవైపు అదే సమయంలో వేలాది మంది ఉద్యోగులను తొలగించడం అనే పరిస్థితి అనేక రంగాల్లో కనిపిస్తోంది. సాంకేతిక అభివృద్ధిని ఎవరూ వ్యతిరేకించరు. కానీ దాని ఫలితాలు కొద్దిమంది వాటాదారుల లాభాలకే పరిమితమై, ఉద్యోగుల జీవితాలు అస్థిరంగా మారితే అది సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది. లాభాలను మాత్రమే అభివృద్ధి ప్రమాణంగా తీసుకునే ఆర్థిక వ్యవస్థ చివరికి సామాజిక అసంతృప్తిని కూడా పెంచుతుంది. ప్రపంచంలోని అనేక ప్రముఖ సంస్థలు ఇప్పుడు మరో దిశలో ఆలోచిస్తున్నాయి. ఉద్యోగులకు అనువైన పనివేళలు, ఇంటి నుంచే పని చేసే అవకాశాలు, మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, నాలుగు రోజుల పని వారంపై ప్రయోగాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నాయి. కారణం ఒక్కటే. సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్న ఉద్యోగి దీర్ఘకాలంలో సంస్థకు మరింత విలువను సృష్టిస్తాడనే అవగాహన పెరుగుతోంది.కార్మికుడి శ్రమ ఒక వస్తువు కాదు. అతను ఒక మనిషి. అతనికి కుటుంబం ఉంది. కలలు ఉన్నాయి. ఆరోగ్యం ఉంది. విశ్రాంతి తీసుకునే హక్కు ఉంది. అతని సమయాన్ని గౌరవించడం అంటే అతని జీవితాన్ని గౌరవించడం. ఆ హక్కును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి సంస్థకు ఉన్న నైతిక బాధ్యత కూడా. ఫ్రాన్స్ తీసుకున్న చర్య ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. ఆర్థికాభివృద్ధి పేరుతో కార్మిక హక్కులను విస్మరించరాదు. చట్టాలు కేవలం ఉల్లంఘించిన తర్వాత శిక్షించడానికే కాదు, శ్రమకు గౌరవం కల్పించడానికి కూడా ఉంటాయి. లాభాలు పెరగడం ఒక సంస్థ విజయానికి సూచిక కావచ్చు. కానీ ఆ లాభాల కోసం మనిషి ఆరోగ్యం, కుటుంబ జీవితం, గౌరవం బలి కావడం ఏ సమాజానికీ శాశ్వత అభివృద్ధి కాదు. నిజమైన అభివృద్ధి అంటే సంపదతో పాటు మానవ గౌరవాన్ని కూడా సమానంగా కాపాడగల వ్యవస్థను నిర్మించడమే.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**

# తెలంగాణ ఉద్యమం అసాధారణమైంది

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి పూనుకోవాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ జీవితాలు ప్రజాస్వామ్య మార్గంలో సామాజిక మార్పుసాధ్యమని నిరూపించాయని, వారి స్ఫూర్తితో సమాజ పరివర్తన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో గురువారం వారి చిత్రపటాలకు కోదండరామ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం అనేది సాధారణ ప్రజలు చేసిన ఒక అసాధారణ ఉద్యమమని అభివర్ణించారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను అత్యంత సరళంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి గద్దర్ అని అన్నారు. సాధారణ యువత తమ డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఇటీవల ఢిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, వనరుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం అహర్నిశలు శ్రమించారని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కొనియాడారు. 1952 నుంచే ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఉద్యమిస్తూ తొలి, మలిదశ ఉద్యమాలకు సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ వెనుకబడిన తరగతుల (బిసి) కమిషన్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. బిసి కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.
కార్యక్రమంలో బిసి కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.సునీత, సెక్షన్ అధికారులు జి.సతీష్ కుమార్, ఇర్ఫాన్ బిన్ ఖలీద్, రీసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణతో పాటు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటర్ కళాశాలల ఫోర్జరీ ఎన్‌ఒసిలపై విచారణ జరిపించాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి
కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా 180 కళాశాలలు హైడ్రా కమిషనర్, ఫైర్ సేఫ్టీ కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు పొందిన ఆయా కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేసి అన్ని కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ సంయుక్త కార్యదర్శి వసుంధరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఫోర్జరీ ద్వారా నిరభ్యంతర ధృవీకరణ పత్రాలు (ఎన్‌ఒసిల)పొందడమే కాకుండ ఇంటర్ విద్యావ్యవస్థ ప్రమాణాలు దిగజార్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కళాశాలల శానిటేషన్, ట్రాఫిక్ ఎన్‌ఒసిలపై కూడా విచారణ జరిపించాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల అనుమతుల పత్రాలను ఇంటర్ విద్యాశాఖ అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల అండదండలతోనే సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు పొందారని, హైదరాబాద్, రంగారెడ్డి ,మేడ్చల్ జిల్లాల డిఐఇఒలపై విచారణ జరిపించాలని వారి ఇళ్లపై ఐటి, ఎసిబి తనిఖీలు నిర్వహించాలని, ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు రద్దుతో పాటు సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా అన్ని కళాశాలల అనుమతులు, ఎన్‌ఒసిలు, గుర్తింపు పత్రాలను అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకునేలా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలు ఇంటర్ బోర్డ్ నిబంధన పాటించేలా చర్యలు తీసుకుని గుర్తింపు లేని కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పెరుమాండ్ల అనిల్, చైతన్య యాదవ్,మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హరీష్, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ ఎఫ్‌టిఇ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీ రామ్ జీ చట్టం ద్వారా రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపినప్పటికీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగుల దశాబ్దకాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. పే స్కేల్ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. త్వరలోనే మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై తదుపరి చర్యలపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌లోని బి.ఆర్.కే.ఆర్ భవన్‌లో ఉపాధి హామీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో మంత్రి సీతక్క గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల పే స్కేల్ అమలు, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, బదిలీల విధానం, ఇతర సర్వీస్ అంశాలపై జెఎసి ప్రతినిధులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. 2006లో డి.ఎస్సీ. ద్వారా ఎంపికై దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ తమకు పే స్కేల్ అమలు కాలేదని వారు వివరించారు. ఇది కేవలం జీతాల సమస్య కాదని, తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమన్నారు. మొత్తం మూడు వేల ఎనిమిది వందల మంది పనిచేస్తున్నామని, తమకు పేస్కేల్ అమలు చేస్తే నెలకు రెండున్నర కోట్ల రూపాయాలు మాత్రమే అదనపు భారం పడుతుందని వారు తెలిపారు. రాబోయే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నందున ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా క్రమంగా తగ్గుతుందన్నారు. దీనిపైన మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు తొందరపాటు చర్యలకు దిగొద్దని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసినచ్చారు. సమస్య పరిష్కారం దిశగా చర్చల ద్వారా ముందుకు సాగుదామన్నారు. జపాన్ తరహాలో ఎక్కువ పని చేసి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే మార్గాలు కూడా ఉన్నాయని, పని నిలిపివేయడం కంటే బాధ్యతాయుతమైన పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదని సీతక్క సూచించారు.

**కేంద్ర వాటా చెల్లించనందుకే నిలిచిన ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు...**

కేంద్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో గత మూడు నెలలుగా ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు నిలిచిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి, అనంతరం కేంద్రం నుంచి ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదని మంత్రి సీతక్క తెలిపారు. అందుకే జీతాల విడుదలలో జాప్యం జరుగుతోందని వివరించారు. ఈ సమావేశంలో ఎఫ్ టి ఈ జెఎసి సభ్యులు ఎలబద్రి లింగయ్య, ఏ అంజిరెడ్డి, ఎం విజయ్ కుమార్, ఈ వెంకట్రామిరెడ్డి, ఎం మోహన్ రావు పాల్గొన్నారు.

## ఢిల్లీ పార్టీల చేతుల్లో తల్లడిల్లుతున్న తెలంగాణ

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణ మళ్లీ తల్లడిల్లుతున్నదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. అప్పులపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఆర్‌బిఐ చెప్పినప్పటికీ వారికి చెవికెక్కడం లేదన్నారు. 'ప్రొఫెసర్ జయశంకర్' జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆయన విగ్రహానికి కెటిఆర్ గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి,మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఆశ పెట్టారని, దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం పిల్లలు కొట్లాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదంలేదన్నారు.తెలంగాణ మిగులు రాష్ట్రమని ఆర్థిక వేత్త బిపిఆర్ విఠల్ 1969,2001లో కేస్ స్టడీలో రాశారని,నీళ్లు,నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పంపులను ఆన్ చేయడంలేదని ఆరోపించారు. భావజాల వ్యాప్తి,తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై చర్చ జరగాలని, ఆ అన్యాయంపైన ఆందోళనలు చేపట్టాలని, ఈ ఆందోళనను రాజకీయ శక్తిగా మలచడమే డెమోక్రటైజేషన్ అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పేవారని గుర్తు చేశారు. కెసిఆర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ నూతన పంథాను నూరిపోశారన్నారు. తన జీవితంలో 'జై తెలంగాణ' అనని జైపాల్ రెడ్డి మేధావా?, అని ప్రశ్నించారు. కేశవరావు మేధావి అని చెబుతున్న సిఎం రేవంత్,ఆయన పక్కనే ఉన్న కోదండరాం పేరును మాత్రం చెప్పలేదన్నారు.

# ఉద్యమాల వేగుచుక్క బొల్లోజు అయోధ్య

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా
నిలిచిన నాయకుడు
ఆయన ఆశయ సాధనకు
పునరంకితంకండి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/మణుగూరు :** పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు బొల్లోజు అయోధ్య చిరస్మరణీయుడని, ఆయన మరణించి ఏడాది గడిచినా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అయోధ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో బొల్లోజు అయోధ్య స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం బాడిశా సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బొల్లోజు అయోధ్య సాధారణ నాయకుడు కాదని, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాటం చేసిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ప్రాంతంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా నిలిచి, సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనుదిరగని పోరాట యోధుడిగా ఆయన ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. నేటి యువత అయోధ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజల కోసం త్యాగం చేయడం, నిబద్ధతతో పనిచేయడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడడం వంటి విలువలను ఆయన జీవితం నేర్పుతుందని తెలిపారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో, పార్టీని బలోపేతం చేయడంలో అయోధ్య చేసిన సేవలు భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన లేని లోటు పార్టీకి, ప్రజలకు ఎప్పటికీ తీరనిదేనని పేర్కొన్న కూనంనేని, అయోధ్య ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త మరింత నిబద్ధతతో ప్రజా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఆయనకు అర్పించే గొప్ప నివాళి అని అన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షబీర్ పాషా మాట్లాడుతూ, అయోధ్యతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మణుగూరు ప్రాంతంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ప్రజలు ముందుగా గుర్తు చేసుకునే నాయకుడు అయోధ్య అని అన్నారు. పార్టీ, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన నిలిచిపోయారని కొనియాడారు.
అయోధ్య ప్రజా సేవా తపన, నిరాడంబర జీవనం, నిస్వార్థ పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, కొత్తగూడెం మేయర్ మూగ గణేష్, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అయోధ్య అభిమానులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# అగ్రిగేటర్ పాలసీకి ప్రభుత్వం కసరత్తు

ప్రయాణికుల భద్రత,
డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం
మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో యాప్ ఆధారిత రవాణా సేవలను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీ రూపకల్పనకు చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పాలసీ రూపకల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ కమిటీ ఇప్పటికే అగ్రిగేటర్ సంస్థలు, డ్రైవర్లు, వాహన యజమానులు, ప్రయాణికుల ప్రతినిధులు, రవాణా ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులు, సంబంధిత ప్రభుత్వ శాఖలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి సూచనలు, అభిప్రాయాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం, వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్లు, బీమా, భద్రతా ప్రమాణాలు, అగ్రిగేటర్ సంస్థల నమోదు, అనుమతులు, నియంత్రణ వ్యవస్థ, డిజిటల్ మానిటరింగ్, ఛార్జీల్లో పారదర్శకత, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, మహిళా ప్రయాణికులు, మహిళా డ్రైవర్ల భద్రత, ప్రభుత్వ శాఖలతో డేటా సమన్వయం, ఎలక్ట్రిక్, పర్యావరణహిత వాహనాల ప్రోత్సాహం వంటి అంశాలను కమిటీ పరిశీలించినట్లు మంత్రి వివరించారు. ప్రయాణికుల భద్రతతో పాటు డ్రైవర్ల సంక్షేమం, చట్టబద్ధమైన సేవలు, సాంకేతికత వినియోగం, పర్యావరణ పరిరక్షణ, వ్యాపార సౌలభ్యం మధ్య సమతుల్యతను సాధించే విధంగా పాలసీని రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమిటీ తన తుది సిఫారసులను సిద్ధం చేస్తోందని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఆ నివేదికను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిర్దేశిత విధాన ప్రక్రియ ప్రకారం తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీని అమలు చేసేందుకు ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడుతుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో అగ్రిగేటర్ ఆధారిత రవాణా సేవలకు స్పష్టమైన, ఆధునిక, పారదర్శకమైన, సమగ్ర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**PUBLIC NOTICE**
**CHANGE OF NAME**
I, **MUPPARAM KALPANA, W/o SUDERSHAN MUPPARAM**, residing at H.No.11-1-1945/B/305, Gangasthan-I, Maruthingar, Nizamabad town, Telangana State, India, have changed my name from **PRAMEELA MUPPARAM to MUPPARAM KALPANA** for all future purposes. Henceforth, I shall be known, called, and addressed as **MUPPARAM KALPANA**. All concerned are requested to note the same.

# రేపటి నుంచి 'గిగ్' కార్మికుల నిరవధిక సమ్మె


డిమాండ్లు పరిష్కరించకపోతే
రాష్ట్రవ్యాప్తంగా యాప్ సేవలకు
అంతరాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, యాప్ ఆధారిత అగ్రిగేటర్ సంస్థలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని వివిధ కార్మిక సంఘాలు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ యాప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరం (టిఎడిఎఫ్), తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు), సిఐటియు, బిఆర్‌టియు, టిఆర్‌టియు, ఐఎన్‌టియుసిఎఫ్, ఐఎల్‌డబ్ల్యుఎఫ్, ఐఎఫ్‌ఎటి, టిఎంసిడిఎ, టిజిఎఫ్‌డబ్ల్యుతో పాటు పలు కార్మిక, ప్రజా సంఘాలు ఈ సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మిక సంఘాల ప్రతినిధులు షేక్ సలావుద్దీన్, అజయ్ బాబు, ఎ. నగేష్ కుమార్, ఇనాయత్ అలీ బక్రీ, ఎం.ఎ. సలీమ్, రామకృష్ణారెడ్డి, అబ్దుల్ రవూఫ్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ గత జూలై 22న నిర్వహించిన రాష్ట్రవ్యాప్త 'బ్రేక్ ఫ్లాష్ సమ్మె'లో సుమారు 3.90 లక్షల మంది గిగ్ కార్మికులు పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం, యాప్ కంపెనీలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి, సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోయిందన్నారు. కనీస బేస్ ఫేర్‌తో పాటు ప్రతి కిలోమీటరు, ప్రతి నిమిషానికి న్యాయమైన చార్జీలను ప్రభుత్వం నోటిఫై చేయాలని, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ రూల్స్‌ను వెంటనే అమలు చేసి వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు 2025ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కమర్షియల్ రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ వాహనాలను యాప్ ఆధారిత ప్రయాణికుల, సరుకు రవాణా సేవల్లో వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాప్ కంపెనీలు నిర్మాణాత్మకంగా స్పందించకపోతే సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా క్యాబ్, ఆటో, డెలివరీ తదితర యాప్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సమ్మె వల్ల తలెత్తే పరిస్థితులకు ప్రభుత్వం, అగ్రిగేటర్ సంస్థలే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

# క్షుద్ర పూజలపై ప్రజలకు హరీష్‌రావు వివరణ ఇవ్వాలి

టిపిసిసి అధ్యక్షుడు
బి.మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్షుద్ర పూజల విషయంపై మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలకు వివరణ ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మూఢనమ్మకాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను హరీష్ రావును కించపరచలేదని, ఆయనపై ఎలాంటి తప్పుడు ప్రచారం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు వెళ్లిన ఆలయాలన్నీ క్షుద్ర పూజలకు ప్రసిద్ధి చెందినవేనని, అలాంటి ఆలయాలకు ఆయన ఎందుకు వెళ్లారో హరీష్‌రావు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.
తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అసత్యం లేదని, లీగల్ నోటీసులకు భయపడబోమని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయస్థానంలోనే పోరాడతామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలపై సమన్వయ కమిటీ చర్చిస్తే మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని భావించామన్నారు.
ప్రభుత్వం పార్టీ వేర్వేరు కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. తనకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య ఎలాంటి విభేదాలు లేవని తాము ప్రతి రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని, బుధవారం కూడా తాను సిఎంతో మాట్లాడినట్లు వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానము**
బల్కంపేట్, హైదరాబాద్. ఫోన్ నెం. 9491000696
నెం. 33/Works/SYPD/2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 05.08.2026
ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో వివిధ పనులకు టెండర్లు ఆహ్వానించడమైనది. బిడ్ సమర్పణ ప్రారంభ తేది: 06.08.2026 ఉ.10:00గం.ల నుండి మరియు బిడ్ సమర్పణ ఆఖరి తేది: 08.08.2026 సా.4:30గం.ల వరకు. వివరాలకు క్రింది వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- చైర్మన్ & ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
సం/- డిప్యూటీ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ ఆధికారి
DIPR R.O. No. : 7513-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మాదాపూర్ సర్కిల్-50
Lr.No: 16/EE/CIR-50/KPZ/CMC/2026-27 తేది: 06.08.2026

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 16/EE/CIR-50/ KPZ/CMC/ 2026-27, తేది: 06.08.2026 | సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50లో అభివృద్ధి పనులు | రూ. 4.99 లక్షలు | 07.08.2026 ఉ.10:30 గం.లకు, 08.08.2026 ఉ.10.30 గం.ల వరకు | శ్రీమతి సిహెచ్.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50. సెల్: 7995009113 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి
DIPR R.O. No. : 7484-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

**మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం : : నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూల్ జిల్లా.**
Tender Notice No. E2/168/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు Dt. 06.08.2026
నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల కోసం ( 2026-27 సాధారణ నిధుల కింద) 5 పనులకు సంబంధించిన టెండర్లు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పిలువబడ్డాయి.

| | |
|---|---|
| అంచనా విలువ | రూ.10.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ / సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో **దసరా పండుగ -2026** కోసం ట్యాంక్ బండ్ అలంకరణ, సౌండ్ సిస్టమ్, LED లైటింగ్స్ ఏర్పాటు |
| అంచనా విలువ | రూ. 02.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ /సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో **వనమహోత్సవం** కార్యక్రమం కింద ట్రీ గార్డ్స్ కొనుగోలు, ప్లాంటేషన్ |
| అంచనా విలువ | రూ.05.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ /సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో **వనమహోత్సవం** కార్యక్రమం కింద మొక్కలు నాటడానికి కూలీలను నియమించడం, సహాయక కర్రలను సప్లయ్ చేయడం, పంపిణీ చేయడం |
| అంచనా విలువ | రూ.03.00లక్షలు |
| పనిపేరు | సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో **బోనాల పండుగ-2026** కోసం ఏర్పాట్లు |
| బిడ్ సమర్పణ ప్రారంభం | 07.08.2026@ 10.30 AM |
| బిడ్ సమర్పణ ముగింపు | 14.08.2026'@ 04: 00 PM |
| అంచనా విలువ | రూ.05.00 లక్షలు |
| పనిపేరు | 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు /సాధారణనిధుల కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 43/45 W LED స్ట్రీట్ లైట్లు, విద్యుత్ సామగ్రి సప్లయ్, డెలివరీ |
| బిడ్ సమర్పణ ప్రారంభం | 07.08.2026@ 10.30 AM |
| బిడ్ సమర్పణ ముగింపు | 11.08.2026 @ 04.00 PM |

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా "www. eprocurement.govt.in" వెబ్‌సైట్‌లో చూడవచ్చు. **బిడ్‌లను ఆహ్వానిస్తున్న అధికారి:** కమిషనర్, నాగర్ కర్నూల్ మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్ నెం. 9100972045, 7330690590లను సంప్రదించగలరు.
సం/- కమిషనర్
నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ
DIPR R.O. No. : 7441-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
07-08-2026
www.prajapaksham.in


## ప్రజాసమస్యలపై సిపిఐ నిరంతర పోరాటం



**ప్రజాపక్షం / వేలేరు :** ప్రజాసమస్యలపై నిరంతరం సిపిఐ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు.గురువారం వేలేరు మండలంలోని పలుగ్రామాలలో సిపిఐ పాద యాత్ర కొనసాగుతూ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం సమాఖ్యస్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని,ప్రభుత్వ రంగసంస్థలను తీవ్రంగా ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు.ఆగస్టు 6 నుండి ప్రారంభమైన ఈదేశ వ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు,గ్రామీణ ప్రాంతాలు,పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కానుందని తెలిపారు. సిపిఐ పోరు యాత్రలో ప్రజలు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి,రాష్ట్రసమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,మండ సదాలక్ష్మి ,జిల్లా సహాయకార్యదర్శి తోట భిక్షపతి,మద్దెల ఎల్లేష్,జిల్లా నాయకులు ఎన్ స్టాలిన్,ఉట్కూరి రాములు,మునిగాల భిక్షపతి,బత్తిని సదానందం,కొట్టెపాక రవి,వేల్పుల సారంగపాణి,మాలోతు శంకర్,శనిగరపు రాజ్‌కుమార్,రాసమల్ల దీనా,గుంటి రాజేందర్,ధర్మసాగర్ మండలకార్యదర్శి కొట్టె వెంకటేష్,మండలనాయకులు సింగారపు కొమురయ్య,బొట్టు భిక్షపతి,కొట్టె లింగయ్య,వల్లపు సారయ్య,బండి రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు: పిఎస్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం / వరంగల్ క్రైమ్ :** వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు రెండవ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అనే వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డిని బూతులు మాట్లాడుతూ , అనుచిత వాక్యాలు చేసిన కారణంగా ఏనుగుల రాకేష్ రెడ్డిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో రాకేష్ రెడ్డిపై కేసు పెట్టడం జరిగింది. అతనిపై కేసు ఫైల్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కెయుసి పోలీస్ స్టేషన్ సిఐ రవి కుమార్ ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి,పాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్, మాజీ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గడిపి జీవన్,రెండవవ డివిజన్ యూత్ అధ్యక్షుడు మదాసి దయాకర్, యూత్ నాయకులు ,మహిళానాయకురాలునాగేల్లి, సునీత,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుపాల్గొన్నా రు.

## నిర్దేశిత గడువులోగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి

**ప్రజాపక్షం / వరంగల్ :** నిర్దేశిత గడువులోగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదికారులను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పై సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్ర జలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష లో ఆర్అండ్‌బి ఎస్ఇ రమేష్ బాబు, ఎలక్ట్రిసిటీ ఎస్ఇ ఆనందం, ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్ఓ రాజారెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఇంజనీర్ శరవణ్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ , ఇఇ దేవిక చౌహాన్ సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## 28 కిలోల గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రభుత్వం నిషేదించిన గంజాయిని అక్రమంగా ఓ వాహనం తరలిస్తున్నారన్న పక్కామాచారం మేరకు దాడులు నిర్వహించగా వాహనంలో 28 కిలోల గంజాయి లభ్యం కావడంతో వెంటనే వాహనాని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు నర్సంపేట ఎసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణంలోని ఎసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి, నిందితుల అరెస్టును చూపించారు. ఈసందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి భద్రాచలం, మహబూబాబాద్, నర్సంపేట మీదుగా గంజాయిని బొలెరో వాహనంలో హైదరాబాద్ కు తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ అరుణ్ సిబ్బందితోమహబూబాద్ బైపాస్ రోడ్‌లో వాహనాలను తనిఖీ చేపట్టారు. బొలెరో వాహనం కింది భాగంలో ప్రత్యేక బాక్సులను అమర్చి గంజాయిని రవాణా చేస్తుండడంతో వెంటనే ఆ వాహనాన్ని సీజ్ చేశారు. వీరి వద్ద నుండి 14 లక్షల విలువచేసే 28 కేజీల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్లు బొలెరో వాహనంను స్వాధీనపరచుకోవడం జరిగింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులలో ఒకరు పరారుకాగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అనంతరం నర్సంపేట తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి వారిని గురువారం కోర్టులో హాజరుపర్చారు. అరెస్టు అయిన వారిలో ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా అమృత బైద్యాయ్, పుజూర్ రాయ్‌లు ఉన్నారు.

## కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనపై సిపిఐ పోరు



**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనపై సిపిఐ పోరు కొనసాగిస్తుందనిసిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో పేరబోయిన కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన తొర్రూరు మండల ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ గత 12ఏళ్లుగా బిజెపి పాలనలో దేశం మునుపెన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా ఈ నెల 6 నుంచి 14 వరకు సిపిఐ చేపట్టే ప్రచార జాత ఈ నెల 10, 11, తొర్రూరు మండల కేంద్రంలో జరిగే ప్రజా చైతన్య ప్ర చార పాదయాత్ర ప్రారంభం కానుందన్నారు.దేశవ్యాప్త ప్రచార జాతాల ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ తొర్రూరు మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మ ణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు బూ రుగు యాదగిరి, మందపురి శ్యాంసుందర్, వల్లపు వెంకన్న, అజ్మీర వీర న్న, పసుల యాకయ్య, కోటగిరి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** విద్యార్థులు చదువుతో పాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 25మంది విద్యార్థులతో లిటిల్ సోల్జర్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, తుఫాన్‌లు, వ్యాధుల సంక్రమణతో ప్రజలు ఇబ్బందులు పడిన సమయంలో సోల్జర్స్ టీం ప్రజలకు అండగా నిలిచే విధంగా లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, యాజమాన్యం విద్యార్థులతో సోల్జర్స్ టీంను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సోల్జర్ టీమ్‌తో ప్రమాణస్వీకారం చేయించి విపత్కర సమయాల్లో ఫోన్ చేయాల్సిన నెంబర్ 9100100488ను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అవసరమన్నారు. నేటి తరంలో మానవత్వ విలువలు తగ్గుతున్నాయని అన్నారు. విద్యతో పాటు విలువలు, సేవా దృక్పథం అలవర్చుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థులను సోల్జర్ టీమ్‌గా ఏర్పాటు చేసి వారికి శిక్షణ అందించడం గర్వకారణమన్నారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పాఠశాలలో సోల్జర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలను అలవర్చుకొని భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. లిటిల్ ఫ్లవర్ పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమరజిని రాజశేఖర్, ఎస్ఐ తోట మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్రాచారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేశ్, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, వైద్యులు డాక్టర్ అలువాల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాటోతు హామ్యానాయక్, మేకల కుమార్, గంజి విజయపాల్‌రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, జినుగ సురేందర్ రెడ్డి, వికాస్, అభ్యాస్ పాఠశాలల కరస్పాండెంట్లు తాళ్లపల్లి రమేశ్, నరేశ్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ములుగు:** ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసి ఆగస్టు 12లోపు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లతో పాటు పైలాన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, సమావేశ మందిరాలు, మంత్రివర్గ గదుల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మేడారం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హెడిప్యాడ్‌లను పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విఐపిల బస, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. వైద్య, అగ్నిమాపక శాఖలు అత్యవసర సేవలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఆర్‌డిఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్‌డిసి ప్రతాప్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, డిఎస్‌పి రవీందర్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాలనకు వ్యతిరేకంగా సిపిఐ పాదయాత్ర

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి
షేక్ బాష్ మియా




**ప్రజాపక్షం/ వరంగల్ :** కార్పోరేట్ పాలనకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారానికై ఈనెల 9 నుండి 13వరకు వరంగల్ జిల్లాలో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని సిపిఐ వరంగల్ జిలాల కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. వరంగల్ పట్టణం శివనగర్ తమ్మెర భవన్ లో సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఓర్సు రాజు అధ్యక్షతన నిర్వహించగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక హక్కులను కూడా వ్యాపార వస్తువులుగా మార్చడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముగాస్తు దేశ ప్రజల సొమ్మును కార్పొరేట్ బడా బాబులకు దోచి ఇస్తున్న బిజెపి పరిపాలన నిరసిస్తూ కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రజల కష్టాలపై లాభాలు ఆర్జించే కార్పొరేట్ అనుకూల విధానాలను సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో సిపిఐ పాదయాత్రలను చేస్తున్నామని ప్రకటించారు . ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల జీవన విధానమని, ప్రజలంతా ఈ పాదయాత్రల్లో భాగస్వాములై ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, కందిక చెన్నకేశవులు, సంగీ ఏలేంధర్, బుస రవీందర్, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు జన్ను రవి, రాహేళ, యండి అక్బర్ పాషా, సుంకరి భవాని, జాన్ పాల్, ల్యాదల్ల శరత్, యాకాంబ్రచారి, మియాపూరం గోవర్ధన్, విజయ, పరికిరాల రమేష్, దామెర క్రిష్ణ, మస్క సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## వందలాది మందితో ర్యాలీగా పాదయాత్ర



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా 6 తేదీ నాడు కాజీపేటలో ప్రారంభమైన పాదయాత్రలు నేడు ఎల్కతుర్తి మండలంలోని గోపాల్ పురం, ఇంద్రనగర్, చింతలపల్లి, దామెర, అదేవిధంగా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపెల్లి, ముల్కనూర్, గట్ల నర్సింగాపూర్, ముస్తాపూర్, కొత్తకొండ వరకు పాదయాత్రలు కొనసాగుతాయి అని, ప్రతి ఒక్కరు యాత్రలో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు కోరారు. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 12 ఏళ్లకాలం ప్రజల పెరుగుతున్న కష్టాలను దారితీసి, ఎన్నికల సందర్భంగా ఉపాధి సంక్షేమం సుపరిపాలన,మెరుగైన భవిష్యత్తును అందిస్తామని బిజెపి వాగ్దానం చేసింది కానీ, దానికి బదులుగా దేశంలోని పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ధరల పెరుగుదల, డీజలు, పెట్రోలు, నిత్యవసర వస్తువులపై అధిక భారం పడడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంగిపోతున్నది అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిర్వీర్యం చేయడం జరుగుతున్నాయన్నారు. ఈ సమస్యలపై ప్రజలు గొంతెత్తినప్పుడే చర్చను ఇతర అంశాల వైపు మోదీ ప్రభుత్వం మళ్లిస్తున్నది కాబట్టి, యువతకు సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని 12 సంవత్సరాలైందని, 12 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యలపై హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 6 నుండి11 వరకు వేయి స్తంభాల గుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు వందలాది మందితో ర్యాలీగా పాదయాత్రలో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి రాజ్ కుమార్, నిమ్మల మనహర్ పాల్గొన్నారు

## జయశంకర్‌సార్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ
విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/కెయుక్యాంపస్ :** దివంగత డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని,వారి ఆశయంలో భాగమైన సామాజిక తె లంగాణ లక్ష్య దిశగా కృషి చేయాలని తెలంగాణ రా ష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర వో పా ప్రధాన సలహాదారులు చొల్లేటి కృష్ణమాచార్యులు ప్రభుత్వాన్ని కోరారు. జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని జయశంకర్ స్మృతి వనంలో ఆయన విగ్రహానికి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం, విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) నాయకులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య అలుగోజు సదానందం మాట్లాడుతూ జయశంకర్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని గర్వపడుతున్నానని, ఆయన జీవితం ఈనాటి యువతరానికి స్ఫూ ర్తి దాయకమన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర కార్యదర్శి,వోపా ఉమ్మడి జిల్లా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం ప్రభాక ర్,ఉపాధ్యక్షులు ఆకోజు సురేందర్ రావు,హనుమకొ ండ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పానుగంటి శ్రీధర్, హనుమకొండ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ రామోజు నాగ సోమేశ్వరాచారి,విశ్రాంత పోలీస్ అధికారి రావులకొలను రామ మూర్తి,నాయకులు పాల్గొన్నారు.

## గురుకులాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో
కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రంలోని సంక్షేమ, గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని ఎఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు యథాతథంగానే కొనసాగుతున్నాయని విమర్శించారు. విద్యార్థులు కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. శిథిలావస్థలో కొనసాగుతున్న సంక్షేమ, గురుకుల హాస్టళ్లకు వెంటనే సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, పడకలు, భద్రతతో కూడిన వసతి, తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త గురుకుల విద్యాసంస్థకు కూడా సొంత భవనాన్ని నిర్మించలేదని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు పేరుతో విద్యార్థులను మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి సంక్షేమ, గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పంగ మహేందర్, ఎంజాల రాజేందర్, సాయిరాం, బన్నీ, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులపై టిజిఎంసి ఉక్కుపాదం

16 మందిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ నగరంలో నకిలీ వైద్యం చేస్తున్న వారిపై తెలంగాణ వైద్య మండలి టీజీఎంసీ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 16 మందిపై కేసులు నమోదు చేసింది. శివనగర్, కరీమాబాద్, కీర్తినగర్, కాజీపేట, ఊరుగొండ, ఉర్సు, ఫోర్ట్ వరంగల్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో అనుమతి లేకుండా క్లినిక్ లు నిర్వహించడం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో ఇన్ పేషెంట్ సేవలు అందించడం, సెలైన్లు, స్టెరాయిడ్ ఇంజెక్షన్లతో చికిత్సలు చేయడం, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా పారవేయడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు.కేసులు నమోదు అయిన నకిలీ వైద్యులు శివనగర్ ఎ. రాములు,జయశ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కీర్తినగర్ కమలాకర్, బండి రమేష్ శ్వేత ఫస్ట్ ఎయిడ్ సెంటర్ శివనగర్, వేకటేశ్వర్లు వెంకటేశ్వర క్లినిక్, కీర్తినగర్, బాబురావు శివనగర్,ఎ. రమేష్ – కావ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఫోర్ట్ రోడ్, కృష్ణమూర్తి కరిమాబాద్, టి.రాజమౌళి విజయదుర్గ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కరీమాబాద్, శివశంకర్ ఉర్సు, గడ్డం హరీష్ ఉర్సు, గడ్డం శ్రీనివాస్ ఊర్సు, ఎం.సిద్ధేశ్వర్ జయలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కరీమాబాద్ లు ఉన్నారు.కావ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వ్యవహారంలో నమోదిత వైద్యురాలి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ దుర్వినియోగమైనట్లు ప్రాథమికంగా గుర్తించిన నేపథ్యంలో సంబంధిత వైద్యురాలికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు టీజీఎంసీ తెలిపింది. మరోవైపు తనిఖీల సమాచారం అందగానే కొందరు నకిలీ వైద్యులు క్లినిక్ లలోని పరికరాలు, బెడ్లు, ఇతర సామగ్రిని తొలగించగా, మరొకరు పరారైనట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ వైద్యం, అనుమతి లేని క్లినిక్ నిర్వహణ, నమోదిత వైద్యుల పేర్లు లేదా రిజిస్ట్రేషన్ దుర్వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని టీజీఎంసీ హెచ్చరించింది. ఈ దాడుల్లో డాక్టర్ యెగ్గన శ్రీనివాస్, డాక్టర్ కె.రవి కుమార్, డాక్టర్ కె.విష్ణు, డాక్టర్ కె.వెంకటస్వామి, వరంగల్ యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్ డాక్టర్ అన్వర్ మియా, ఐఎంఏ, హెచ్‌ఆర్డీఏ వరంగల్ కార్యదర్శి డాక్టర్ ఎస్.శిరీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నకిలీ వైద్యుల సమాచారం ఉంటే 9154382727కు లేదా జిల్లా వైద్యాధికారులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎఐటియుసి హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/హనుమకొండ :** అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఎఐటియుసి) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జక్కు రాజు గౌడ్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు ప్రకటించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఆగస్టు 5 తేదీన జరిగిన ఎఐటియుసి రెండవ మహాసభలో 33 మంది సభ్యులతో కూడిన నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జక్కు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రాంమూర్తి, ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, ఉపాధ్యక్షులుగా మద్రి శ్రీనివాస్, బత్తిని సదానందం, ఎన్ ఎ స్టాలిన్, అలకుంట్ల యాకయ్య, ఏర్పుల ధర్మరాజ్, రసమల్ల దీన, మేకల శంకర్, ఇల్లందుల రాములు, సహాయ కార్యదర్శులుగా రామ రాజేష్ ఖన్నా, లంకదాసరి అశోక్, గుంటి రాజేందర్, కర్రె లక్ష్మ ణ్, దామెర రాజు, అదరి రమేష్, కుడి స్వామి, కోశాధికారిగా గడ్డం లలితలతో పాటు కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, జక్కు రాజు గౌడ్ లు మాట్లాడుతూ ఆర్టీసి, బ్యాంకు, అంగన్వాడీ, ఆశా, పారిశుధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, సివిల్ సప్లయి హమాలీలు, పెయింటర్లు, వ్యవసాయ మార్కెట్ హమాలీలు, భవన నిర్మాణ కార్మికులతో పాటు వివిధ రంగాల కార్మిక సంఘాలను జిల్లాలో మరింత బలోపేతం చేయడంతో పాటు, అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల పరిరక్షణ కోసం, కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్
గద్వాల విజయలక్ష్మి



**ప్రజాపక్షం/జనగామ :** మహిళల భద్రత ,సంక్షేమం సాధికారిత లక్ష్యంగా అన్ని శాఖలు పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గురువారం జనగామలో విజయలక్ష్మి పర్యటించారు. పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మి నర్సిహ్మాస్వామి లక్ష్మి నర్సింహ్మాస్వామిని దర్శించుకున్నారు. అనంతరం జనగామలోని జిల్లా కల్టెరేట్‌లో జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మహిళలతో మాట్లాడారు. మహిళ భద్రల, రక్షణ, సంక్షేమం, సాధికారిత తదితర అంశాలపై విజయలక్ష్మి మాట్టాడారు. మహిళలు,బాలికలపైజరిగే వేధింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు వంటి అంశాలపై చర్చించారు. భాధిత మహిళలకు సహాయం అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రం, సఖి కేంద్రం, జిల్లా న్యాయ సేవల సంస్థల సేవలకు ప్రజలు విస్తృతంగా తెలిజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గర్భస్థ లింగ నిర్ధారణ పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అ దనపు కలెక్టర్ బెన్షాలోమ్; మహిళా కమీషన్ సభ్యులు , కార్యదర్శి బి పద్మజా, రమణ, ఎసిపిలు భీశర్మ, నర్సయ్య, అదనపు డిసిపి బాలస్వామి, వెంకటరమణ, ఎపిడిఒ నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్‌హైవేపై రోడ్డు ప్రమాదం

### కారును ఢీకొట్టిన డిసిఎం..ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్లపరిధిలోని నంద్యాతండా వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతకాని మండలం గాంధీనగర్‌కు చెందిన పాపబత్తిని నరసింహారావు భార్య సుజత, కుమారుడు పవన్‌కుమార్‌తో కలసి కారులో హైదరాబాద్‌కు కుమారుడిని ఇంజనీరింగ్‌లో జాయిన్ చేపించేందుకు ఇంటి వద్ద నుంచి కారులో వెలుతున్నాడు. ఈ నేపథ్యంలో మార్గం మధ్యంలో డిసిఎం వాహనం ఎదురుగా ఢీకొట్టడంతో భార్య సుజాత, కుమారుడు పవన్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. నరసింహారావుకు గాయాలై కారులో ఇరుక్కొవడంతో పోలీసులు క్రేన్ ద్వారా బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నరసింహారావు తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు తెలిపారు.

## ముదిగొండ రహదారి విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ రోడ్డు విస్తరణ పనులు కారణంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలను కోల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ(కామ్రేడ్ చంద్రన్న) పార్టీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మాదారపు ఉమాశంకర్ మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు సరైన ముందస్తు నోటీసులివ్వకుండా ఇళ్లను కూల్చేసి, ఖాళీ చేయించడం అన్యాయమని అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పక్కా ఇళ్లను మంజూరు చేయాలని, ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు జరగాలని, అభివృద్ధి పేరుతో పేద ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీయడం సమంజసం కాదని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ వల్ల నష్టపోయిన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు పునరావాసం కల్పించకపోతే, ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులను కూడ గట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఎస్‌టి బాలికల వసతి గృహాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలోని ఎస్‌టి బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ ఛైర్ పర్సన్ దొడ్డ కిరన్ మిత్ర డానియల్ సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, విద్య, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గదులు, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీరు, పరిశుభ్రతను పరిశీలించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వార్డెన్ సునీతతో హాస్టల్ అభివృద్ధి, అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎంఎల్‌ఏ కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల శ్యామ్ మాదిగ, సుఖాంత్ మిత్ర, దొడ్డ బాబీ, కమలాకర్, చంటి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 8న సిపిఐ ప్రజాపోరు యాత్ర

### సిపిఐ మండల కార్యదర్శి దూసరి



**ప్రజాపక్షం/చింతకాని:** ప్రజల జీవితాలలో వెలుగు కోసం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలను ఎండగడుతూ సిపిఐ ఆధ్వర్యంలో 8న చింతకాని మండలంలో జరిగే ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పిలుపునిచ్చారు. 8న చిన్నమండవ గ్రామంలో ఉదయం 8 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని ఈ యాత్రలో పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి , జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జున్‌రావు, కూచిపుడి రవి తోపాటు జిల్లా మండల నాయకత్వం పాల్గొంటుందన్నారు. ఉదయం 9 గంటలకు సీతంపేట, 9.30 గంటలకు నాగులవంచ, 10.30 గంటలకు పాతర్లపాడు, 11.00 గంటలకు ప్రొద్దుటూరు, 11.30 గంటలకు నాగిలిగొండ, మధ్యాహ్నం 12.30గంటలకు కోమట్లగూడెం, 1.00 గంటలకు నేరడ యాత్ర చేరుకుంటన్నారు. మధ్నాహ్నభోజన అనంతరం 2.00 గంటలకు చింతకాని మండల కేంద్రం, 2.30 గంటలకు అనంతసాగర్, 3.00 గంటలకు రామకృష్ణాపురం, 3.30 గంటలకు బస్వాపురం, సాయంత్రం 4.30 గంటలకు రాఘవాపురం, 5.00 గంటలకు కొదుమూరు 5.30 వందనం గుండా సాయంత్రం 6.00 గంటలకు పుట్టకోట, 6.30 గంటలకు అల్లీపురం, రాత్రి 7.00 గంటలకు కొత్తగూడెంలో యాత్ర ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో మండల కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

## మంత్రి సీతక్కను కలిసిన సర్పంచ్ నవీన్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** రాజలింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్ ధనసరి నవీన్ గురువారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను కలిసి గ్రామ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం మంజూరు చేయాలని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, రాజలింగాల, రంగాపురం మధ్య బీటీ రోడ్డు వేయాలని కోరారు. వినతిపై స్పందించిన మంత్రి సీతక్క, అవసరమైన నిధులు మంజూరు, అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌ను ఆదేశించారు.

# ప్రజా ఆకాంక్షలే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి పొంగులేటి






**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి ఆయన రూ 6.74కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈశ్వరమాదారం, భద్రుతండా మధ్య రూ. 1.76 కోట్లతో, తాళ్లగడ్డ తండాకు రూ.50 లక్షలతో బిటి రోడ్డు, చౌటుపల్లిలో రూ.3.20కోట్ల హైలెవల్ వంతెన, లింగారం తండాలో రూ. 1.28కోట్ల బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం లింగారం తండాలో రైతులతో కలిసి పొలంలోకి దిగి ఎద్దులతో దుక్కి దున్ని, వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు.

**సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం**

పేదల ఆహార భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కూసుమంచి మండలం ఈశ్వరమాదారం గ్రామంలోని చౌకధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి లబ్ధిదారులకు మూడు నెలల ఉచిత సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం లో ప్రతి రేషన్ కార్డుదారునికి నెలకు 6కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సన్న బియ్యాన్ని ప్ర జలు నేరుగా వినియోగిస్తున్నారని చెప్పారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు అందుతున్న సన్న బియ్యం నా ణ్యత ఎంతో మెరుగ్గా ఉండటంతో కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పంచాయితీ రాజ్ ఎస్ఈ వెం కట్‌రెడ్డి, ఆర్టీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సై దులు, రేషన్ డీలర్ సైదిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నా రు.

## భూ భారతి అమలుపై అధికారులకు సమగ్ర శిక్షణ: కలెక్టర్ అంకిత్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూ భారతి రిజిస్ట్రేషన్, సెక్సెషన్ మాడ్యూళ్లపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఐడిఓసి ఎస్20 మీటింగ్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం, నూతన నిబంధనలను అధికారులు పూర్తిగా అవగాహన చేసుకుని అమలు చేయాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని, ప్రతి దరఖాస్తును చట్టబద్ధంగా పరిశీలించి బాధ్యతాయుతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.వేణుగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనంత రామకృష్ణ భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూళ్ల అమలు విధానం, పత్రాల పరిశీలన, వ్యవస్థలో అనుసరించాల్సిన ప్రక్రియలపై అధికారులకు సమగ్రంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా జిల్లాలో భూ భారతి వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించేందుకు అవసరమైన అవగాహన అధికారులకు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వారి సమస్యల గురించి దరఖాస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. అట్టి దరఖాస్తులను ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య, కమిటీ సభ్యులు లక్ష్మి నర్సింహారావు, అనిల్ కుమార్, రాజశేఖర్, మాధవరావు, సునీత, స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి అడ్డా.. ఖమ్మం కార్పొరేషన్

### సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

### బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అవినీతి, అక్రమాలకు అడ్డాగా ఖమ్మం కార్పొరేషన్ మారిందని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు మేరకు గురువారం భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలన వైఫల్యాలపై ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి నిర్వహించారు. బిఆర్‌ఎస్ నాయకులు కార్యాలయం లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఖమ్మం కార్పొరేషన్ అవినీతికి అడ్డాగా మారిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో భారీ ఎత్తున అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారని వారు ఆరోపించారు. అలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఒక్కటై అక్రమాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, కర్నాటి కృష్ణ, ఖమర్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళీ, బొమ్మెర రామ్మూర్తి, మాజీ కార్పొరేటర్లు మగ్బూల్, రామారావు, నాగేశ్వరరావు, వీరభద్రం, రోజ్‌లీనా, ప్రశాంత లక్ష్మి , దండా జ్యోతిరెడ్డి, కూరాకుల వలరాజు, పసుమర్తి రాంమోహన్, మెంతుల శ్రీశైలం, బుర్రి వెంకట్, తాజుద్దీన్, పాపారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ఇటీవల 'ప్రజాపక్షం' పత్రికలో 'గాడి తప్పిన ప్రభుత్వ విద్య' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. సొంత రూ.40వేలు ఖర్చులతో గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అపర్ణ రేకుల షెడ్డు వేయించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నది. ఎప్పుడో 2000 సంవత్సరంలో కట్టిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయురాలు అంగన్‌వాడీ కేంద్రం వెనకాల రేకుల షెడ్డు వేయించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంది. ఇటీవల 'ప్రజాపక్షం' విలేకరికి మాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు సమాచారం ఇవ్వగా..రేకుల షెడ్డులో ప్రీ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల నిర్వహణ 'గాడి తప్పుతున్న ప్రభుత్వ విద్య' అనే శీర్షికతో ప్రచురించగా సామాజిక మాధ్యమాల ద్వారా 'ప్రజాపక్షం' ప్రచురించిన కథనం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. వెంటనే ఆయన స్పందించి పాఠశాలను సందర్శించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు అపర్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇలాంటి ఉపాధ్యాయులు ఉండటం చాలా అదృష్టమని, విద్యార్థులకు మంచి విద్యను అందించి మంచిస్థాయికి ఎదగాలని అమెను దీవించారు. వెంటనే పాఠశాల భవన నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి విద్యార్థులకు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీఓ ఎస్.కె.సిలార్ సాహెబ్, ఎంపీఓ మీరా, ప్రభాకర్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈఓ బాబూరావు, ప్రదానోపాధ్యాయురాలు విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఆయన ఆకాంక్ష అని, ఆయన చూపిన మార్గంలో ప్రతొక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారు లు, ప్రజాప్రతినిధులు జయశంకర్ సేవలను స్మ రించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులు అ ర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నా రు.

## గద్దర్ ఆలోచనే కాదు... ఆహార్యం స్ఫూర్తిదాయకమే

### గద్దర్, జయశంకర్, జహీర్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఈ శతాబ్దపు విప్లవ కవి, గాయకుడు, తెలంగాణవాది గద్దర్ ఆలోచనే కాదు ఆహార్యం స్ఫూర్తిదాయకమేనని స్పర్శ సామాజిక అధ్యయన వేదిక బాధ్యుడు భాస్కర్ తెలిపారు. ఆయన వేషం, భాష, సాహిత్యాన్ని పలువురు అనుకరించారని ఆయన తెలిపారు. ప్రజా యుద్ధనౌక గద్దర్, జహీర్ అలీఖాన్ వర్ధంతి సభతో పాటు జయశంకర్ జయంతిని గద్దర్ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్ సమీపంలో నిర్వహించారు. దేవిరెడ్డి విజయ్ అధ్యక్షతన జరిగిన సభలో భాస్కర్ మాట్లాడుతూ గద్దర్ జీవితం నేటి తరాలకు ఆదర్శమని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన మాట, పాట సాగిందని ఆయన తెలిపారు. తన పాటలతో పాలకులన నిద్ర లేపిన, ప్రజలను చైతన్యవంతం చేసిన గద్దర్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం ప్రజల పక్షాన నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. నివాళి అంటే దండలు వేయడమో, దండంపెట్టడమో కాదని వారి ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుపోయి వాటిని అనుసరించడమేనని ఆయన తెలిపారు. ఈ సభలో బిచ్చాల తిరుమలరావు, రవి, విప్లవ్‌కుమార్, విజయ్‌కుమార్, యర్రా శ్రీనివాస్, సివై పుల్లయ్య తదితరులు ప్రసంగించారు. పాగి వెంకన్న, పమ్మి రవి తదితరుల బృందం గద్దర్ గేయాలను ఆలపించింది.

## ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు





**ప్రజాపక్షం/ముదిగొండ:** ఖమ్మం జిల్లాలోని ముదిగొండ మండల కేంద్రంలో గురువారం ఆహార భద్రతా అధికారి శరత్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు హోటళ్లు, మిఠాయి దుకాణాలు, టీ దుకాణాలు క్షుణ్ణంగా పరిశీలించారు. గత కొన్ని రోజులుగా స్థానిక హోటళ్లలో ఆహార నాణ్యత సరిగా లేదని, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని ఫిర్యాధులు రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా ఓ ప్రముఖ టీస్టాల్‌తో పాటు హోటళ్లను పరిశీలించి, సమోసాలు, జిలేబీలు, బజ్జీలు తదితర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు ఉపయోగించినా..నాణ్యత లేని నూనెలను పునర్వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయాలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సైబర్ క్రైం కేసులో సరికొత్త కోణం


### నిందితుడి అరెస్ట్‌తో..

### పెట్టుబడుల భవిష్యత్తుపై భయాందోళన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సైబర్ నేరాల కేసులో అరెస్టైన దేవరపల్లి పట్టాభి వ్యవహారం రోజురోజుకూ కొత్త కోణాలను సంతరించుకుంటోంది. ఇప్పటి వరకు సైబర్ మోసాల ఆరోపణలకే పరిమితమైన ఈ కేసు, ఇప్పుడు పెట్టుబడుల పేరుతో భారీగా నిధులు సేకరించారనే ప్రచారంతో కల్లూరు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, కల్లూరు మండలానికి చెందిన ఓ మెడికల్ షాపు యజమాని, అమెరికాలో స్థిరపడిన ఓ యువతి, హైదరాబాద్‌లో వైద్య వృత్తిలో ఉన్న మహిళా డాక్టర్ సహా పలువురు ఒక్కొక్కరు కోటి రూపాయల వరకు పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. పెట్టుబడులపై అసాధారణ లాభాలు వస్తాయని నమ్మించి కోట్ల రూపాయలు సమీకరించారని,ఎటువంటి వ్యాపారాలకు పెట్టుబడి పెట్టారు, ఆ డబ్బును ఎక్కడ వినియోగించారనే దానిపై స్పష్టత లేకపోవడంతో పెట్టుబడిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో తామెక్కడ ఇరుక్కుంటామోనని క్షణమొక యుగంలా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నట్లు సమాచారం. పట్టాభి అరెస్ట్ తర్వాత తమ పెట్టుబడుల భవిష్యత్తు ఏమవుతుందోనన్న భయంతో పలువురు మౌనం వీడేందుకు సిద్ధమవుతున్నారనే చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది. ఈ వ్యవహారంలో మరో సంచలన కోణం కూడా వెలుగులోకి వస్తోంది. దుబాయ్‌లో ఉద్యోగాల పేరుతో యువకులను విదేశాలకు పంపించి, వారి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించి వాటిని సైబర్ నేరాలకు వినియోగించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై దర్యాప్తు సంస్థలు అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ కేసులో కేవలం నిందితుడి పాత్ర మాత్రమే కాకుండా, పెట్టుబడుల పేరుతో జరిగిన లావాదేవీల స్వరూపం, నిధుల మూలాలు, డబ్బు ప్రవాహం, పెట్టుబడిదారుల పాత్ర వంటి అంశాలు కూడా విచారణలో కీలకంగా మారే అవకాశం ఉందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అక్రమ నిధుల సేకరణ జరిగినట్లు తేలితే, ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి ద్వారా చేరింది? ఎక్కడికి మళ్లింది? అనే ప్రశ్నలకు సమాధానాలు దర్యాప్తులోనే లభించనున్నాయి.

## 'ఎస్‌బిఐటి' విద్యార్థులు విద్యా పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్, హ్యాకథాన్‌లు, ఐడియాథాన్‌లపై అవగాహన కల్పించే లక్ష్యంతో తమ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ ఆవిష్కరణ కేంద్రాలైన ఉయ్ హబ్, టి హబ్, టి వర్క్స్‌లను పారిశ్రామిక విద్యా పర్యటనలో భా గంగా సందర్శించారని ఎస్‌బిఐటి కళాశాల చై ర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆ యా సంస్థల నిపుణులు విద్యార్థులకు స్టార్టప్‌ల స్థాపన, ఇంక్యుబేషన్ ప్రక్రియ, విన్నూత ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలిచే విధానం, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి మాట్లాడుతూ హ్యాకథాన్‌లు, ఐడియాథాన్‌లు విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యాన్ని, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. టి వర్క్స్‌లో అత్యాధునీక ప్రోటోటైపింగ్ సదుపాయాలు, డిజైన్, తయారీ, సాంకేతికతలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, ఇన్నోవేషన్ సెల్ ఇన్‌చార్జి పి. అశ్వని, టిపిఒ సవిత పాల్గొన్నారు.

## కెజిబివిలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలో కస్తూర్భా గాంధీ బాలికల విద్యలయం(కేజీబీవీ)లో 2026, 27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఎం సుశీలమ్మ తెలిపారు. 6వ తరగతి, 7వ తరగతి, 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9550930803ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పేదప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

సిద్దిపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులపై మంత్రి పొన్నం, మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలు సక్రమంగా అందించటలో విఫలమైన జిజిహెచ్ సూపరింటెండెంట్ ఇతరు వైద్యులపై రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు, జిల్లా కలెక్టర్ హైమావతిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ హైమావతి అధ్యక్షతన నిర్వహించగా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు హాజరైనారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించటంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నాణ్యమైన అత్యాధునికమైన వైద్య సేవలు ఆశించినంత జిల్లా ప్రజలకు అందటం లేదన్నారు. ప్రజలకు వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందేలా అధికారులు, వైద్యులు సమిష్టిగా కృషిచేయాలన్నారు. సిద్దిపేట జనరల్ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వివరాలను పరిశీలించి వాటి భర్తీకి అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అసుపుత్రి అభివృద్ధికి అవసరమైన అదనపు నిధుల కోసం ప్రభుత్వం జిల్లా ఇంచార్జి మంత్రికి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ఆశాకార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సిద్దిపేట జనరల్ ఆసుపత్రి అందిస్తున్న ప్యాలియేటివ్ కేర్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పిజీ వైద్య విద్యార్థులు సహకారంతో ఆర్‌బిఎస్‌కే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కంటి,వినికిడి, లోపాలున్న పిల్లలను గుర్తించి సకారంలో మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. జిల్లాలోని 56 ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రిఫర్ చేసే రోగులకు ప్రభుత్వ అంబులెన్స్ ద్వారా తరలించాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన చిన్న రిపేర్లు, తాగునీటి సమస్య రాకుండ చూసుకోవాలన్నారు.ఎమర్జెన్సీ సర్వీసుల్లో సీనియర్ డాక్టర్లు, అందుబాటులో ఉండి ఆసుపత్రికి వచ్చే రోగులు ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండ సేవలు అందించాలన్నారు.

**రెండేళ్ల ఆరోగ్య శ్రీ నిధులు ఎంవీ?: హరీష్‌రావు**

సిద్దిపేట జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని..ఆర్థోపెడిక్ సేవలు మెరుగు పడాలని. నెలకు వంద సర్జరీలు అయిన జరుగాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. గతంలో మోకాళ్ల చిప్ప ఆసుపత్రులు జరిగేవని, ఇప్పుడు ఎందుకు జరగటం లేదన్నారు. ఆరోగ్య శ్రీనిధులు రెండు సంవత్సరాలుగా రాకపోవటం దారుణమని, ఆరోగ్య శ్రీ నిధులు సత్వరంగా వచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ,వైద్యులు రెగ్యులర్‌గా విధులకు హాజరుకావటం లేదని తన దృష్టికి వచ్చిందని,అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. పాలియేటికేర్ సేవలు, పిడియాట్రిక్ కేర్ సేవలు. కిమోథేరపి, ఆసుపత్రి అంబులెన్స్, ఇన్‌పేషెంట్ రోగులకు అందించే ఆహారం, వైద్య పరీక్షలు సేవలు,ఎన్ఆర్ఐ సీటి స్కాన్, తదితర అన్ని సేవలుసమర్థవంతంగా అందించాలన్నారు. జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**జయశంకర్‌కు నివాళ్లు అర్పించిన మంత్రి పొన్నం, హరీష్‌రావు :** తెలంగాణ సిద్దాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయంతి పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సేవలను వారు కొనియాడారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్., జిజిహెచ్ సూపరింటెండెంట్ సంగీత. డిఎంహెచ్ఓ ధనరాజ్. వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 11న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్ర

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 11వ తేదీన పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని ఈ పాదయాత్రలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో కరపత్రం ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు కనీసం రాజ్యాంగంలో పొందుపరిచిన విద్యా వైద్యం, రెండు పూటలా భోజనానికి దూరమయ్యే పరిస్థితులు కనబడుతున్నాయని అన్నారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో మంద సుదర్శన్ గుంటి వేణు కడారి రాములు సోమ నాగరాజు సామల హరికృష్ణ తిప్పిరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పసిబిడ్డల ఆరోగ్యానికి శ్రేయస్కరం

సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపూర్ సూర్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పుట్టిన పసి పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరమని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపూర్ సూర్య అన్నారు. గురువారం రోజున రామగుండం కార్పొరేషన్ పరిధిలో 41వ డివిజన్ లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు,శ్రీమంతం, అన్న ప్రసన్న అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ఐసిడిఎస్ సూపర్వైజర్ సరస్వతి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యాక్సిన్ కంటే కూడా తల్లిపాలు చాలా శ్రేష్టమైనవని ప్రత్యేకంగా పిల్లలు పుట్టిన వెంటనే వచ్చే మరుపాలు జీవితకాలం పిల్లలకు అనేక రోగాలకు వ్యాక్సిన్ ల పనిచేస్తాయి గనుక పిల్ల తల్లులు కచ్చితంగా పిల్లలకు తల్లిపాలన ఇవ్వాలని కోరారు ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో కొంతమంది మహిళలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు పిల్లలకు అక్షరాభ్యాసం అన్నప్రాసన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భిణీలు బాలింతలు పిల్లల తల్లులు ఆర్పీలు. స్వర్ణలత, భాగ్యలక్ష్మి ,నవీన్,అంగన్వాడి టీచర్లు s. జయసుధ. అరుణ,రాణి,ఆశ వర్కర్ సరస్వతి,తదితరులు పాల్గొన్నారు.

## 10 నాటికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పీఎం కుసుమ్ పథకం కింద నిర్మించిన 1 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన మిగిలిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు 10 నాటికి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసిన 1 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, సాంకేతిక ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఆగస్టు 10 నాటికి ప్లాంట్‌ను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఇటువంటి సోలార్ ప్రాజెక్టులు కీలకమని పేర్కొన్న కలెక్టర్, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే మిగిలిన అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాముడు,పీఏసీఎస్ చైర్మన్ రాంచందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ సీఈవో కోలేటి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో పోలీసుల నాకాబందీ

256 కేసులు, రూ.78,930 వేల జరిమానా విధింపు

అడిషనల్ డిసిపి వెంకటరమణ



**ప్రజాపక్షం/కరీంనగర్:** శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కరీంనగర్ పోలీసులు కమిషనరేట్ పరిధిలోని టౌన్ , రూరల్ డివిజన్‌లలో బుధవారం రాత్రి విస్తృతస్థాయిలో నాకాబంధీ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, సరిహద్దు పాయింట్ల వద్ద ప్రత్యేక చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. నాకాబంధీ తనిఖీల్లో మొత్తం 256 ఈ చాలన్ కేసులు, స్పాట్ చలాన్ల ద్వారా రూ.78,930 జరిమానా విధించినట్లు తెలిపారు. చలాన్లు నమోదు చేసిన ద్విచక్ర వాహనాలు 251, నాలుగు చక్రాల వాహనాలు 5, మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు 18 నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి క్రమశిక్షణతో వాహనాలు నడపాలని అధికారులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా నంబర్ ప్లేట్లు సరిగా లేకపోయినా పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వాహనదారులు నిబంధనలు పాటించనిపక్షంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట 'నిరసన నిద్ర'



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సంక్షేమ వసతి గృహాల గురుకులాల సమస్యలు పరిష్కరించాలని పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆజాద్, ప్రీతం లు మాట్లాడుతూ వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సంక్షేమ వసతి గృహాల గురుకులాల సమస్యలను వెంటనే పరిష్కరించి వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, భోజన నాణ్యత పెంచాలని, కాస్మోటిక్ చార్జెస్ పెంచాలని, అదేవిధంగా ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాకుండా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని వార్డెన్స్ సమయపాలన పాటించే విధంగా చూడాలని అధికారులను డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన నిద్ర కార్యక్రమంలో నాయకులు రామగిరి రాజ్ కుమార్,ఆర్నకొండ ఆదిత్య, వెంకటేశ్వర్లు, తడిగొప్పుల సాయి, జస్వంత్, పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాల సాధనే నిజమైన నివాళి: కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రొఫెసర్ కోతపెల్లి జయశంకర్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి అనిజగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, ఆత్మగౌరవ పోరాటానికి మార్గదర్శిగా,ప్రజా చైతన్యానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి భావజాల పునాది వేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని.. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు విద్యార్థులకు మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ బాధ్య తాయుతంగా విధులు నిర్వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం ముత్తారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్య, వైద్యం, తాగునీరు, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, నీటిపారుదల,విద్యుత్, ఉద్యానవనం, రవాణా, ఆర్ అండ్ బీ, వీబీజీ–రామ్‌జీ తదితర శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్పంచులు సమావేశంలో లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,తక్షణమే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు గ్రామాల్లో తరచూ పర్యటించాలని, గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి,అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు.

**మిషన్ భగీరథపై సమగ్ర నివేదిక ఇవ్వాలి:** మండలంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా పైప్ లైన్ వ్యవస్థలో ఉన్న లోపాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన నిధుల మంజూరుకు వీలుగా తగిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అలాగే, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి :** వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. మండలంలో యూరియా సరఫరా పకడ్బందీగా జరిగేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఎం. రవీందర్, ఎంపీడీవో ఐ. ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

డ్రిప్ ఏర్పాటు, మొక్కల నాటే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని, డ్రిప్ సౌకర్యం కల్పించడం, మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రి–యునిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయిల్ పామ్ సాగు పురోగతి, లక్ష్యాన్ని చేరుకోవడంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యాన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా, డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరా ప్రక్రియల్లో జాప్యం లేకుండా సంబంధిత కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/రామడుగు:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు పాత్ర కీలకమని చొప్పదండి ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో రాజకీయాలకతీతంగా సర్పంచులు ఎనలేని కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ప్రకాష్ కిరణ్ అధ్యక్షతన మొదటిసారి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యం ను సర్పంచులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని ఎన్నికలు పూర్తయిన తర్వాత మనమంతా ప్రజల సేవకులమని మరువకూడదని అన్నారు. పార్టీలకు వర్గాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయం, విద్య, వైద్యం ఇతర శాఖల పనితీరుపై ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అధికారులు పార్టీలకు మద్దతుదారులుగా కాకుండా బాధ్యతాయుతంగా మెలిగే అధికారులుగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో షర్మిల, రాజేంద్రప్రసాద్, ఎంపిడివో రాజేశ్వరి, రాజమల్లయ్య, బొమ్మరవేణి తిరుమల, ఎస్సై రాజు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోయినా మా భూములివ్వం

ట్రెంచ్ పనులను అడ్డుకున్న ధర్యాపూర్ రైతులు!

**ప్రజాపక్షం/ముత్తారం:** మా ప్రాణాలు పోయి నా సరే..



తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను వదులుకోం అంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామ రైతులు తెగేసి చెప్పారు. ధర్యాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సంబంధించి అధికారులు గురువారం ట్రెంచ్ పనులు చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న స్థానిక రైతులు పనులను తీవ్రంగా అడ్డుకున్నారు. తమకు చట్టపరమైన న్యాయం చేయాలంటూ ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం. ఇండస్ట్రియల్ పార్కు కోసం అధికారులు గతంలో సర్వే నిర్వహించారు. అయితే, ప్రభుత్వం గుర్తించిన ఈ భూమిని తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ, దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా, తమ పొట్ట కొట్టేలా ట్రెంచ్ పనులు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు భూములను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు పోలీసులకు, రైతులకు మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.





# నిరసనలు..వాయిదాల మధ్య బిల్లులుపాస్

- పార్లమెంట్ ఉభయసభల్లోనూ ఇదే తంతు
- అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్షాలు పట్టు




**న్యూఢిల్లీ :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు రావాలని, విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యలపై సమాధానం చెప్పాల్సిందేనని ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసనలను పట్టువీడకుండా కొనసాగిస్తున్నాయి. ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో ప్లకార్డులు చేబూని వెల్‌వైపు దూసుకువచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉభయసభల్లోనూ గురువారం వాయిదాల పర్వం కొనసాగింది. గందరగోళం మధ్య, లోక్‌సభ పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు, 2026ను ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాలను మించిన వ్యయానికి పార్లమెంట్ ఆమోదం కోరే వినియోగాల బిల్లును రాజ్యసభ గురువారం ఆమోదించింది. ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే సభ మొదట హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబు దాడుల వార్షికోత్సవాలను స్మరించుకుంది. బాధితులకు నివాళులర్పించేందుకు సభ్యులు మౌనం పాటించారు. ఆ తర్వాత, జులై 20న విద్యార్థి నిరసనకారులపై పోలీసులు జరిపిన చర్యపై హోం మంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేయడం ప్రారంభించారు. గందరగోళం కొనసాగుతుండగా, ప్రశ్నోత్తరాల సమయం పార్లమెంటరీ కార్యకలాపాలలో ఒక ముఖ్యమైన భాగమని బిర్లా సభ్యులకు గుర్తు చేశారు. జులై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి దీనిని ఒక్కసారి కూడా జరగనివ్వలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. కొనసాగుతున్న గందరగోళం మధ్య, సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007, ఆదాయపు పన్ను చట్టం, 2025 లను మరింతగా సవరించడానికి, ఆర్థిక చట్టం, 2026ను సవరించడానికి ఉద్దేశించిన పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు, 2026 ను పరిశీలనలోకి తీసుకోవడానికి ప్రవేశపెట్టారు. అయితే విపక్ష సభ్యుల గందరగోళం మధ్యే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ), ఇతర నోటిఫైడ్ ఎలక్ట్రానిక్ చెల్లింపు పద్ధతుల ద్వారా జరిగే చెల్లింపులపై ఛార్జీలు విధించడానికి బ్యాంకులు, ఇతర సేవా సంస్థలకు ప్రభుత్వానికి అధికారం కల్పించే చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007ను సవరించే బిల్లును లోక్‌సభ గురువారం మూజువామి ఓటు ద్వారా ఆమోదించింది. ఇక రాజ్యసభ కూడా మధ్యాహ్నం 3.15 గంటల నాటికి మూడుసార్లు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తరువాత నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్, కొన్ని ప్రతిపక్ష పార్టీలు నుండి వాకౌట్ చేశాయి. మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పుడు, సభా కార్యకలాపాలను ఒక గంట పాటు వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ముందుగా ప్రకటించినప్పటికీ, రాజ్యసభ అంతకంటే ముందే తిరిగి సమావేశమైంది. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ డిమాండ్‌ను కొనసాగించడంతో సభలో గందరగోళ వాతావరణం కొనసాగింది. ప్రతిపక్షాల డిమాండ్ల నేపథ్యంలో రాజ్యసభ మూడుసార్లు వాయిదా పడింది.

## పార్లమెంట్ ఆవరణలో

అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అమానుష చర్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపిలు గురువారం కూడా పార్లమెంట్ భవన సముదాయంలో ఆందోళన చేపట్టారు. వర్షం కురుస్తున్నప్పటికీ, గొడుగులు పట్టుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ఎంపిలు ప్రదర్శించారు. పార్లమెంట్ మకర ద్వారం ముందు 'చందా చోర్, గద్దీ ఛోడ్, 'అమిత్ షా జవాబ్ దో', 'బిజెపి కే దఫ్తర్ మే, చాందా చోర్ కహా మిలేంగే' వంటి నినాదాలతో నిరసన తెలిపారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగిదని, దానికి ప్రతీకగా ఎంపిలు ఆ ప్రదేశంలో ఒక విరాళాల పెట్టెను ఉంచి, దాని చుట్టూ వరుసగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన ప్రతిపక్ష ఎంపిలు, 'అమిత్ షా జవాబ్ దో' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక బారులు తీరి, హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు, అయోధ్యలోని రామ మందిరం నుండి విరాళాలను అపహరించారన్న ఆరోపణలపై జవాబుదారీతనం కోరుతూ ఎస్‌పి ఎంపిలు కూడా విడిగా నిరసన చేపట్టారు. రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలు, గత వారం విద్యార్థుల నిరసనల సందర్భంగా వారిపై క్రూరమైన బలప్రయోగం వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఇండియా కూటమి నేతలు ప్రతిన బూనారు. ప్రతిపక్షాల డిమాండ్లపై పార్లమెంట్ ఉభయ సభలు ప్రతిష్టంభనలో కొనసాగుతుండగా, చాలా వరకు శాసనపరమైన కార్యకలాపాలు గందరగోళం మధ్యే జరుగుతున్నాయి.

### విద్యార్థుల గళాన్ని వినిపించకుండా

# బిజెపి సర్కార్ నన్ను అడ్డుకోలేదు

- ప్రయాగ్‌రాజ్‌లో తన 'ఛాత్రోన్ కీ గూంజ్'కు అనుమతి రద్దుపై రాహుల్‌గాంధీ మండిపాటు
- విద్యార్థుల సమస్యలు వినడానికి బదులు వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తారా ? అని నిలదీత



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో తన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమానికి నిర్వాహకులు అనుమతిని రద్దు చేయడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బిజెపి ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా విద్యార్థుల గళాన్ని వినిపించకుండా తనను అడ్డుకోలేదన్నారు. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి, ఈనెల 8న ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో జరగాల్సిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమానికి కాయస్థ పాఠశాల ట్రస్ట్ అనుమతిని రద్దు చేసిన నేపథ్యంలో ప్రతిపక్ష నేత ఈ వ్యాఖ్యలు చేశారు.కార్యక్రమ స్థలంలో నీరు నిలిచిపోవడాన్ని కూడా రద్దుకు కారణంగా ట్రస్ట్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ విమర్శనాస్త్రాలు సంధించారు. అలహాబాద్ యూనివర్సిటీ విద్యార్థులు ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపునకు వ్యతిరేకంగా తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కానీ విద్యార్థుల మాట వినడానికి బదులుగా, యంత్రాంగం వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తోందని ఆరోపించారు. యువత గళాన్ని అణచివేయడమే మోదీ ప్రభుత్వ విధానమని ధ్వజమెత్తారు. ప్రశ్న అడిగితే లాఠీచార్జ్, నిరసన తెలిపితే కేసులు, గళం విప్పితే పెల్లెట్ గన్‌ల దాడి ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. 'విద్యార్థుల సమస్యలను వినడానికి ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నేను నిర్ణయించుకున్నప్పటి నుండి, నా కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి యంత్రాంగం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది' అని గాంధీ చెప్పారు. 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమానికి కూడా వారు భయపడుతున్నారని స్పష్టమవుతోందని ఆయన అన్నారు. 'నేను విద్యార్థులకు అండగా ఉంటాను. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, వారి గళాన్ని వినిపించకుండా నన్ను అడ్డుకోలేదు' అని స్పష్టం చేశారు. కాయస్థ పాఠశాల ట్రస్ట్ తాత్కాలిక అధ్యక్షుడు జితేంద్ర నాథ్ చౌదరి పిటిఐతో మాట్లాడిన తర్వాత రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. కెపి కాలేజీ మైదానాన్ని క్రీడలు, విద్యాపరమైన కార్యకలాపాలకు తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని అలహాబాద్ హైకోర్టు ఆగస్టు 14, 2025 నాటి ఉత్తర్వుల్లో ఆదేశించిందని చౌదరి తెలిపారు. వర్షం కారణంగా మైదానంలో నీరు నిలిచిపోయిందని, బహిరంగ కార్యక్రమానికి అది సురక్షితం కాదని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌కు ఇచ్చిన అనుమతి జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదానికి లోబడి ఉంటుందని చౌదరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పేపర్ లీకేజీలు, విద్యార్థులను ప్రభావితం చేసే ఇతర అంశాలపై విద్యార్థులతో లోక్‌సభ ప్రతిపక్ష నేత సంభాషించాల్సి ఉంది. ఈ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించేందుకు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ బుధవారం ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించారు. కెపి ట్రస్ట్ సభకు అనుమతిని రద్దు చేసినప్పటికీ, రాహుల్ గాంధీ 8న ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి విద్యార్థులతో సంభాషిస్తారని రాయ్ స్పష్టం చేశారు.

# విరాళాల స్వీకరణలో డిఎంకె టాప్

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,051.56 కోట్లు స్వీకరించిన ప్రాంతీయ పార్టీలు
- అంతకు ముందు ఏడాదితో పోలిస్తే అధికం

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రాంతీయ పార్టీలు రూ. 20 వేలకంటే ఎక్కువగా స్వీకరించిన విరాళాల సంఖ్య అంతకంతా పెరుగుతూనే ఉన్నాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2024–25 సంవత్సరంలో మూడు రెట్లు పెరిగాయి. అందులో డిఎంకె అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఒక నివేదికను విడుదల చేసింది. నివేదిక ప్రకారం...ప్రాంతీయ పార్టీలు స్వీకరించిన విరాళాల మొత్తం విలువ 2023–24లో రూ. 347.69 కోట్లు ఉండగా, 2024–25లో రూ. 1,051.56 కోట్లకు పెరిగింది. ఈ రెండేళ్లలో స్వీకరించిన విరాళాల సంఖ్య 2023–24లో 2,861 కాగా, 2024–25లో 5,297గా ఉంది, అంటే 85 శాతం పెరుగుదల నమోదైంది. రాజకీయ నిధుల సేకరణలో కార్పొరేట్, వ్యాపార సంస్థల ఆధిపత్యం కొనసాగింది. 2024–25లో అవి రూ. 644.93 కోట్ల విరాళాలు అందించాయి (ఇది అంతకుముందు ఏడాది ఇచ్చిన రూ. 227.61 కోట్లతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఎక్కువ), అయితే మొత్తం విరాళాల విలువలో వాటి వాటా స్వల్పంగా తగ్గింది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి, కార్పొరేట్, వ్యాపార సంస్థలు 650 విరాళాల ద్వారా రూ. 872.54 కోట్లు అందించాయి. ఇది మొత్తం విరాళాల విలువలో 62 శాతానికి పైగా ఉంది. వ్యక్తిగత దాతల నుండి అత్యధిక సంఖ్యలో విరాళాలు అందాయి. రెండేళ్లలో వారు 5,647 విరాళాలు ఇచ్చారు. అయితే, వారు అందించిన మొత్తం రూ. 193.95 కోట్లు మాత్రమే. ఇది మొత్తం విరాళాల విలువలో సుమారు 14 శాతం. 2024–25లో వ్యక్తిగత విరాళాల సంఖ్య పెరిగినప్పటికీ, వాటి మొత్తం విలువ తగ్గింది. దీనివల్ల మొత్తం విరాళాలలో వారి వాటా గణనీయంగా పడిపోయింది. గుర్తు తెలియని లేదా వివరాలు వెల్లడించని దాతల నుండి వచ్చిన విరాళాలలో భారీ పెరుగుదల ఉన్నట్లు కూడా ఈ నివేదిక పేర్కొంది. 2023–24లో రూ. 6.62 కోట్లుగా ఉన్న ఈ విరాళాలు 2024–25లో రూ. 302.67 కోట్లకు పెరిగాయి. తద్వారా మొత్తం విరాళాల విలువలో వాటి వాటా దాదాపు 29 శాతానికి చేరింది. వివరాలు వెల్లడించని దాతల నుండి అత్యధిక మొత్తాన్ని ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె) స్వీకరించింది. ఆ మొత్తం రూ. 300.64 కోట్లు కాగా, ఇది ఆ ఏడాది ఆ పార్టీ పొందిన మొత్తం ప్రకటించిన విరాళాలలో 82 శాతానికి పైగా ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 365.78 కోట్ల విరాళాలను ప్రకటించడం ద్వారా తమిళనాడుకు చెందిన ఆ పార్టీ అత్యధిక విరాళాలు పొందిన పార్టీల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ. 184.96 కోట్లతో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి), రూ. 140.04 కోట్లతో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఉన్నాయి. 2023–24లో రూ. 100.19 కోట్లతో తెలుగుదేశం పార్టీ (టిడిపి) అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. టిఎంసి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, టిడిపి, ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె), బిజు జనతా దళ్ (బిజెడి) వంటి పార్టీలు దాదాపు పూర్తిగా కార్పొరేట్, వ్యాపార సంస్థల విరాళాలపైనే ఆధారపడ్డాయని, ఇతర వర్గాల నుండి వచ్చిన విరాళాలు చాలా తక్కువగా లేదా అసలు లేవని నివేదిక పేర్కొంది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో 'ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్' అతిపెద్ద దాతగా నిలిచింది. ఇది 38 విరాళాల ద్వారా రూ. 434 కోట్లను అందించింది. ఆ తర్వాత రూ. 160 కోట్లతో 'టైగర్ అసోసియేట్స్' నిలిచింది. 'ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్', 'వేదాంత లిమిడ్, 'ఎబి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్' కూడా టాప్ 5 దాతల జాబితాలో ఉన్నాయి. రాజకీయ నిధుల సేకరణలో ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ఆధిపత్యం కొనసాగింది. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్, ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్, ఎబి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ కలిసి రూ. 536 కోట్లను అందించాయి. ఇది ఆ రెండేళ్ల కాలంలో టాప్ 10 దాతలు అందించిన మొత్తం విరాళాలలో దాదాపు 64 శాతానికి సమానం. పాన్ వివరాలు లేని విరాళాల విలువ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 7.69 కోట్ల నుండి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 329.58 కోట్లకు భారీగా పెరిగిందని, ఇది ఆ సంవత్సరంలో వచ్చిన మొత్తం విరాళాలలో 31 శాతానికి పైగా ఉందని నివేదిక వెల్లడించింది. పాన్ వివరాలు లేని విరాళాల సంఖ్య కూడా అంతకుముందు ఏడాది ఉన్న 529 నుండి 2,463కి పెరిగింది. అలాగే, నగదు రూపంలో వచ్చిన విరాళాల విలువ అంతకు ముందు ఏడాది రూ. 6.54 కోట్ల నుండి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 301.44 కోట్లకు భారీగా పెరిగిందని, అదే సమయంలో చెల్లింపు విధానాన్ని వెల్లడించకుండా రూ. 13.39 కోట్ల విలువైన 1,978 విరాళాలు నమోదయ్యాయని కూడా నివేదిక పేర్కొంది.

# జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలు తీవ్రతరం

- అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేల ప్రదర్శనలు
- ప్రభుత్వంతో చర్చలకు 11 మందితో టీం



**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలు తీవ్రతరమయ్యాయి. పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గత 13 రోజులుగా ఆరుగురు నిరసనకారులు నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల మొదటి రోజే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోకి వచ్చి నిరసన తెలిపారు. జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జెపిఎస్‌సి – జెఎస్ఎస్‌సి సంస్కరణల మంచ్ ఆధ్వర్యంలో జులై 25న ప్రారంభమైన ఈ నిరసన, ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద విద్యార్థి నేతృత్వ ఉద్యమాలలో ఒకటిగా నిలిచింది. 14వ జార్ఖండ పిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలని, అలాగే నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిబిఐతో గానీ లేదా రాష్ట్రం వెలుపలి నుండి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తుల బృందంతో గానీ స్వతంత్ర విచారణ జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి కొద్దిసేపటి ముందు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నిరసన చేపట్టి, నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మిత్రపక్షం అయినప్పటికీ, జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరసన చేస్తున్న విద్యార్థులకు ఆ పార్టీ మద్దతు ప్రకటించింది. ప్రశ్నాపత్రాల లీక్ సమస్యలు జాతీయ సమస్య అని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వ్యాఖ్యానించారు. ప్రతిష్టంభనను పరిష్కరించడానికి చర్చలకు ముందుకొచ్చారు. బిజెపి ఆరోపణలపై స్పందిస్తూ, విద్యార్థులు లేవనెత్తిన అంశంపై ప్రభుత్వం తీవ్రంగా ఉందని జార్ఖండ్ మంత్రి సుదివ్య కుమార్ అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు 7, 10 తేదీలలో అసెంబ్లీ వద్ద పికెటింగ్ చేయాలని ప్రతిపాదించడంతో, 6 నుండి 12 వరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అసెంబ్లీ భవనానికి 750 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి) జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్)లలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలన్న తమ డిమాండ్‌ను నిరసనకారులు కొనసాగించారు. జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా (జెఎల్‌కెంఎం) నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో చేపడుతున్న నిరాహార దీక్షలో ఇద్దరు మహిళలతో సహా ఐదుగురు నిరసనకారులు చేరారు. ఆయన గత ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు.

**చర్చలకు 11 మందితో బృందం**

ఇదిలా ఉండగా, విద్యార్థులు, ఉద్యోగార్థులు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు 11 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసినట్లు గురువారం ప్రకటించారు. చర్చల కోసం నిరసనకారులకు తమ ప్రభుత్వ ద్వారాలు తెరిచే ఉన్నాయని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పిన ఒక రోజు తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. 'చర్చల కోసం ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ప్రతిస్పందనగా, ఎనిమిది మంది విద్యార్థులు, ఇద్దరు నిపుణులు (జర్నలిస్టులు), ఒక న్యాయవాదితో కూడిన 11 మంది సభ్యుల ప్రతినిధి బృందాన్ని మేము ఏర్పాటు చేశాము' అని జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి రిఫారమ్స్ మంచ్ కార్యనిర్వాహక అధికారి ఒకరు తెలిపారు. తాము శాంతియుత చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలనుకుంటున్నాము కాబట్టి, పాత్రికేయులు, న్యాయవాది పాత్ర కేవలం మార్గదర్శకత్వం అందించడానికే పరిమితం అవుతుందని ఆ కార్యవర్గ సభ్యుడు అన్నారు.

### గల్లంతైన భారత జాలర్ల ఆచూకీ కోసం

# రంగలోకి శ్రీలంక నౌకాదళం

**కొలంబో:** గల్లంతైనా 11 మంది భారత జాలర్ల ఆచూకీ కోసం శ్రీలంక నౌకాదళం రంగంలోకి దిగింది. శ్రీలంక జలాల్లో భారత పడవ ప్రమాదానికి గురికాగా, అందులోని జాలర్లు గల్లంతైన విషయం తెలిసిందే. చేపల వేటకు ట్రాలర్‌లో వెళ్లిన మత్స్యకారులు, శ్రీలంక జలాల్లోకి ప్రవేశించినప్పుడు ప్రమాదానికి గురైనట్టు సమాచారం. శ్రీలంక ఉత్తర తీరంలోని పాక్ జలసంధి సమీపంలో ఉన్న డెలఫ్ట్ ఐలాండ్ (నెడుంథీవు) తీరప్రాంత పగడపు దిబ్బల వద్ద ఈ ప్రమాదం జరిగింది. ట్రాలర్ అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖను దాటి శ్రీలంక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులోని మత్స్యకారులు చేపల వేట సాగిస్తుండగా, సముద్రంలోని పగడపు దిబ్బను పడవ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనపై స్పందించిన శ్రీలంక నౌకాదళం తక్షణమే సహాయక, రక్షణ చర్యలు ప్రారంభించింది. ఢీకొన్న తీవ్రతకు బోటు నిర్మాణానికి పాక్షికంగా నష్టం వాటిల్లినప్పటికీ, పరిస్థితి విషమించలేదని, బోటులోని మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని శ్రీలంక నౌకాదళ అధికార ప్రతినిధి కమాండర్ చమింద వాలకులుగే తెలిపారు. వారిని రక్షించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు ప్రత్యేక రెస్క్యూ యూనిట్లను సంఘటనా స్థలానికి పంపిపినట్టు తెలిపారు. కాగా, మత్స్యకారులను రక్షించిన అనంతరం, శ్రీలంక చట్టపరమైన నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నౌకాదళం ఒక ప్రకటనలో పేర్కొంది.

### లఖింపూర్ హింసాకాండ కేసులో..

# ఆశిష్‌మిశ్రా బెయిల్ షరతుల సడలింపున 'సుప్రీం' నో



**న్యూఢిల్లీ :** లఖింపూర్ ఖేరీ హింసాకాండ (2021)కేసులో ప్రధాన నిందితుడు ఆశిష్ మిశ్రా బెయిల్ షరతులను మరింత సడలించడానికి గురువారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, తన బెయిల్ షరతులను సడలించాలని, కుటుంబ కార్యక్రమాలలో పాల్గొనేందుకు తన స్వగ్రామానికి వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ ఆశిష్ మిశ్రా దాఖలు చేసిన దరఖాస్తును సర్వోన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. ప్రస్తుతం ఉన్న ఆంక్షల కారణంగా ఆశిష్ మిశ్రా తన కుమార్తెల పుట్టిన రోజు వేడుకలు సహా కుటుంబ కార్యక్రమాలకు హాజరుకాలేకపోతున్నారని మిశ్రా తరుపు న్యాయవాది ధర్మాసనానికి విన్నవించారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ ఈ దశలో, మిశ్రా అభ్యర్థనను స్వీకరించడానికి ఎటువంటి ఆధారమూ లేదని చెబుతూ దరఖాస్తును కొట్టివేస్తున్నామని సిజెఐ పేర్కొన్నారు. విచారణ సందర్భంగా బాధిత రైతుల తరపున న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ తన వాదనలు వినిపించారు. విచారణ జరుగుతోన్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ అతివేగం, తొందరపాటుతో జరుగుతున్నందువల్ల ప్రత్యక్ష సాక్షులతో సహా పలువురు కీలక సాక్షులను కూడా తొలగిస్తున్నారని ప్రశాంత్‌భూషణ్ వాదించారు. ఈ ఆందోళనలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ ఒక దరఖాస్తును దాఖలు చేయనున్నట్లు బెంచ్‌కు తెలిపారు. స్పందించిన సిజెఐ, అటువంటి ఫిర్యాదులను తొలుత ట్రయల్ కోర్టులోనే లేవనెత్తాలని అన్నారు.'ఈ అభ్యర్థనను స్వీకరించడానికి మేం ప్రధాన వేదిక ఎందుకు అవుతాం?. మీరు ముందుగా ట్రయల్ కోర్టునే ఆశ్రయించి, వీరే కీలక సాక్షులని తెలియజేయాలి' అని ధర్మాసనం ప్రశాంత్‌భూషణ్‌కు స్పష్టం చేసింది. సాక్షిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తిపై ఛార్జిషీట్ దాఖలైన మరోకేసులోని కొన్ని డాక్యుమెంట్లను అనువదించి, వాటిని పరిశీలిస్తున్నారని రైతుల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలిపారు. ఆ వ్యక్తి ఆశిష్ మిశ్రా మద్దతుదారుడన్న వాదనను ఆశిష్ మిశ్రా తరుపు న్యాయవాది వ్యతిరేకించారు. 2021, అక్టోబర్ 3న ఉత్తర్ ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలోని టికునియాలో, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యా ఆ ప్రాంత పర్యటనకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసన సందర్భంగా నలుగురు రైతులు సహా 8మంది మరణించిన విషయం తెలిసిందే. 2023 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు ఆశిష్ మిశ్రా సహా 12మందిప ఇతరులపై హత్య, నేరపూరిత కుట్ర, ఇతర నేరాలతో సహా పలు అభియోగాలను నమోదు చేసింది.

### 2013లో సహోద్యోగిపై రేప్ కేసులో..

# తెహెల్కా మాజీ సంపాదకుడికి 10ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**బాంబే హైకోర్టు తీర్పు**

**నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం**

**పనాజీ :** సహోద్యోగిపై అత్యాచారం చేసిన (2013) కేసులో మాజీ తెహెల్కా సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను బాంబే హైకోర్టు దోషిగా నిర్ధారిస్తూ 10ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది. ఆయన్ను 5ఏళ్ల క్రితం నిర్దోషిగా విడుదల చేస్తూ గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును గురువారం బాంబే హైకోర్ట్ పక్కన పెట్టింది. బాంబే హైకోర్ట్ గోవా ధర్మాసనానికి చెందిన జస్టిస్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్ తరుణ్ తేజ్‌పాల్ రెండు వారాలలో లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, తరుణ్ తేజ్‌పాల్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు ధర్మాసనం ఆ సమయాన్ని నాలుగు వారాలకు పొడిగించింది. ఈ సంఘటన 13 ఏళ్ల క్రితం జరిగిందని, అప్పటి నుంచి తేజ్‌పాల్ ఏ ఇతర నేరానికీ పాల్పడలేదని పేర్కొన్న కోర్టు, అతనికి కనీస శిక్షను విధిస్తున్నట్లు తెలిపింది. 'ఇరుపక్షాలు (బాధితురాలు, తేజ్‌పాల్) ఇప్పుడు జీవితంలో ముందుకు సాగిపోయి ఉండవచ్చు' అని ధర్మాసనం పేర్కొంది. తేజ్‌పాల్‌పై కోర్టు రూ.10,21,000 జరిమానా కూడా విధించింది. దీనిని బాధితుడికి చెల్లించాల్సి ఉంటుంది. లైంగిక దాడికి గురైన బాధితురాలికి ఈ జరిమానా మొత్తాన్ని అందజేయడం జరుగుతుంది అని తెలియజేసింది. తేజ్‌పాల్ తాను 'ఒక రాజకీయ బాధితుడిని' అని, ఇద్దరు కుమార్తెల తండ్రిని అని పేర్కొంటూ కనికరం చూపాలని ధర్మాసనాన్ని వేడుకున్నారు. అయితే, గోవా ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ 'కాదంటే కాదు' అనే గట్టి సందేశం పంపడానికి తేజ్‌పాల్‌కు గరిష్ఠ శిక్ష విధించాలని బెంచ్‌ను డిమాండ్ చేశారు. 'ట్రయల్ కోర్ట్ నిర్దోషిత్వ ఉత్తర్వును మేం రద్దు చేస్తున్నాం. ప్రతివాది (తరుణ్ తేజ్‌పాల్) దోషిగా నిర్ధోషించబడ్డాడు' అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై తేజ్‌పాల్ స్పందిస్తూ హైకోర్ట్‌కు ఉత్తర్వుకు వ్యతిరేకంగా తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని అన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 376 (2)(ఎఫ్) సంరక్షుడిగా లేదా నమ్మకమైన అధికార స్థానంలో ఉన్న వ్యక్తి ఒక మహిళపై అత్యాచారం చేయడం, 354 (ఏ) లైంగిక వేధింపులు, 354(బి)(ఆమె దుస్తులు తొలగించే ఉద్దేశంతో ఒక మహిళపై నేరపూరిత బలాన్ని ప్రయోగించడం) కింద న్యాయస్థానం అతడిని దోషిగా నిర్ధారించింది. సెక్షన్ 376 (2) (ఎఫ్) కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, సెక్షన్ 354 (ఏ) కింద ఒక సంవత్సరం, 354 (బి) కింద మూడేళ్ల శిక్షను తరుణ్ తేజ్‌పాల్‌కు ధర్మాసనం విధించింది. అన్ని శిక్షలూ ఏకకాలంలోఅమలు అవుతాయని వెల్లడించింది. ఈ సందర్భంగా తేజ్‌పాల్ తరపు న్యాయవాది అబాద్ పొండా కనిష్ట శిక్షను కోరుతూనే, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్షను, దోషిగా నిర్ధారణను కనీసం 10వారాల పాటు నిలిపివేయాలని కోర్టును అభ్యర్థించారు. హైకోర్ట్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తరుణ్‌తేజ్‌పాల్ విలేకరులకు తెలియజేశారు. 2013నవంబరులో గోవాలో జరిగిన థింక్ ఫెస్ట్ కార్యక్రమానికి వెళ్లినప్పుడు, ఒక హోటల్ ఎలివేటర్‌లో ఆ సీనియర్ జర్నలిస్ట్ తన మాజీ జూనియర్ సహోద్యోగిపై లైంగిక దాడి చేశారని ఆమె చేసిన ఆరోపణలకు సంబంధించినది ఈ కేసు. 2021లో ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించిన తర్వాత, గోవా ప్రభుత్వం ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేసింది. తేజ్‌పాల్ తరపు న్యాయవాది పొండా మాట్లాడుతూ తరుణ్‌తేజ్‌పాల్ విచారణ జరిగినప్పటి నుంచి బెయిల్‌పైనే ఉన్నాడని, తనపై విధించిన షరతుల్లో దేనినీ ఎప్పుడూ ఉల్లంఘించలేదని, అతను ఇప్పుడు వయోవృద్ధుడని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ తేజ్‌పాల్ ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరిని , అలాగే, ఆరోపిత సంఘటన అనంతరం బాధితురాలు మామూలుగానే ప్రదర్శిస్తున్నట్లు చిత్రీకరించడాన్ని పరిగణనలోనికి తీసుకుని అతనికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని పేర్కొన్నారు. తేజ్‌పాల్ బాధితురాలిపై ఆధిపత్య ధోరణిలో ఉండేవాడని, బాధితురాలు కేవలం సహోద్యోగి మాత్రమే కాదని, అతని కుమార్తెకు స్నేహితురాలు కూడా అనే విషయంలో ఏ మాత్రం పశ్చాత్తాపం సైతం చూపడం లేదని తుషార్ మెహ్‌తా తెలిపారు.

# ఉక్రేన్‌పై రష్యా క్షిపణి దాడులు



**కీవ్:** రష్యా సైన్యం ఉక్రేన్‌లోని కీవ్‌తో పాటు పలు ప్రధాన నగరాలపై రాత్రికి రాత్రే బాలిస్టిక్ క్షిపణులతో భారీ దాడులు జరిపింది. ఈ దాడుల్లో తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవించిందని ఉక్రేన్ ప్రకటించింది. పెరిగిన రష్యా వైమానిక దాడులను తట్టుకోవడానికి తమకు వెంటనే అదనపు గగనతల రక్షణ వ్యవస్థలను అందించాలని నాటోతోపాటు పాశ్చాత్య దేశాలకు కూడా ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదొమిర్ జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. కాగా, ఉక్రేన్ బలగాలు రష్యా సరిహద్దులకు చాలా దూరంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారాలపై రాత్రికి రాత్రే డ్రోన్లతో దా డులు చేశాయి. రష్యా యుద్ధ ఆధారిత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు క్రెమ్లిన్‌పై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్టు జెలెన్స్కీ ధ్రువీకరించారు. ఫ్రంట్‌లైన్‌కు దాదాపు 1,300 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాష్కోర్టోస్తాన్, యారోస్లావ్ ప్రాంతాల్లోని రిఫైనరీలతో పాటు నల్లసముద్రంలో రష్యా మిలిటరీ పట్రోలింగ్ పడవలు, షాడో ఫ్లీట్ నౌకలపై కూడా దాడులు చేశామని ఆయన తెలిపారు. మరోవైపు తమ భూభాగంపైకి వచ్చిన 605 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదే సమయంలో రష్యా ప్రయోగించిన గ్లైడ్ బాంబులు, క్షిపణి దాడుల కారణంగా ఉక్రేన్‌లోని ఖార్కివ్, సుమీ, ఖేర్సన్ ప్రాంతాల్లో ముగ్గురు పౌరులు మరణించగా, 22 మంది గాయపడ్డారు. ప్రస్తుతం రష్యా తీవ్రమైన బాలిస్టిక్ క్షిపణి దాడులు కొనసాగిస్తుండడంతో, ఉక్రేన్ వద్ద గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడింది. వీటిని అడ్డుకోవడానికి అవసరమైన పేట్రియాట్ వంటి ఇంటర్‌సెప్టర్ క్షిపణులను అత్యవసరంగా సరఫరా చేయాలని జెలెన్స్కీ కోరుతున్నారు. ఉక్రేన్ నిరోధక శక్తిని క్రమంగా క్షీణింపజేయాలని రష్యా భావిస్తున్న తరుణంలో ఈ ఆర్మమెంట్ సరఫరా అత్యంత కీలకమని ఆయన నొక్కిచెప్పారు. దాడి, ప్రతిదాడులు కొనసాగుతున్న కారణంగా, రష్యా–ఉక్రేన్ మధ్య శాంతి స్థాపన సాధ్యం కావడం లేదని పరిశీలకుల అభిప్రాయం ఇలావుంటే, జర్మనీలోని లైప్జిగ్ విమానాశ్రయంలో ఉక్రేన్‌కు చెందిన విమానాలు నిలిపి ఉంచిన స్థలానికి సమీపంలో పేలుడు పదార్థాలతో నిండి ఉన్న ఒక డ్రోన్‌ను జర్మన్ అధికారులు గుర్తించారు. తక్షణమే స్పందించిన భద్రతా బలగాలు ఆ డ్రోన్ డిటోనేటర్‌ను తొలగించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన జర్మనీ హోంశాఖ అధికారులు, ఇది తమ దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరమైన కొత్త స్థాయి సవాలని పేర్కొన్నారు. రష్యా–ఉక్రేన్ యుద్ధం కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా, ఐరోపా సమాఖ్య దేశాల భద్రతకూ తీవ్ర ముప్పుగా మారుతోందని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయిచేస్తున్నాయి.

# ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల నిరసన ప్రదర్శనలు





**పెషావర్:** పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇమ్రాన్‌ను అరెస్టు చేసి, జైలుకు తరలించి మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పిటిఐ ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంది కార్యకర్తలు, నాయకులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. పిటిఐ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్ నగరం ఈ నిరసనలకు ప్రధాన కేంద్రంగా మా రింది. లాహోర్, మియాన్‌వాలీ, రావల్పిండి వంటి ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్‌లు, లాఠీచార్జి చేసి ప్రదర్శనకారులను చెదరగొట్టారు. వందమందికిపైగా కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు. లాహోర్‌లోని మాల్ రోడ్‌లో జరిగిన నిరసనలలో ఐదుగురు ఎంపిలతో సహా 25 మందికి పైగా అరెస్టయ్యారు. కరాచీలోని సద్దార్ టౌన్ ప్రాంతంలో ప్రదర్శనకారులను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. 10 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. వార్తలను సేకరిస్తున్న పలువురు జర్నలిస్టులపై కూడా పోలీసులు దాడులకు తెగబడటంతో కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడుల పట్ల మీడియా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలావుంటే, తమ సోదరుడి విడుదల కోసం ప్రజా ఉద్యమం ప్రారంభమైందని, త్వరలోనే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఇమ్రాన్ సోదరి అలీమా ఖాన్ తెలిపారు. జైలులో ఇమ్రాకు సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని, ఆయన కంటిచూపు కూడా మందగించిందని మాజీ కేంద్ర మంత్రి మూనిస్ ఎలాహి ఆరోపించారు. ఇమ్రాన్ స్వేచ్ఛను హరించినంత మాత్రాన ఆయన దృఢ సంకల్పాన్ని లేదా ధైర్యాన్ని దెబ్బతీయలేరని పిటిఐ నాయకుడు షెహర్యార్ అఫ్రిది వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఈ ఘటనలపై స్పందిస్తూ, గడచిన మూడేళ్లుగా ఇమ్రాన్‌కు న్యాయబద్ధమైన విచారణ పొందే హక్కును పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరిస్తోందని పేర్కొంది. ఆయనను సుదీర్ఘకాలంగా ఏ కాంత నిర్బంధంలో ఉంచారని, సరైన వైద్యం అం దించడం లేదని తెలిపింది. కుటుంబ సభ్యుల కలయికను నిరాకరించడం దురదృష్టకరమని విమర్శి ంచింది. గత ఎనిమిది నెలలుగా ఆయన కుటుం బ సభ్యులను కలవడానికి అనుమతి ఇవ్వలేదని, డిసెంబర్ 2025 నుండి ఇమ్రాన్ దంపతులకు న్యాయవాదుల సంప్రదింపులను రాజకీయ లబ్ధి కోసమే ఇమ్రాన్‌పై కేసులు మోపినట్టు పిటిఐ ఆరోపిస్తుండగా, షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది.

# కాంగోలో ఆరోగ్య సిబ్బంది నిరసన




**బునియా:** కాంగోలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఎబోలా వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేస్తున్న వందలాది మంది ఆరోగ్య సిబ్బంది తమకు రావలసిన బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసనకు దిగారు. ఇటురి ప్రావిన్స్ రాజధాని బునియాలోని గవర్నర్ కార్యాలయం వద్ద ఈ నిరసన చేపట్టారు. దేశంలోని మొత్తం ఎబోలా కేసుల్లో దాదాపు 90 శాతం ఈ ప్రాంతంలోనే నమోదవుతున్నాయి. మే నెల మధ్యలో ఎబోలా వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుండి తమకు అందవలసిన జీతాలు, అలవెన్సులు అందలేదని, అందువల్ల పలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుండి తాము బయటకు వచ్చి నిరసన తెలుపుతున్నామని నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే ఉంటే ఈ ప్రావిన్స్‌లో ఎబోలా అదుపులోకి రావడం అసాధ్యమని నిరసనకారులు వ్యాఖ్యానించారు. గతంలో వేతనాల జాప్యానికి సాంకేతిక, రవాణా కారణాలను చెప్పిన ప్రభుత్వం, తాజా నిరసనలపై తక్షణమే స్పందించని విషయాన్ని కూడా వారు ప్రస్తావిస్తున్నారు. కాంగోలో ఇప్పటివరకు సంభవించిన ఎబోలా విజృంభణలలో ఇది రెండవ అతిపెద్దదిగా నమోదైంది. ఎబోలాపై పోరాడుతున్న విపత్కర పరిస్థితుల్లో సిబ్బందికి తగిన వేతనాలు లభించకపోవడంతో పాటు, ఇక్కడ తిరుగుబాటుదారులు, స్థానిక గుంపుల నుండి దాడుల ముప్పు కూడా పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధానోమ్ గెబ్రెయేసస్ మరియు 'డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్' వంటి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. వ్యాధి వ్యాప్తి గొలుసును తెంచడానికి సహాయక చర్యలు మరింత వేగవంతం కావాలని వారు హెచ్చరించారు.

### వసూలు చేసిన అదనపు టారిఫ్‌లను

# తిరిగి చెల్లిస్తున్న అమెరికా

### బెడిసికొడుతున్న అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు ప్రపంచ దేశాలతోపాటు, స్వదేశాన్ని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వివిధ దేశాలపై ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌ల చెల్లుబాటును రద్దు చేసిన అమెరికా సుప్రీం కోర్టు, ఆ మొత్తాలను తిరిగి చెల్లించాల్సిందిగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం వివిధ దిగుమతిదారులకు ఏకంగా 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.4 లక్షల కోట్లు) సుంకాలు తిరిగి చెల్లించే ప్రక్రియను ప్రారంభించింది. ఆమోదించిన అత్యవసర అధికారాలను ఉపయోగించి వివిధ దేశాలపై ట్రంప్ విధించిన అదనపు పన్నులను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో అమెరికా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గతంలో కంపెనీల నుండి వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించడానికి అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అవసరమైన కీలక లాంఛనాలను పూర్తి చేస్తోంది. టారిఫ్‌ల విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చైనా, యూరప్, భారతదేశాలతో అమెరికా వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు విదేశాల నుండి దిగుమతయ్యే జెనెరిక్ మందులపై దశలవారీగా భారీ టారిఫ్‌లను ప్రతిపాదించడం వల్ల, భారత ఫార్మా రంగానికి ఎదురుదెబ్బ తగిలింది. అదే సమయంలో, మందుల ధరలు విపరీతంగా పెరగడంతో అమెరికాలోని రోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాగా, చైనా, ఐరోపాలతో చిప్ సప్లై చైన్ మౌలిక వనరులు, తయారీ రంగాల పట్ల ట్రంప్ తీసుకొంటున్న నిర్ణయాలు గ్లోబల్ సప్లై చైన్‌ను మళ్ళీ అనిశ్చితిలోకి నెట్టివేస్తున్నాయి. అయితే, వివిధ ఫెడరల్ కోర్టులతోపాటు, సుప్రీం కోర్టు కూడా వివిధ కేసులపై ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడంతో పరిస్థితి క్రమంగా చక్కబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో వస్తువుల ధరలు, సరఫరా వ్యవస్థలపై రాబోయే రోజుల్లో స్పష్టమైన మార్పులు రావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

# 20న బంగ్లాలో రాష్ట్రపతి ఎన్నిక

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో రాష్ట్రపతి ఎన్నిక ఈనెల 20న జరగనుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. మాజీ రాష్ట్రపతి మొహమ్మద్ షహాబుద్దీన్ జులై 24న అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అవసరమైంది. ఆయన తన పదవీకాలం ముగియడానికి రెండేళ్ల ముందే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్లు ఆగస్టు 13న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన ఆగస్టు 16న ఉదయం 10 గంటలకు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరించుకునే చివరి తేదీ ఆగస్టు 18 సాయంత్రం 4 గంటలు. పోలింగ్ ఆగస్టు 20న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతియ సంసద్ (పార్లమెంట్) సెషన్ హాల్‌లో నిర్వహిస్తారు. ఎన్నికల సంఘం సీనియర్ సెక్రటరీ అక్తర్ అహ్మద్ ఈ షెడ్యూల్‌ను ధ్రువీకరించారు. ఓటర్ల జాబితా సిద్ధమైందని, ఇతర పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేస్తామని తెలిపారు. పార్లమెంట్ స్పీకర్ హాఫీజ్ ఉద్దీన్ అహ్మద్ ప్రస్తుతం తాత్కాలిక రాష్ట్రపతిగా సేవలు అందిస్తున్నారు.

## తెరుచుకునే అవకాశం!

(మొదటి పేజీ తరువాయి)

భద్రతను తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతుంది. ప్రస్తుతం హోర్ముజ్ జల సంధి ప్రాంతంలో ప్రశాంతత నెలకొనే దిశగా అడుగులు వేగంగా ముందుకు పడపడం ఆహ్వానించతగిన పరిణామమే అయినప్పటికీ, అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు, వ్యాపార వర్గాలు ఈ ఒప్పందం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. కాగా, ఈ మార్గం మీదుగా వెళ్లే నౌకలపై కొత్తగా రవాణా రుసుములు లేదా సుంకాలు విధిస్తే, అది ప్రపంచ సరఫరా వ్యవస్థ (గ్లోబల్ సప్లై చైన్)పై తీవ్ర ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఇంధనం, సరుకుల రవాణా ఖర్చులు పెరగడం వల్ల అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే విషయంలో సానుకూల వాతావరణం నెలకొంటున్నప్పటికీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతంలో ఇజ్రాయెల్ సైన్యం, హిజ్బుల్లా బలగాల మధ్యతీవ్ర స్థాయిలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన తాజా ఎదురుకాల్పుల్లో తమ దళాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కొందరు సైనికులు మరణించగా మరికొందరు గాయపడ్డారని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారకుండా నిరోధించేందుకు రోమ్‌లో దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ నాయకులు శాంతి స్థాపనకు ప్రయత్నిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

## పంద్రాగస్టు నుంచి పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రేషన్ కార్డుల పంపిణీని చేపడుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## 'క్యా బోల్తీ పబ్లిక్' (మొదటి పేజీ తరువాయి)

దీప్కే వచ్చే నెలలో 'క్యా బోల్తీ పబ్లిక్' ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, అందులో భాగంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై ప్రజల అభిప్రాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. విద్యార్థుల ఆందోళన ఫలితంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అతిపెద్ద విజయంగా అభివర్ణిస్తూ, 'గత 10–12 ఏళ్లుగా ప్రజల మనసుల్లో ఈ ప్రభుత్వం సృష్టించిన భయం ఇప్పుడు తొలగిపోయిందని దీప్కే పేర్కొన్నారు. ఇప్పుడు ప్రజలు వీధుల్లోకి వస్తారని, నేడు వారు ఒక వ్యక్తి రాజీనామాను కోరారు.. రేపు ఇతరుల రాజీనామాలను కూడా డిమాండ్ చేస్తారన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, పండిట్ నెహ్రూ కన్న కలలకు అనుగుణంగా సిజెపి పనిచేస్తుందని చెప్పారు. భారత రాజ్యాంగమే తమ సిద్ధాంతమని దీప్కే స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిజెపి ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్, ప్రతినిధి అశుతోష్ రంకా, ఇతర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై గత నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి ఆధ్వర్యంలో జరిగిన నిరసనల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. జంతర్ మంతర్ నిరసనలో విద్యార్థులే కాకుండా, ఉద్యోగాలు లేని యువత కూడా పాల్గొన్నారని దీప్కే తెలిపారు. 'నిరుద్యోగం ఒక ప్రధాన సమస్య; మేము దీనిని దేశవ్యాప్త సమస్యగా మారుస్తాం. విద్యా సంస్కరణల కోసం కృషి చేస్తాం. పాఠశాల స్థాయి నుంచే విద్య సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. విద్యను లాభాలు గడించడానికి వాడుకుంటున్నారు. కానీ మేము ఆ పరిస్థితిని మార్చాలనుకుంటున్నాము' అని ఆయన అన్నారు. దేశంలో 60 శాతం మంది ప్రజలు 35 ఏళ్ల లోపు వయస్సు వారేనని, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన వారిలో కూడా అటువంటి వారే ఉన్నారని దీప్కే పేర్కొన్నారు. మీడియా విశ్వసనీయతను తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందని కూడా సిజెపి వ్యవస్థాపకుడు అన్నారు.







(మొదటి పేజీ తరువాయి)

బిజెపి నిరుద్యోగ భారతాన్ని తయారు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశ యువత క్రియాశీలక పాత్ర పోషిస్తూ చేసిన పోరాటం దేశం చరిత్రలోనే చిరస్మరణీయమని, ఆ పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పలేదని, యువత దెబ్బకు విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు.యువతరం తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని దేశతలరాతని మార్చే సత్తా యువతకే ఉందన్నారు. కేంద్రంలో సాగుతున్న నిరంకుశ పాలన వల్ల ధరలు పెరిగిపోతున్నాయని, సార్వత్రిక విద్య వైద్యం అందుబాటులో లేదని, యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారని పంటలకు కనీస మద్దతు ధర లేదని, కార్మిక హక్కులు కాలరాస్తున్నారని, దళితులు ఆదివాసీలపై అకృత్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఇప్పటికైనా నిలుపుకోవాలన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ నిర్మించడం సరేనని, కానీ రాష్ట్రంలో పేదల ఇళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పెండిగ్ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవచూపాలని చెప్పారు. ఓట్ల కోసం కమ్యూనిస్టులతో స్నేహం చేసి ఆ తర్వాత బోడమలయ్య చందంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మాకు కుర్చీలు అవసరం లేదని ప్రజల పక్షాన అనునిత్యం పోరాటాలు సాగిస్తూనే ఉంటామని చెప్పారు. కమ్యూనిస్టులను తక్కువ చేసి చూస్తే కాంగ్రెస్‌కు కూడా బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని చెప్పారు. తమ సంఖ్య మీకు తక్కువే కనబడవచ్చు గానీ రాష్ట్రంలో అధికారం నుంచి దించేది, అధికార పీఠం ఎక్కించేది కమ్యూనిస్టులే అని చెప్పారు. ఇప్పటికైనా పొత్తు ధర్మాన్ని పాటించాలని హితవు పలికారు. తలాపునే గోదావరి జలాలు ఉన్నా జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరు అందడం లేదని, సీతారామ, సీతమ్మధారా ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను ఇతర జిల్లాలకు

## దేశంలో దొంగల రాజ్యం

తరలించుకుపోయే ప్రయత్నం సాగిస్తున్న పాలకులు ఈ జిల్లాకు సాగునీరు అందించిన తర్వాతే ఇతర జిల్లాలకు తరలించుకుపోవాలని చెప్పారు. లేదంటే ఉద్యమాల ద్వారా తమ జలాలను తాము దక్కించుకుంటామని చెప్పారు. జిలాల్లో మిగిలిన పోడు భూములకు పట్టాలివ్వాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని, ఇందరమ్మ ఇళ్ల లబ్దిదారులకు బిల్లులు మంజూరు చేయాలని తరతరాలుగా గిరిజనులతో పాటు సహజీవనం సాగిస్తున్న వారికి భూ హక్కులు కల్పించాలని ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి హేతుబద్ధమైన పరిహారం ఇవ్వాలని, పాలుసు బొంత ప్రాజెక్టును పూర్తి చేయాలని, బిటిపిఎస్ నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రచట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డిపుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్‌డి సలీం, కే సారయ్య, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కమటం వెంకటేశ్వరరావు, మువ్వా వెంకటేశ్వరరావు రేసు ఎల్లయ్య దేవరకొండ శంకర్ యు రాహుల్ ఎస్‌కే ఫహీమ్, మహిళా సమాఖ్య, విద్యార్థి యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం : తక్కళ్లపల్లి**

దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం ప్రారంభించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. హనుమకొండ జిల్లాలోని కాజీపేట పట్టణంలో పాదయాత్రను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పాదయాత్ర కాజీపేటలోని వాటర్ ట్యాంక్ నుండి ప్రారంభమై కాజీపేట మార్కెట్, మడికొండ నుండి ధర్మ సాగర్ మండలం రాంపూర్, పెద్ద పెండ్యాల, ధర్మ సాగర్,సాయి పేట, ముప్పారం, పీచర, వేలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశంలో ప్రజాకంతక పాలన కొనసాగిస్తున్న బిజెపి పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో సంవత్సర కాలం పాటు కొనసాగిన రైతు ఉద్యమంతో పాటు ఇటీవల దేశ రాజధాని డిల్లీలో పెద్ద ఎత్తున జరిగిన విద్యార్థి, యువజనుల ఆందోళననే ఇందుకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని,స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇందులో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న బయ్యారం ఉక్కు కర్మాగారం, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం వంటివి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, ఎన్. అశోక్ స్టాలిన్,బత్తిన సదానందం, ఉట్కూరి రాములు, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టె వెంకటేశ్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, ప్రజానాట్యమండలి నాయకులు రొంటాల శ్యామ్,డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలపక్షాన పనిచేయకుంటే పరాభావం తప్పదు**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా హెచ్చరిక**

ప్రధాని మోదీ తన 12 ఏళ్ల పాలనలో ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసమే పని చేశారని, ఈ మిగిలిన మూడేళ్లైనా దేశ ప్రజల కోసం పని చేయాలని లేకపోతే ఘోర పరాభావం తప్పదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా హెచ్చరించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుచి లిబర్టీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రారంభ పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ.టి నరసింహా మాట్లాడుతూ మోదీ పాలనతో యువత, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి జీవితాల్లో ఏలాంటి మార్పు రాలేదన్నారు. బిజెపి ప్రభుత్వం 100 కుటుంబాలకు లాభం చేకూర్చడం తప్ప దేశ ప్రజలకు చేసిందేమిలేదని విమర్శించారు. ప్రధాని మోదీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని, గతంలో ఈలాంటి నియంతలంతా కూడా ఆత్మహత్యలు చేసుకుని చనిపోయే పరిస్థితి వచ్చిందన్న విషయం మర్చిపోవద్దని హితువు పలికారు. తన చుట్టూ ఉన్న ఈడి, సిబిఐ, మరొక సంస్థతోనో తనకు ఉన్న లక్ష మంది వాట్సాప్ యూనివర్సిటీతోనో పిల్లలను బెదిరిస్తాననుకుంటే కుదిరే పరిస్థితి లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న యువతను బెదిరించే ప్రయత్నాలను సిపిఐ సహించబోదని ఆయన హెచ్చరించారు. అవసరమైతే జైళ్లకు వెళ్లేందుకు సిద్దంగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహా, బి.వెంకటేశం, ఎన్.శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పక్కదారి

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు.జిల్లాలో ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులకు వెంటనే పంట నష్టం పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని అన్ని మండలాలు,గ్రామాల్లో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ప్రచార జీపు యాత్రలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నల్లగొండయాదాద్రి భువనగిరి జిల్లాల కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,తీర్పారి వెంకటేశ్వర్లు, బచ్చనగోని గాలయ్య, జిల్లా సమితి సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య, గట్టుపల్లి నర్సిరెడ్డి,మండల కార్యదర్శి చాపల శ్రీను,ఈదులకంటి కైలాస్, ఉప్పునూతల రమేష్, గోస్కొండ లింగయ్య, వనం వెంకన్న, కాగిత వెంకన్న,బండారు శంకర్,కట్కూరు లింగస్వామి,గోపగోని ఉదయ్, కార్మిక, హమాలి సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఆసియా కప్ షెడ్యూల్ విడుదల..

# సెప్టెంబర్ 5న భారత్, పాకిస్థాన్ మ్యాచ్



ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్‌లో ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ఏసిసి) తెలిపింది. క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ మళ్లీ చూసే అవకాశం రాబోతోంది. ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్లో తలపడిన దాయాదులు ఈసారి ఆసియా కప్(2026)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్లు ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ఏసిసి) తెలిపింది. గురువారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేసింది ఏసీసీ.ప్రతిష్ఠాత్మక మహిళల ఆసియా కప్ షెడ్యూల్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని గురువారం ఆసియా క్రికెట్ మండలి వెల్లడించింది. ఆగస్టు 28 నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్న ఏసీసీ.. అందరూ ఆసక్తి కనబరిచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరుగనుందని చెప్పింది.

**టాప్ 2 జట్లు సెమీస్‌కు**

రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనున్న ఆసియా కప్లో గ్రూప్ ఎ, గ్రూప్ బిలో ఐదేసి జట్లున్నాయి. భారత్, పాకిస్థాన్, చైనా, హాంకాంగ్, థాయ్లాండ్ మొదటి గ్రూప్‌లో.. ఆతిథ్య యూఏఇ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియాలు గ్రూప్ బీలో ఉన్నాయి. లీగ్ దశలో పాక్తో పాటు చైనా, హాంకాంగ్, థాయ్లాండ్‌కు టీమిండియా ఢీకొట్టనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్ 2 జట్లు సెమీస్కు వెళ్తాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్తో విజేత ఎవరో తేలిపోనుంది.

## దక్షిణాఫ్రికా పర్యటనలో కీలక మార్పు



డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. తొలుత బిసిసిఐ, సిఎస్ఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏకైక టెస్టు, ఆపై వన్డే సిరీస్తో పర్యటన ముగియాలి. లార్డ్స్ టెస్టులో ఘన విజయంతో జోరు మీదున్న భారత మహిళల జట్టు మళ్లీ బిజీ కానుంది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది టీమిండియా. అయితే.. ముందుగా అనుకున్న వన్డేలు, ఏకైక టెస్టుకు అదనంగా టీ20 సిరీస్ను చేర్చింది క్రికెట్ సౌతాఫ్రికా. ఈ విషయాన్ని గురువారం సఫారీ బోర్డు అధికారికంగా వెల్లడించింది. పటిష్టమైన టీమిండియాతో మూడు ఫార్మాట్ల సిరీస్ నిర్వహించడం తమ దేశ క్రికెట్‌కు మరింతగా ఉపయోగపడుతుందని సీఎస్ఏ భావిస్తోంది. డిసెంబర్లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. తొలుత బిసిసిఐ, సిఎస్ఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏకైక టెస్టు, ఆపై వన్డే సిరీస్‌తో పర్యటన ముగియాలి. కానీ, ఈ రెండు ఫార్మట్లకు అదనంగా టీ20 సిరీస్ను కలిపింది క్రికెట్ దక్షిణాఫ్రికా. బిసిసిఐ అందుకు అమోదించడంతో ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది సిఎస్ఎ. భారత జట్టుతో మ్యాచ్‌లకు ప్రేక్షకాదరణ నేపథ్యంలో మూడు టీ20ల సిరీస్‌ను ఆడించాలని నిర్ణయించింది ఆ దేశ బోర్డు. దాంతో, వన్డే సిరీస్ అనంతరం పొట్టి క్రికెట్‌లో తలపడనున్నాయి ఇరు జట్లు.

## నా 'ఆల్టైమ్ రికార్డు'ను వైభవ్ బ్రేక్ చేస్తాడు..!



టీ20ల్లో తుఫాన్ బ్యాటింగ్‌తో అలరిస్తున్న వైభవ్ సూర్యంశీ ఆటకు జోస్ బట్లర్ ఫిదా అవుతున్నాడు. విధ్వంసక ఓపెనర్‌గా ఎన్నో ధనాధన్ ఇన్నింగ్స్‌లో ఆడిన బట్లర్.. ది హండ్రెడ్ లీగ్‌లో మెరుపు అర్ధ శతకం బాదాడు. దాంతో, టీ20ల్లో కీరన్ పొలార్డ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును పట్టేశాడీ మాజీ కెప్టెన్. ప్రస్తుతం బట్లర్ ఖాతాలో 14,833కు పైగా రన్స్ ఉన్నాయి. అయితే.. తన రికార్డు ఏమంత పదిలం కాదని, భవిష్యత్‌లో ఎవరో ఒకరు తనను అధిగమిస్తారని చెప్పాడీ డాషింగ్ బ్యాటర్. ప్రస్తుతం టీ20ల్లో బట్లర్ 14,833 రన్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మాజీ ఆటగాళ్లు పొలార్డ్ 14,803, క్రిస్ గేల్ 14,562 పరుగులు, అలెక్స్ హేల్స్ 14,449, దేవిడ్ వార్నర్ 14,284 రన్స్ సాధించారు. వైభవ్ విషయానికొస్తే.. ఫ్రాంచైజీ, అంతర్జాతీయ టీ20ల్లో ఈ చిచ్చరపిడుగు 40 ఇన్నింగ్స్‌నే ఏకంగా 1,670 పరుగులు బాదేశాడు.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## ప్రపంచంలో 'జనపనార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?

- మనదేశంలో ఎక్కువసార్లు ప్రవేశపెట్టిన అత్యవసర సరిస్థితి ఏది?
  రాజ్యాంగబద్ధ అత్యవసర పరిస్థితి
- పూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యమని ప్రకటించిన సమావేశం?
  లాహోర్ సమావేశం
- నాజీ పార్టీ గుర్తు ఏమిటి?
  స్వస్తిక్
- సైమన్ కమిషన్ భారతదేశ పర్యటన?
  1927
- మానవుడిలో చక్కని ఆలోచనకు కారణమైన మెదడు భాగం?
  మస్తిష్కం
- పోలవరం ప్రాజెక్టుకు పెట్టిన పేరు
  ఇందిరాసాగర్
- వేప శాస్త్రీయ నామము
  అజా రక్తా ఇండికా
- తల్లిపాలలో ఉండే విటమిన్
  విటమిన్ 'ఎ'
- పశ్చిమంగా ప్రవహించే నది?
  తపతి
- మొక్కల నుండి వచ్చు ఆహారంలో వుండని విటమిన్
  విటమిన్ 'డి'
- చంపారన్ సత్యాగ్రహ ముఖ్యాంశం?
  నీలిమందు
- భారతదేశంలో ఎవరికాలంలో మొదటిసారిగా రైలు మార్గం వేశారు?
  డల్హౌసీ
- మోతీలాల్ నెహ్రూ స్థాపించిన పార్టీ?
  స్వరాజ్ పార్టీ
- వృక్షాయుర్వేదం గ్రంథాన్ని వర్గీకరణను ప్రతి పాదించింది?
  పరాశరుడు
- చౌరీచౌరా సంఘటన?
  1922
- హిమాలయ పర్వత రాజ్యంగా పేర్గాంచింది.
  నేపాల్
- 'విటమిన్ సి' లోపం వల్ల కలిగే వ్యాధి
  స్కర్వీ
- కేంద్రంలో ఎగువ సభ
  రాజ్యసభ
- 'త్రిషష్టి సలక పురుష చరిత' అనే గ్రంథాన్ని రచించిన జైన పండితుడు ఎవరు?
  హేమచంద్రుడు
- గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించినది?
  1920
- కిందివాటిలో వైరస్ వ్యాధి కానిదేది?
  మానవుడు – క్షయ
- నల్లజాతివారి హక్కుల కొరకు గాంధీజీ ఈ దేశంలో పోరాడాడు?
  దక్షిణాఫ్రికా
- కిందివాటిలో బౌద్ధమత సంగీతి జరగని ప్రదేశం ఏది?
  సారానాథ్



- ఒక మైక్రోమీటర్
  100 nm
- జింబాబ్వే రాజధాని
  హరారే
- ముట్టుకుంటే ముడుచుకునే పువ్వు
  అత్తిపత్తి
- రిపబ్లిక్ గ్రంథ రచయిత:
  ప్లేటో
- మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన సంవత్సరం
  1952
- గాంధీజీ జన్మించిన తేది?
  1869 అక్టోబర్ 2
- 'కౌండిన్య ఏనుగుల సంరక్షణ కేంద్రం' ఏ జిల్లాలో ఉంది?
  చిత్తూరు
- ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటుచేసిన చట్టం?
  1909 చట్టము
- కార్గిల్ విజయ్ దివస్ ఎప్పుడు నిర్వహిస్తారు?
  జులై 26
- బుద్ధుడు మొదటి ఉపన్యాసం చేసిన ప్రదేశం ఏది?
  సారనాథ్
- రెండు సార్లు ప్రవేశపెట్టబడ్డ ప్రణాళిక
  ఆరవ పంచవర్ష ప్రణాళిక
- చేప హృదయంలో గదుల సంఖ్య:
  2
- కిరణజన్య సంయోగక్రియలో క్రిందివాటిలో ఏది విడుదల అవుతుంది?
  ఆక్సిజన్
- మన రాష్ట్రంలో కెల్లా పెద్ద అడవులు
  నల్లమల అడవులు
- ఆఫ్రికాలో పెట్రోలియం లభించు నదీలోయ
  నైజర్
- వాక్సినేషన్ కనిపెట్టిన సంవత్సరం
  1776
- ప్రపంచంలో 'జనపనార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- గోవా రాష్ట్ర రాజధాని?
  పనాజి
- పిహెచ్ అనగా దేని అణువుల గాఢత?
  హైడ్రోజన్
- రాజ్యాంగంలో ఏది ప్రాథమిక హక్కు కాదు
  ఆస్తి హక్కు
- ప్రత్యేక హక్కులు లేనిది.
  సమన్యాయపాలన
- ఝరియా బొగ్గుగనులు గల రాష్ట్రం –
  ఝార్ఖండ్
- నాలుకపై ఎన్ని రుచులను తెలిపే గ్రాహకాలు కలవు?
  4 గ్రాహకాలు
- రక్తం ఎర్రగా ఉండడానికి కారణం అందులోని
  హీమోగ్లోబిన్
- అనిబిసెంటు హోమ్‌రూల్ లీగ్‌ను కేంద్రంగా చేసుకున్నది?
  మద్రాసు
- ముస్లింలీగ్ ఏర్పాటు?
  1906
- బెంగాల్ విభజనను ప్రతిపాదించినది?
  కర్జన్

# 'సర్దార్ సర్వాయి పాపన్న' పోస్టర్ లాంచ్

## * ఆర్కే ఫిలింస్ ద్వారా విడుదల



బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చేవారం థియేట్రికల్ రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్ర పోస్టర్‌ను గురువారం తెలంగాణ ఫిలిం ఛాంబర్ లో ఛాంబర్ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాని రామకృష్ణ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నసినిమా పోస్టర్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. దాదాపు 360 ఏళ్ల క్రితం బహుజన చక్రవర్తిగా వెలుగొందిన 'సర్దార్ సర్వాయి పాపన్న' జీవిత కథతో వెంకటేష్ గౌడ్ దర్శక నిర్మాతగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మా ఆర్కే ఫిలింస్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. అని చెప్పారు. దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడుతూ మా వి.జి. మూవీ మేకర్స్ బ్యానర్ పై 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమాను నిర్మించాం. మాకున్న వనరులకు ఇది భారీ బడ్జెట్ మూవీ అనే చెప్పాలి. అయినా సినిమా కంప్లీట్ చేసి సెన్సార్ పూర్తి చేసి రిలీజ్ కు తీసుకొస్తున్నాం. ఈ నెల 7నే మా మూవీని రిలీజ్ చేయాలని అనుకున్నాం. చిన్న సినిమాలకు థియేటర్స్ ఇబ్బందులు ఎలా ఉన్నాయో మీకు తెలుసు. ఈ నెల 14, లేదా 21న రిలీజ్ అనేది ప్లాన్ చేస్తున్నాం. సర్దార్ పాపన్న 376వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మా 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమాను రిలీజ్ చేయాలని భావిస్తున్నామన్నారు. నిర్మాణ పర్యవేక్షకులు దీపక్ న్యాతి మాట్లాడుతూ విదేశీయులు కీర్తించిన ఘన చరిత్ర సర్దార్ సరాయి పాపన్నది. అలాంటి పోరాట వీరుడి చరిత్రను కొందరు మరుగునపడేలా చేశారు. మంచి రచయిత, దర్శకుడు అయిన వెంకటేష్ ఎన్నో ఇబ్బందులు తట్టుకుని ఈ సినిమాను ఏఐ, యానిమేషన్ మూవీగా రూపొందించారు. సర్దార్ పాపన్న చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి గొప్ప చిత్రంగా రూపొందించారు. ఇది డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా రిలీజ్ కు వస్తుండటం సంతోషంగా ఉంది అన్నారు. ఈ చిత్రానికి వీఎఫ్ఎక్స్, సూపర్ విజన్ పి. శ్రీనివాస్, ఎడిటర్ సతీష్ పెటేటి, మణి, సినిమాటోగ్రఫీ, విజువల్ డైరెక్షన్ మిర్జాపురి సైమన్, లీడ్ ఏఐ విజువల్ డైరెక్టర్ సురేష్ మల్ల, మ్యూజిక్ సూపర్ వైజర్, లిరిక్స్ వెంకటేష్ గౌడ్ లింగంపల్లి, నిర్మాత, దర్శకత్వం వెంకటేష్ గౌడ్ లింగంపల్లి.

## రీల్



# 'మిషన్ పాజిబుల్'

## పోస్టర్ రిలీజ్

నటుడు, దర్శకుడు నవీన్ హిదయత్ రూపొందించిన తమిళ సూపర్ హిట్ డార్క్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మూదర్ కూడమ్'. 2013లో రిలీజైన ఈ సినిమాకు సీక్వెల్ గా మూదర్ కూడమ్ 2 రూపొందుతోంది. ఈ సినిమా 'మిషన్ పాజిబుల్' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నవీన్ హిదయత్, ఒవియా, సెన్రయాన్, రాజాజీ, కుబేరన్, జయప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నవీన్ హిదయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గ్రాండెల్ పిక్చర్స్ బ్యానర్‌పై సంకిత్ బోరా, కమల్ బోరా నిర్మిస్తున్నారు. 'మిషన్ పాజిబుల్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఓ నగరంలో డైనోసార్స్ భీభత్సం సృష్టిస్తుండటం, వాటిని తరిమేందుకు ఆర్మీ హెలికాప్టర్స్ రంగంలోకి దిగడం, శాంటాక్లాజ్ డ్రెస్‌లో ఉన్న ఒక బొమ్మను ఫాలో అవుతూ మూవీలోని ప్రధాన పాత్రధారులు పరుగెత్తడాన్ని చూపిస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఓ భారీ హాలీవుడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తలపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే 'మిషన్ పాజిబుల్' మూవీ సినీ ప్రియుల్లో ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. 'మిషన్ పాజిబుల్' సినిమాను ఇటలీ, జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, క్రోయేషియా, స్లొవేనియా, కజికిస్థాన్ దేశాల్లోని రేర్, బ్యూటిఫుల్ లొకేషన్స్ లో చిత్రీకరించడం విశేషం.ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు నవీన్ హిదయత్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులు చాలా ఏళ్లుగా మీ సినిమా సీక్వెల్ ఎప్పుడు అని అడుగుతూ వస్తున్నారు. సీక్వెల్ చేయాలి కాబట్టి పార్ట్ – 2 చేయాలని ఈ ప్రాజెక్ట్ టేపాజెక్ట్ చేయలేదు. మొదటి భాగం కథతో ప్రేక్షకుల్ని కనెక్ట్ చేస్తూనే వారిని ఆశ్చర్యపరిచే కథతో మిషన్ పాజిబుల్ సినిమా రూపొందించాను. అడ్వెంచర్ తో సాగుతూ ఎంటర్ టైన్ చేసే స్టోరీ ఇది అన్నారు. ప్రొడ్యూసర్స్ సంకిత్ బోరా, కమల్ బోరా మాట్లాడుతూ ప్రేక్షకుల ప్రేమాభిమానాల నుంచే కల్ట్ క్లాసిక్స్ వస్తాయి. నవీన్ ఈ కథ చెప్పినప్పుడే ఇది కేవలం సీక్వెల్ కాదు ఒక పెద్ద కాన్వాస్ మీద ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే సినిమా అనిపించింది. ప్రతి టెక్నీషియన్ ఈ మూవీని అందంగా తెరపైకి తీసుకొచ్చేందుకు కష్టపడ్డారు. మిషన్ పాజిబుల్ సినిమా ప్రేక్షకుల్ని థ్రిల్ కు గురిచేస్తూ ఎంటర్‌టైన్ చేస్తుంది అన్నారు.

# 15న వస్తున్న 'హుషారు పిట్టలు'



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బివిజి స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి 'టోంగా టోంగా' అనే హుషారు గీతంతో పాటు సక్కని గడియ పాటలను విడుదలచేశారు. వీటికి అనూహ్య స్పందన వచ్చింది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను 10న విడుదల చేస్తున్నారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు భిక్షు మాట్లాడుతూ మా సినిమ్మా 15న విడుదల చేస్తున్నాం. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 10న విడుదల చేస్తున్నాం అన్నారు. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా నచ్చి సపోర్ట్ చేస్తున్నాను. నిర్మాత సురేష్ బాబు చూసి నచ్చి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు.సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ నాకు కమర్షియల్ సక్సెస్ వస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా విజయంతో నాకు సినీ ఇండస్ట్రీలో కూడా గుర్తింపు వస్తుందని అనుకుంటున్నాను. ఈ సినిమా చూస్తున్నప్పుడు సెకండాఫ్‌లో నాలుగు సార్లు ఏడ్చాను.ఈ సినిమా మీకు నచ్చకపోతే ఎప్పుడూ కూడా మరో సినిమా చూడమని అడగను. ఈ సినిమా తరువాత నా కెరీర్ కూడా మారబోతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత వెంకట్ యాదవ్ ,హీరో అన్ను, హీరోయిన్ వాసవి గణేషన్, గీత రచయిత చిరంజీవ్, డిఒపి రుద్రసాయి, నటులు గోవర్ధన్, భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## 'అనకాపల్లి' రిలీజ్ తేదీ మారింది

హీరో విక్రమ్ సహిదేవ్ నటించిన 'అనకాపల్లి' చిత్రాన్ని ముందుగా ప్రకటించిన ప్రకార్మం 7న విడుదల చేయాల్సి ఉంది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలు, చిత్రానికి వస్తున్న స్పందన నేపథ్యంలో విడుదల తేదీని కొద్దిగా వాయిదా వేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇటీవల ఈ చిత్రానికి ప్రత్యేకంగా నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ షోకు అనూహ్యమైన, అద్భుతమైన స్పందన లభించింది. సినిమా కంటెంట్ చూసిన పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రాన్ని కేవలం తెలుగు వరకే పరిమితం చేయకుండా, తమిళం, మలయాళం తదితర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, తొందరపడి విడుదల చేయడం కంటే సినిమాకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా పరిశీలించి, సరైన ప్రణాళికతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది.ఈ సినిమా పేరు 'అనకాపల్లి'.ఈ సినిమా కథకు, షూటింగ్‌కు వేదిక అనకాపల్లి.ఈ చిత్ర నిర్మాత కూడా అనకాపల్లి బిడ్డే. అందుకే ఈ సినిమా మీద మాకున్న నమ్మకంతో, థియేట్రికల్ రిలీజ్‌కు ముందే అనకాపల్లి పట్టణంలో 4 నుంచి 5 ప్రత్యేక పబ్లిక్ షోలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాం.ఇవి ఇండస్ట్రీ కోసం వేసే ప్రివ్యూ షోలు కావు.సెలబ్రిటీల కోసం వేసే స్పెషల్ షోలు కావు.నిజమైన ప్రేక్షకుల కోసం.. అనకాపల్లి ప్రజల కోసం వేసే షోలు.'అనకాపల్లి'లో తొలి తీర్పు... అనకాపల్లి నుంచే రావాలి అని నిర్మాత అన్నారు.

# మూడు డిఫరెంట్ గెటప్స్‌లో 'మకుటం'



సూపర్ గుడ్ ఫిలీమ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మాణంలో రాబోతోన్న ఈ మూవీలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాని 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించడమే కాకుండా.. 7న ట్రైలర్‌ను విడుదల చేస్తామని అప్డేట్ ఇచ్చారు. ఇప్పటికే విశాల్ 'మకుటం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తుండటం. పైగా దర్శకుడిగా మొదటి సినిమా అవ్వడం, జివి ప్రకాష్ ఇచ్చిన మ్యూజిక్ అందరినీ ఆకట్టుకోవడంతో అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇక ఇప్పుడు సినిమా రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించడంతో ప్రమోషన్స్‌లో మరింత స్పీడ్ పెంచేలా కనిపిస్తున్నారు.ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. విశాల్, అంజలి, దుషార విజయన్, జాన్ విజయ్, జయ ప్రకాష్, అజయ్, వంశీ కృష్ణ, అబూ సలీం, అర్జయ్, ఝూన్సీ, పదం కుమార్, సభుమోన్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు.



## ప్రతీ గ్రామాన్ని అదర్శంగా తీర్చిదిద్దుతాం

గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి మండల కేంద్రాలలో నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశాలు జరిగాయి. గురువారం నిర్వహించిన ఈ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీలు గ్రామీణ పురోగతికి మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, వీధి దీపాల సక్రమ నిర్వహణ, పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా చేరువ చేయడంతో పాటు పంచాయతీల పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో గుర్తించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సంబంధిత మండలాల ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 11, 12 తేదీలలో సిపిఐ ప్రచారజాత

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు నకిరేకల్ నియోజకవర్గంలో ఈ నెల 11, 12 తేదీలలో ప్రచార జాతను చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ప్రచార జాత గోడ పత్రికను గురువారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దేశంతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందం మూలంగా వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. నరేంద్ర మదీ హయాంలో ప్రపంచ బ్యాంకు రుణం రూ. 151 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. సెప్టెంబర్ 1న చేపట్టిన ఛలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్, గీతపనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు బొలుగూరి లింగయ్య, షేక్ షరీఫ్, గుండాల సత్తయ్య, పి దేవేందర్, రావుల చిన్నవెంకన్న, దామనూరు అంజయ్య, యాదగిరి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉద్యమంలో 'సర్' కీలక పాత్ర

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్తగా, రాష్ట్ర ఏర్పాటుకు నాయకత్వం వహించి ప్రజలను, నాయకులను ఏకతాటి పైకి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఎంతో కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పటికి నిజాం పాలనలో ఉందని తదుపరి నిజాం పాలన నుండి స్వతంత్ర దేశం అయిన తదుపరి ప్రొఫెసర్ జయశంకర్ అన్యాయాలను ఎదిరించేందుకు పోరాటాల ద్వారా, సాహిత్యం ద్వారా ప్రజలకి వారి హక్కులు తెలిసేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, సిపిఓ కిషన్, డిఎం అండ్ హెచ్‌ఓ వెంకటరమణ, డిటిఓ రవి కుమార్, ఇంచార్జి పరిపాలన అధికారి శ్రీలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిల భవనాలు.. అధ్వాన్న వసతులు.. సంక్షేమ హాస్టళ్ల దుస్థితి

ఎఐఎస్ఎఫ్ మండిపాటు

**ప్రజాపక్షం/నాంపల్లి:** ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎస్సి బాలుర సంక్షేమ హాస్టల్‌ను గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి, అక్కడి సమస్యలపై పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు అందించాల్సిన దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, నోట్‌బుక్కు, దుస్తులు తదితర సామగ్రిని ఇప్పటికీ పంపిణీ చేయలేదని విమర్శించారు.హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శిథిలమైన భవనాలను వెంటనే మరమ్మతులు చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కాటిక ప్రేమ్‌కుమార్,బుషిపాక నిఖిల్,సిద్ధార్థ్, సాయితేజ, అనిల్‌కుమార్, షఫీక్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ప్రచార యాత్ర : పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ :** దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ, సామాన్య ప్రజలపై ధరల భారం, నిరుద్యోగం, ప్రైవేటికరణ, సంక్షేమ పథకాల కోతలతో కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ నియోజక వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక హక్కులను కూడా వ్యాపార వస్తువులుగా మార్చడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, ప్రజల కష్టాలపై లాభాలు ఆర్జించే కార్పొరేట్ అనుకూల విధానాలను సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో ఆగస్టు 06 నుండి ఆగస్టు 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలను ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల బలోపేతం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళల భద్రత, కార్మిక, రైతు హక్కుల పరిరక్షణ, రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ ప్రచార యాత్రలు సాగుతాయని తెలిపారు.
సిపిఐ జిల్లా క్యాదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి ప్రారంభం అయిన ప్రచార ఆందోళన నల్గొండ జిల్లా మునుగోడులో ప్రారంభమైందని దేవరకొండ నియోజకవర్గంలో 9వ తేది నుండి 12వ తేది వరకు ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశంలో మార్పు మొదలైందని విద్యార్థుల, రైతుల ఆందోళనలతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని అన్నారు. త్వరలో కేంద్రంలో ప్రభుత్వ మార్పు జరగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ప్రచార జాత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, మైనోద్దిన్, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ సిఎస్ దాన కిషోర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని పుట్టపాక గ్రామాన్ని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా పచ్చదనంతో మౌలిక వసతులతో ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు పారిశుధ్యం అంతర్గత రహదారులు డ్రైనేజ్ మొక్కల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలతో స్వయంగా మాట్లాడుతూ త్వరలో పుట్టపాకకు గవర్నర్‌ను తీసుకొస్తానని మహిళా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళిక పై గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు భవిష్యత్తులో ఏమైనా సహాయ సహకారాలు కావాలంటే డి ఆర్ డి ఏ ద్వారా సహాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పుట్టపాక స్వయం సహాయక బృందాలకు ఆరు కోట్ల రూపాయలు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కానుగుల యాదయ్య అనే రైతు ఏర్పాటు చేసుకున్న ఫామ్ ఫాండ్ ను ఆయన పరిశీలించారు. అనంతరం యాదయ్య ఏర్పాటు చేసిన చేపల కుంటలో ఆయన చేప పిల్లలు వదిలారు. అనంతరం స్థానికంగా ఉన్న చేనేత అవార్డు గ్రహీత గజం సత్యనారాయణ ఇంటికి వెళ్లి చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ కే.సి.ప్రమీల, డిఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, జెడ్పిసిఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ అడిషనల్ పిడి జంగారెడ్డి, డిఎల్పిఓ ప్రతాప్ నాయక్, స్థానిక ఎంపీడీవో ప్రమోద్ కుమార్, స్థానిక సర్పంచ్ ఆర్ఐ జుబేరుద్దీన్ ఉన్నారు.

## బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ..

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నేటి నుండి ఈనెల 14 వరకు జరుగు ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు అరికట్టడంలో విఫలమైందన్నారు. ధరల పెరుగుదల తక్షణమే ఆపాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వాగ్ధానం చేసి నేటికి అమలు చేయకపోవడం యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికి మెరుగైన విద్య, ఆరోగ్యం సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని వారు అన్నారు. భారత దేశ రైతాంగం పండించే పంటలకు మద్ధతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని రైతాంగాన్ని కాపాడాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని వారు కోరారు. ఆయా మండలాల్లో ఉన్న సమస్యలను జోడించి జరిగే ప్రచార యాత్రలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, ఎల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, నంద్యాల రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు, మండల పట్టణ, కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏర్పాటే జయశంకర్ జీవిత లక్ష్యం



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుండి చనిపోయే వరకూ తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి అవగాహన కల్పించిన వ్యక్తి అని,4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వారిలో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నీళ్లు, నిధులు,నియామకాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాల్లో ప్రజలకు అవగాహన కల్పించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 70,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని, మరో 7 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గద్దర్ పాటల ద్వారా చైతన్యం తెచ్చారని, తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో గద్దర్ ఒకరని,ఆయన తన పాటల ద్వారా ఊరూరా తిరుగుతూ ప్రజల్లో చైతన్యం కల్పించారని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్‌డిఒ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, మోహన్‌రెడ్డి ఉన్నారు.

## కార్మికులకు సమగ్ర చట్టాలు అమలులో ప్రభుత్వాలు విఫలం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి సమావేశం పూలమోని శంకర్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు సమగ్ర చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాట మారుతున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈనెల 25 వ తేదీన భువనగిరిలో జరిగే జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు చిలివేరు అంజయ్య, ఏఐటియుసి మండల కార్యదర్శి దుబ్బాక సంజీవ, జనగాం శంకరయ్య, ఉప్పరగొనిగిరి, శేఖర్, వెలుగు నరసింహ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** చేనేత కార్మికుల జీవనోపాధి పరిశ్రమ అభివృద్ధి కోసం హ్యాండ్లూమ్ మెగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి పవిత్ర మార్గ్గరీటకు పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారతి లవకుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం న్యూఢిల్లీలో భీమ్ హాల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో జరిగిన జిఐ బియాండ్ 2.0 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి పవిత్రమార్గరీటా టెక్స్‌టైల్ సెక్రెటరీ మేడం నీలం షమీ రావు డెవలప్మెంట్ కమిషనర్ బి మీనా, హెచ్‌ఈపిసి అధికారులు టెక్స్టైల్ రంగం అధికారులు పలు దేశాల నుంచి ఇంపోర్టర్స్ ఇండియా నుంచి సప్లై చేసే ఉత్పత్తిదారులు పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మంత్రితో కలిసి చేనేత పరిశ్రమ అభివృద్ధి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాలు ప్రోత్సాహకాల గురించి వారితో చర్చించారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొని పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమల తరపున ఉపన్యాసించారు. పోచంపల్లి పరిశ్రమపై సుమారు 45 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని వారికి జీవనోపాధి కొరకై భారత ప్రభుత్వం చేయాల్సిన కృషి కొరకు అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేయాల్సిన కృషి కొరకు సూచనలు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ యాత్రలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మిర్యాలగూడ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల నేతృత్వంలో ప్రచార యాత్రలు గురువారం ప్రారంభమయ్యాయి. మార్పు అత్యంత అవసరమనే నినాదంతో ఈ ప్రచార జాతాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నిత్యావసర ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి యువకుడికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సార్వత్రిక విద్యను, వైద్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని, రైతు పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టబద్ధత తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు రామలింగం, యాదగిరి, ఉదయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా కనకయ్య, మండల సమితి సభ్యులు గోగుల యాదగిరి, ప్రజానాట్యమండలి నాయకులు వెన్నెల వెంకన్న, మహిళా సమైక్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, శాంతి, ఎస్కే షమీం, గువ్వల మట్టయ్య, జమ్ముల కోటయ్య, భాస్కర్ల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పొలాల్లో దొంగల బీభత్సం

రాత్రి వేళ్లలో పోలీసుల గస్తీ పెంచాలని అన్నదాతల డిమాండ్



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రమైన మేళ్లచెరువు గ్రామంలో వరుస దొంగతనాలతో స్థానిక రైతాంగాన్ని తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. వ్యవసాయ రంగమే జీవనాదారంగా బతుకుతున్న రైతులను లక్ష్యంగా చేసుకుని దొంగలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. తాజాగా గ్రామానికి చెందిన బీమా ఉపేందర్ అనే రైతుకు చెందిన ట్రాక్టర్ దొంగల భారీన పడింది. రోజు వారి పనుల్లో భాగంగా ఆయన ట్రాక్టర్‌ను పొలంలోనే ఉంచి రాత్రి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆ ట్రాక్టర్‌ను సంబంధించిన సామాగ్రి బ్యాటరీ సహ విలువైన వస్తువులను మొత్తాను దోచుకెళ్లారు. ప్రస్తుతం సాగుసీజన్ నడుస్తుండటంతో విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కోసం ఇప్పటికే వేల రూపాయల పెట్టుబడి పెట్టిన తరుణంలో వరుస చోరీలతో కోలుకోలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాటు దొంగలు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, వైర్లు, స్టార్టర్ పెట్టెలను, ట్రాక్టర్ సామాన్లను దొంగలిస్తున్నారు. పోలీసుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో దొంగతనాల మహమ్మారి నుండి కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ భూముల పరిసరాలలో రాత్రి పూట పోలీస్ గస్తిని ముమ్మరం చేసి విద్యుత్ మోటార్లను, కాపర్ వైర్లను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

:కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని చెప్పారు.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని, గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తక్షణ చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బ్లాక్ స్పాట్లను సందర్శించి ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, మండల స్థాయిలో రహదారి ప్రమాదాలను తగ్గించడంలో తహశీల్దార్, మండల ఎస్.హెచ్.ఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్ సేఫ్టీ కమిటీ ద్వారా ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో రవాణా డిప్యూటీ కమిషనర్ వాణి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

## రాజ్యాంగ విలువల పరిరక్షణే ధర్మ సమాజ్ పార్టీ లక్ష్యం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సామాజిక న్యాయం, సమాన హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ధర్మ సమాజ్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజు అన్నారు.నల్లగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం అమలవ్వాలంటే బలమైన ప్రజా ఉద్యమం అవసరం. డిఎస్సి ఆ ఉద్యమానికి నాంది. కుల, మత, ప్రాంత వివక్షలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు రావాలనేదే మా పార్టీ సిద్ధాంతం అని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే ధర్మ సమాజ్ పార్టీని గడప గడపకు తీసుకెళ్లాలి. ప్రతి నాయకుడు,కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడి ప్రజలకు న్యాయం చేయిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర యాదవ్, మల్గ యాదయ్య,బాబు రావు నాయక్, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎల్లయ్య,జగన్,వంశీ,రవి,వినోద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# 'నిర్మల్'లో సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి





**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులతో కలిసి సేంద్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యానవన పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం, రైతుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రీయ సాగుపై దృష్టి పెట్టాలని, సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి పంట మార్పిడి విధానాలను విధిగా పాటించాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ పంటల ఉత్పత్తుల నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక విధివిధానాలను రూపొందిస్తోందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రీయ ఉత్పత్తులకు అత్యధికమైన డిమాండ్ ఉందని, రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.జిల్లాలోని రైతులకు సరిపడినంత ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోడు భూముల సమస్యలు, మార్కెటింగ్ సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.జిల్లాలో పంట మార్పిడి విధానాలు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దాదాపు 2 లక్షల మంది రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, సోయా, కందులు వంటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆయిల్ పామ్,పండ్లు, కూరగాయలు,పూల సాగు వంటి ఉద్యానవన రంగం వైపు రైతులను మళ్లిస్తున్నట్లు చెప్పారు. శ్రీరాంసాగర్, కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల కింద జిల్లాలో సాగు విస్తీర్ణం విస్తారంగా ఉందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం దాదాపు 20 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు జరుగుతుండగా..ఇందులో 8,300 ఎకరాల్లో ఆయిల్ పామ్, 5 వేల ఎకరాల్లో పసుపు సాగవుతున్నాయని వివరించారు. ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. రెవెన్యూ మ్యాపులు లేని 14 గ్రామాల్లో దాదాపు 30 వేల ఎకరాలకు గాను సర్వే చేపడుతున్నామని,అలాగే మరో 70 గ్రామాల్లో 62 వేల ఎకరాల భూముల సర్వే పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. భూ భారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డి.ఎఫ్.ఓ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు,రైతులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** జిల్లాలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. గురువారం కాగజ్ నగర్ మండలం కోసిని గ్రామ శివారులోని 79, 80 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమిని కాగజ్‌నగర్ ఆర్‌డీఓ చెన్నూరి కిష్టయ్య, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే కాగజ్‌నగర్ మున్సిపాలిటీ 15వ వార్డు కాపువాడలో రహదారి ఆక్రమణ, ఒక వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో స్థలాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు వెంటనే హద్దులు నిర్ధారించి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా

స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, అధికారులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా భవేష్ మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఇన్‌చార్జి కలెక్టర్‌ను అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌ఓ గీత సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన ఛాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్‌ను వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.అధికారులతో సమావేశమై వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రీ సర్వేతో రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ రాజేశ్వరి అన్నారు. ఆర్‌ఓఆర్ యాక్ట్ (భూ భారతి) 2024 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ఫైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో గురువారం కొనసాగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.. రీ సర్వేలో భూ రికార్డుల శుద్ధి జరిగి రైతులకు స్పష్టమైన హక్కులు కలుగుతాయన్నారు. రీ సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, దశల వారిగా అమలు చేస్తామని వెల్లడించారు. రైతులు సహకరించి రీ సర్వేను విజయవంతం చేయాలని ఆమె కోరారు. పోచారం గ్రామంలో 475ఎకరాల భూమి ఉందని, అందులో ఇప్పటి వరకు గ్రామ కంఠం 31ఎకరాలు, చెరువు 27ఎకరాలు రీ సర్వే పూర్తయ్యిందని అన్నారు. రైతులు సహకరించాలని, పోచారం గ్రామంలో రీసర్వే పూర్తవుతుందని అన్నారు. డిఐ దత్తు, సర్వేయర్ అరుణ, జిపివో నర్సయ్య ఉన్నారు.

## బోథ్ ఐసిడిఎస్ భవనం సందర్శన

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్‌లో గల ఐసిడిఎస్ కార్యాలయం తరలిపోతుందని వచ్చిన వార్తకు తక్షణమే స్పందించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంత్రి సీతక్కను కలిసి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.గురువారం బోథ్ లో శిథిలావస్థలో గల ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు.తాత్కాలికంగా ఐసీడీఎస్ పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయాలకొనసాగింపు కొరకు రూ. 20లక్షలతోఎంపిడివో కార్యాలయంపైన నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఐసీడీఎస్ కార్యాలయం2. ఇంటిగ్రేటెడ్ కార్యాలయం3. పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయాలపై అధికారులతోప్రజాప్రతినిధులతో చర్చించారు.ఎంపిడిఓ యల్.రమేష్, సిడిపిఒ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు స్వామి,మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌లు సుధీర్ రెడ్డి,రాజు,రవీందర్, బాబులాల్, సంజీవ్, మాజీ స ర్పంచ్ సురేందర్ యా దవ్,బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎలుక రాజు ,విడిసి చైర్మన్ పోతన్న, మెడిచేల్మా ప్రవీణ్,రమణ రెడ్డి, బత్తుల రమేష్, గంగమల్లు, సంజీవ్,సందీప్, సుజీల్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి

**ప్రజాపక్ష/భైంసా :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కౌన్సిలర్లు చింతపండు మహేష్ ఆమోల్ వాసులు అన్నారు.గురువారం రోజు భైంసా పట్టణంలోని జయశంకర్ కాలనీలో జయశంకర్ 92వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.జయశంకర్ యొ క్క ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా భైంసా పట్టణంలో జయశంకర్ స్మృతి వనం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెజ్జంకి రవి,జిల్లా కార్యదర్శి డాక్టర్ సాగర్, భైంసా పట్టణ అధ్యక్షుడు గోపాల్, కోశాధికారి అశోక్ ,ఆర్‌ఎస్‌ఎస్ లింగన్న ,శ్రీనివాస్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ ,చంద్ర లతోపాటు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సంక్షేమ సంఘం సభ్యులు కాలనీవాసులు, పాల్గొన్నారు.



## మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

'ప్రజాపక్షం' పత్రికకు, సర్పంచ్‌కు ప్రజల ధన్యవాదాలు

**ప్రజాపక్షం/ నేరడిగొండ:** మండల కేంద్రంలో సామూహిక ప్రజా మరుగుదొడ్లు లేక ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులపై 'ప్రజాపక్షం' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించారు. సమస్యను గుర్తించిన స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి ఎట్టకేలకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రానికి వచ్చిపోయే ప్రజల అవసరాలు, మహిళల ఇబ్బందులను పౌర సమాజానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ప్రజాపక్షం' పత్రికకు, అలాగే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన సర్పంచ్‌కు స్థానిక ప్రజలు, మహిళలు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ప్రజల రవాణా ఇబ్బందులను తొలగిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఉపసర్పంచ్ గులాబ్ సింగ్, సామాజిక కార్యకర్త సబ్లె సంతోష్ సింగ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక కొత్తపల్లి జయశంకర్

కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి తన జీవితాన్ని తెలంగాణ ప్రజల హక్కుల కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొపెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన ఆశయాలు బావిత రాలకు ఎల్లప్పుడు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బిసీ సంక్షేమ శాఖ అద్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు తో కలసి హాజరై ప్రొషెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఆకాంక్షలను ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక సామాజిక ఆర్థిక ఆచారాలతో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు, ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా ,ఆర్థిక వేత్తగా ఉద్యమ కారుడిగా ఆయన చేసిన సేవలు, తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అదనపు కలెక్టర్లు సంగీత మాట్లాడుతూ జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన మహామేదావి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సైద్ధాంతిక దిశా నిర్ధేశం చేసిన రచనలు ,ఉపన్యాసాలు, పరిశోధనలు ఉద్యమానికి ఉపారమైన మేదోబలాన్ని అందించాయని పేర్కొన్నారు. విద్యారంగంలోఆయన చేసిన సేవలు, సమానత్వం ,ప్రాంతీయ న్యాయం, సామాజిక చైతన్యంపై చేసిన ఆధ్యయనాలు, నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.ప్రొపెసర్ జయశంకర్, చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వా ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు.జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, జిల్లా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఒబి పనులు త్వరితగతి పూర్తి చేయాలి

సిపిఐ ఆధ్వర్యంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నత్తనడకడన సాగుతున్న ఆర్‌ఒబి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య అన్నారు. గురువారం సిపిఐ కేంద్ర కమిటీ ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించాలని పిలుపులో భాగంగా నిజామాబాద్‌లోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఓమయ్య మాట్లాడుతూ మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ. 93.12 కోట్ల నిధులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2022 జనవరి 17 న బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించినప్పటికీ 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సి ఉన్న నేటికి సగం పనులు కూడా పూర్తిగాక ప్రయాణీకులు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అసంపూర్తిగా పనులు నడపటంతో నిత్యం నిత్యం నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లేటువంటి వేలాది వాహనదారులు ఇబ్బందులకు గురవటం జరుగుతుందన్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారలు చిన్నపాటి వర్షం పడ్డ వాహనాలు అదుపు తప్పి గుంతలో పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పని చేస్తున్నామని చెప్పే ఎంపీ అరవింద్, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నిజామాబాద్‌కు ప్రధానమైనటువంటి మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పట్ల శ్రద్ధ చూపకపోవటం చూస్తుంటే జిల్లా పట్ల ప్రజల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. జిల్లా ఎంపీ, ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యాన్ని వీడి రైల్వే ఓవర్ బ్రిడ్జికి వెంటనే నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజారవాణాకు సాఫీగా సాగేలా చూడాలని కోరారు. రఘురాంనాయక్, సఖి సురేష్, గోవర్ధన్, ఫిరోజ్‌అలీ, ఇమ్రాన్‌అలీ, రంజిత్, గంగాధర్, భానుచందర్, రమేష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా ఇసుక లోడ్‌పై టార్పాలిన్ కప్పిన ట్రాక్టర్ యజమానులు




**ప్రజాపక్షం/ మావల:** ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణా ప్రయాణికులకు ముప్పుగా మారిందని 'ప్రజాపక్షం'లో ఇటీవలే ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఇసుక తరలింపు సమయంలో నిబంధనల ప్రకారం ట్రాక్టర్ పైభాగంలో తార్పాలిన్(తాడిపత్రి) కప్పకుండా ఓవర్ లోడ్‌తో రవాణా చేయడం వల్ల ఇసుక రేణువులు ఎగిరి వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కథనంలో వివరించారు. ట్రాక్టర్లపై ఇసుక లోడ్‌ను తార్పాలిన్‌తో పూరిగా కప్పి నిబంధనలు పాటిస్తూ ప్రయాణించారు. అధకారుల తనిఖీల కోసం వేచిచూచకుండా, 'ప్రజాపక్షం'లో కథనం వచ్చిన వెంటనే నిబంధనలు పాటించడానికి ముందుకొచ్చిన ట్రాక్టర్ యజమానుల చొరవ అభినందనీయం.

## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గత ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా కుటుంపడిందని, కాంగ్రెస్ హయాంలో నీరు పేదలకు అభివృద్ధి పథకాలు అందుతున్నాయని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. గురువారం నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల సమాఖ్య భవన ప్రారంభోత్సవాన్ని, సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి అడుగంటిందని, మెదక్ నియోజకవర్గన్ని నేడు అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతున్న ఘనత కాంగ్రెస్దేనన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. అనంతరం సర్పంచ్ గ్రామానికి గత కొన్ని ఏళ్లుగా బస్సు సౌకర్యం లేదని బస్సు సౌకర్యం కల్పించాలని, చల్మేడ, నందగోకుల్ గ్రామాలకు కంకర రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని తారు వెయ్యాలని, ఇస్సానగర్, నందగోకుల్ గ్రామ మధ్య బ్రిడ్జి ధ్వంసమైందని నూతన బ్రిడ్జి మంజూరు చెయ్యాలని సమావేశంలో కోరారు. ఉప సర్పంచ్ కుమార్, కార్యదర్శి భాగ్యలక్ష్మి , నాయకులు బాల్ రెడ్డి, అమరసేన రెడ్డి, వెంకట్ గౌడ్, దేశెట్టి సిద్ధరాములు, లక్ష్మాగౌడ్, స్వామి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే సునీత రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్:** సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫసర్ జయశంకర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీత రెడ్డి నివాసంలో ప్రొఫసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ ప్రొఫసర్ జయశంకర్ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిన చెప్పిన వ్యక్తి అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, నాయకులు సత్యం గౌడ్, పంబళ్ల బిక్షపతి, ఆనంద్ కుమార్, ఆంజనేయులు గౌడ్, షేక్ హుస్సేన్, మహమ్మద్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఖాళీల కలకలం

- మార్చి నుంచి ఆగస్టు వరకు 50 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ!
- గతంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా సర్దుబాటు చేసిన పోస్టులు 137
- రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్న విద్యాశాఖ అధికారి భోజన్న



**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల ల్లో ఉ పాధ్యాయ ఖాళీల సంఖ్య నిరంతరం పెరుగుతుండటం విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ఈ ఏడాది మార్చి 2026 నుండి ఆగస్టు 2026 నాటికి నూతనంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 50 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయినట్లు విద్యాశాఖ ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి.ఒకవైపు పదవీ విరమణలు, మరోవైపు ఇతర సాంకేతిక కారణాల వల్ల ఏర్పడిన ఈ ఖాళీల కారణంగా పలు పాఠశాలల్లో బోధనా ప్రక్రియ కుంటుపడుతోంది.గతంలోనే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల చదువు దెబ్బతినకుండా ఉండేందుకు విద్యాశాఖ అ ధికారులు 137 పోస్టులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) ప్రాతిపదికన భర్తీ చేసి తాత్కాలిక ఉపశమ నం అందించారు. అయితే, విద్యా సంవత్సరం సాగుతున్న కొద్దీ తాజాగా మరో 50 ఖాళీలు తోడవడంతో మ ళ్లీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రరూపం దాల్చింది.విషయా ల వారీగా ఏర్పడిన ఖాళీల వివరా లుతాజాగా సేకరించిన సమాచా రం ప్రకారం ఏర్పడిన 50 ఖాళీల లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ) ప్రైమరీ పాఠశాలలకు చెందిన (ఎస్‌జిటి) పోస్టు లు అ ధికంగా ఉ న్నాయి. స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్), 6 స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్), 04 స్కూల్ అసిస్టెంట్ (హిందీ), 02స్కూల్ అసిస్టెంట్ (గణి తం),02స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్): 02 స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్), 13స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), 01సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్ జిటి), 20మొత్తం ఖాళీలు 50పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో తల్లిదండ్రుల ఆందోళనవిభాగా ల వారీగా పరిశీలిస్తే ముఖ్యంగా సోషల్ స్టడీస్ (13), ప్రైమరీ తరగతులకు బోధించే ఎస్జీటీ (20), పోస్టులు అధిక సంఖ్యలో ఖాళీగా పడి ఉ న్నాయి. ప్రైమరీ స్థాయిలో పునాది విద్య బలహీనపడటంతో పాటు ఉన్నత తరగతుల్లో ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పడిపోతాయని, రాబోయే వార్షిక పరీక్షల ఫలితాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నూతనంగా ఏర్పడిన 50 ఖాళీలలో కూడా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించి, బోధన ను సజావుగా సాగించేలా యుద్ధపాతిపదికనతీ సుకోవాలని కోరుతున్నారు.

**రెండు రోజుల్లో పూర్తి అడ్జస్ట్మెంట్ చేస్తాం :** డిఈఓ భోజన్నపాఠశాలల్లో ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీల అంశంపై జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) ఎ. భోజన్న స్పందించారు.చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రెండు రోజుల్లోనే వర్క్ అడ్జస్ట్ మెంట్ ప్రక్రియను పూర్తి చేసి, ఖాళీగా ఉన్న చోట ఉపాధ్యాయులను సర్దుబా టు చేస్తామని హామీ ఇచ్చారు.



## ఎస్‌పిఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో ఎస్‌పిఎం కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 79వ రోజుకు చేరిన సందర్భంగా ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. స్థానిక ఎంఎల్ఎ, ఎంఎల్‌సిల నిర్లక్ష్యం వల్లే యాజమాన్యం ఎన్నికలు జరపడం లేదని, దీనివల్ల కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. పాత కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, 10 మంది సభ్యుల కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ, ఎన్‌సిఎల్‌టి నిధులు, వార్షిక బోనస్‌పై విచారణ జరిపించాలని, ఒప్పంద పత్రం విడుదల చేసి, కాంట్రాక్టు కార్మికుల జిఒను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ధరలు వర్తింపజేస్తూ, స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని, వెంటనే ఎన్నికలు నిర్వహించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
07-08-2026
www.prajapaksham.in

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు జరుగు పాదయాత్రలు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పాదయాత్రలను సిపిఐ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.




### కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ

# రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** పెట్టుబడిదారులకనుగుణంగా, కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని, ఆదానీ, అంబానీల మాయలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పడ్డాడని, ప్రజలకు సామాజిక న్యాయం లేదని, పేదల బ్రతుకులకు భద్రత కరువైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడానికి సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతను గురువారం కరీంనగర్ నగరంలోని పద్మనగర్ వద్ద చాడ వెంకటరెడ్డి సిపిఐ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన తెలియజేసేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14వరకు పాదయాత్రలు జరుగుతాయని తెలిపారు. దేశంలో పెరిగిపోతున్న ధరలను తక్షణమే అరికట్టాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం కల్పించాలని, కార్మికుల హక్కులు పరిరక్షించాలని, ప్రజలందరికీ సార్వత్రిక ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని ప్రధాన డిమాండ్లతో ఈ పాదయాత్రలు జరుగుతున్నాయని చాడ వెల్లడించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగేందర్, నాయకులు పోలోజు రంజిత్, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, కసిబొజుల సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం : భాగం

**ఖమ్మంరూరల్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్యం ముప్పులో పడిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర గురువారం ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడులో ఎర్రజెండాల రెపరెపలు, డప్పుల మోతలు, నినాదాల మధ్య ప్రారంభమైంది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ దేశంలో మార్పుకోసం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పన విషయాన్ని మరిచిపోయిందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, చట్టాలు కేవలం అంబానీ, అదానీల వంటి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే తీసుకొచ్చారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష, నియంతృత్వ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సిపిఐ జాతీయ పిలుపు మేరకు ఆగస్టు 6నుంచి 15 వరకు ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మొహ్మద్ సలాం, బిజీ క్లెమేట్, అజ్మీర రామ్మూర్తి, నాయకులు చిన్న వెంకట్‌రెడ్డి, పుచ్చకాయల సుధాకర్, ఉన్న రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, పగీళ్ల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించాలి : కలవేణ

**శ్రీరాంపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బస్ స్టాండ్ వద్ద విద్యా, వైద్య, ఉపాధి హక్కుల సాధనకు సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజాపోరు యాత్రను గురువారం ఆయన ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలవేణి శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాలను ఎండగడుతూ, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పాదయాత్రలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పోరాట జాతాను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఆశీర్వదించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, రేగుంట చంద్రకళ, మిర్యాల రాజేశ్వరరావు, కొట్టే కిషన్ రావు, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, ఇలవేణి సారంగపాణి, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మణ్, దేవి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి : బాలనరసింహ్మ

**నాగర్‌కర్నూల్ :** ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, సామాజిక అసమానతలపై ప్రజలను చైతన్యవంతం చేయాలనే ఉద్దేశ్యంలో సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లాలోని బిజినపల్లి మండల కేంద్రంలో గురువారం పాదయాత్ర, ప్రచార యాత్రను బాలనరసింహ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, బిజినపల్లి మండల కార్యదర్శి కృష్ణాజి, తన్నీరు మల్లయ్య, మారేడు శివశంకర్, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, భూపేష్, నరసింహ, పర్వతాలు, శివకృష్ణ, రామస్వామి, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా జరుగుతున్న సిపిఐ ప్రజా చైతన్య ప్రచార యాత్ర గురువారం మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామంలో అమరజీవి తండా రామచంద్రు స్తూపం నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, నాయకులు కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, బానోత్ లింగ్య నాయక్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, మేక వీరన్న, మాలోథ్ రవీందర్, కే దాసు రమేష్, అజ్మీర వేణు, నక్క నాగార్జున, తండ సతీష్, బానోత్ సుమన్, పబ్బతి మురళి, తేజావత్ వినయ్, బర్ల రాములు, ఏడెల్లి కృష్ణ, తండా శ్రీనాథ్, తండ శ్రీను, కళాకారులు రవీందర్, పులి యాకయ్య, రమేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

**మందమర్రి :** విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ చెన్నూరు నియోజకవర్గం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు యాత్ర మందమర్రిలో ప్రారంభమైంది. మందమర్రి మార్కెట్ లోని అమరజీవి అబ్రహం స్తూపం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఎర్రజెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్లావ్ జరూరి హై మార్పు రావాలి అనే నినాదంతో ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పోరాటాలు నిర్వహించడమే ఈ యాత్ర ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి :** కేంద్రంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న పాలనను ఎండగొట్టేందుకు సిపిఐ పాదయాత్రలు చేపట్టిందని నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌ఎండి.ఫయాజ్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో సిపిఐ పాదయాత్రను, నాగర్‌కర్నూల జిల్లా సిపిఐ కార్యదర్శి ఫయాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నాగ్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టినట్టు తెలిపారు. ఆగస్టు 6న పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రారంభమై ఆగస్టు 14న కొల్లాపూర్ పట్టణంలో పాదయాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు టి.నరసింహ, ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి తప్పట కిరణ్‌కుమార్, బండి లక్ష్మీపతి, సిపిఐ పెద్దకొత్తపల్లి మండల్ ఇంచార్జి ఎం.లక్ష్మీనారాయణ, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అలంపూర్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం కంచిపాడులో గురువారం నిర్వహించాన సిపిఐ రాష్ట్ర వ్యాప్త పాదయాత్రను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురవరం విజయలక్ష్మి మాట్లాడుతూ మతం పేరుతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను ప్రజలు అప్రమత్తంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సురవరం కపిల్, నాయకులు రవి, రంగన్న, ఆశన్న, నాగార్జున, భరత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్ల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలుపై పోరాటం కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం తెలిపారు సిపిఐ జాతీయ పిలుపుమేరకు గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో సిపిఐ ప్రచార యాత్ర ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, కార్యక్రమంలో సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు భూమేశ్వర్, ఎత్తండి భూమయ్య, సుతారి రాములు, ఎండి ముక్రం, ఎన్నం రాధ, మునుగోరి హనుమంతు, ఎండి.ఉస్మాన్, గాధ దేవదాస్, పిట్టల నారాయణ, అందే వంశీకృష్ణ, ఎండి సమీర్ సుశీల, ప్రజానాట్యమండలి నాయకుడు చిట్యాల లక్ష్మిరాజం, పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వాలు అధికారంలో కొనసాగే హక్కు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ సిపిఐ చేపట్టిన ప్రచార యాత్రను గురువారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్టలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన నాయకులు కీర్తి, శ్రీకాంత్, వంశీ, సిపిఐ . ప్రజాసంఘాల నాయకులు నరసయ్య, బక్కరి మల్లేష్, శ్రీనివాస్‌చారి, నగేష్ చారి, బాల నర్సయ్య, సాగర్, దీప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతూ సామాన్య ప్రజలపై ధరల భారం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సంక్షేమ పథకాల కోతలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల జీవితాలనను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్ బోస్ అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం ఎంఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి, కమలానగర్, కుషాయిగూడ వరకు కరపత్రాలను పంచుతూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, గిరిబాబు, వెంకటేష్, నర్సింగరావు, సుదర్శన్, మల్లేష్, విజయ్, సురేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షులు ఎండి అజీం పాషా, సమీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్...


ఖమ్మం...


శ్రీరాంపూర్...


నాగర్‌కర్నూల్ జిల్లా...బిజినేపల్లి...


మేడ్చల్ మల్కాజిగిరి..ఉప్పల్...


మహబూబాబాద్...


పెద్దకొత్తపల్లి


మేడ్చల్...కుత్బుల్లాపూర్...


కోరుట్ల...


మందమర్రి...


ఆలంపూర్...


మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పూణేలోని మహాత్మా జ్యోతి రావు నివసించిన ఇంటిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా




ఒడిషాలో సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న బద్లావ్ జరూరి హై పాదయాత్రలో పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, నేతలు డాక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జయంత్ దాస్, రమణి రంజన్, దామోదర్ బెహ్రా, సురజెనా, సువేంద్ర ప్రతాప్ మహంతి తదితరులు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com